భారతి

1966 డిసెంబరు

★

కొండమెట్లు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

అమాయికం

శ్రీ బండి నాగరాజు

సెక్షన్ 109

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

★

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

డిసెంబరు 1966

★

సంపుటము 43 : : సంచిక 12 :

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

డిసెంబరు 1966

ఈ విషయాలు ఇందు లేవు.

అమాయికం

శ్రీ బండి నాగరాజు

"నన్నందరూ మారా లంటున్నారు;
మంచి మాటే, మారతాను!
మారటం — మనిషికి, కాదు — ప్రతిజీవికీ లక్షణంకదా మరి?
వద్దనుకున్నా మారిపోతాను.
ఇప్పటికి అనుకోకుండా ఎంత మారిపోయాను?
ఐతే, ఎట్లా మారుతున్నా ననేది సమస్య!
నలుగురితోపాటు మారుతున్నానా? నే నొక్కణ్నే మారుతున్నానా?
తటాల్న మారాల్నా? తటపటాయిస్తూ మారాలనా?
ఏ కోరికా లేకుండా మారలేను;
    నలుగురికీ కావలసిన మార్పు నాకూ కావాలి
నా అంతట నేనొక్కణ్నే ఎలా మారగల్ను? మారతాను, నిదానంగా—
తొందరపడటం, ఉత్తపడటం అవుతుంది!
నా కోసం ఒకరు మారినప్పుడు
వారికోసం నేను ముందే మారిపోయుంటాను!

*   *   *

నే నింకా పెరగా లంటున్నారు!
అవును, తప్పకుండా పెరగాలి; పెరుగుతాను.
పెరగటమంటే మంచివైపుగా మారటం గదా?—
మంచీగించీ మళ్లీ దానంతటదే వస్తుంది,
ముందు బాగా పెరిగి పొమ్మంటున్నారు—
కాని, ఊరికే పెరిగి యేం లాభం? ఉపయోగం వుండొద్దూ?
పెరగడం ఒక క్రమంలో జరగాలి గదా?
నేనేం వంకాయనా, నల్ఫేటుకు పెరగడానికి?
నేను—నా అంతట నేను—

సర్ఫేటులాంటి ఎరువుమాటలకు గబగబా పెరిగిపోతే
నేనూ సర్ఫేటు వంకాయ నౌతానా?

*　　*　　*

నన్నంతా, అభివృద్ధికి రావలసినవాడవని ఆశీర్వదిస్తున్నారు! కృతజ్ఞుణ్ని...
ఐతే, ఏది అభివృద్ధి? నాకేం బోధ పడ్డం లేదు!
నే ననుకునే అభివృద్ధి, ఆశీర్వాదకుల అభివృద్ధికన్నా
భిన్నంగా వున్నట్లు తోస్తున్నది!!


అందువల్ల కాబోలు,
వాళ్ల ఆశీర్వాదాలు నామీద పనిజెయ్యడం మానేస్తున్నాయి!?
అందరి అభివృద్ధిలాంటిదే నాకూ రావాలి, వస్తే—
ప్రత్యేకం నాకుమాత్రం అభివృద్ధి ఎలావస్తుంది?
వారు ముద్రవేసిన అభివృద్ధి నాకు నిద్ర తెప్పిస్తున్నది!

*　　*　　*

నే నేమీ తెలియని అమాయికుణ్నని
నా కందరూ అండగా వుండ జూస్తున్నారు!
నేనూ తెలియనివాణ్నే, నిజం!
అమాయికుణ్నే—చాలా మట్టుకు నిజం!!
నాకూ అండ వుండాల్సిందే, లేకుంటే బతకలేను!
మరి నేనే బొత్తుగా తెలియనివాణ్ణంటున్నారు...
నిజమా?
నిజమైనా, నే నంగీకరించ లేకుండా వున్నానే!?
అందుకేనేమో, నేనేమీ తెలియనివాణ్ని?....
అవును, నేనేమీ తెలియనివాణ్ని!
అమాయికుణ్ని!!
అండలేని వాణ్ని!!!

భౌగోళిక వాతావరణ విశేషములు

శ్రీ సర్దేశాయి తిరుమలరావు



కాళిదాసకృత మేఘసందేశ కావ్యేతి వృత్తము చిత్రమయినది. కమనీయమైనది. రమణీయమైనది. దయనీయమైనది.

కుబేరుని శాపము మూలమున, ఒక యక్షుడు రామగిరియందు సంవత్సర కాలము ప్రియురాలిని ఎడబాసి ప్రవాసమనుభవించుచు, ఆషాఢమాస ప్రథమ

దివసమున సాక్షాత్కరించిన వర్షామేఘము ద్వారా అలకాపట్టణమున నివసించు ప్రియురాలికి ప్రణయ సందేశము పంపిన ఉదంతము వర్ణింపబడినది.

ప్రకృత వ్యాసమున, మేఘసందేశమునుండి తెలిసికొనదగిన భౌగోళిక, వాతావరణ విశేషములు చర్చింపబడును.

మొట్టమొదట భూగోళ విషయమును తీసికొందము. మేఘుడు పోయిన మార్గమును అనుసరింతము.

మేఘుని మార్గము

మేఘుడు రామగిరినుండి తన ప్రయాణమును ఆరంభించును. (జనక తనయా స్నానపుణ్యోదకేషు... రామగిర్యాశ్రమేషు. శ్లో. 1). ఉత్తరమున కెగురును. (ఉత్పతోదఙ్ముఖః ఖం శ్లో. 14). కొంచెము పడమరకు తిరిగి ఉత్తరాభిముఖుడగును (కించిత్పశ్చాద్వ్రజలఘుగతిర్భూయ ఏవోత్తరేణ. శ్లో. 16.). ఆమ్రకూటమును చేరును (సానుమానామ్రకూటః. శ్లో. 17). ఆమ్రకూటమునుండి వింధ్యపర్వతపు లోయలో పారు రేవా నదిని దాటును. (....తత్పరం వర్త్మతీర్ణః రేవాం ద్రక్ష్యస్యుపల విషమే వింధ్యపాదే విశీర్ణాం. శ్లో. 19). దాటి దశార్ణ దేశము ప్రవేశించును. (సంపత్స్యంతే కతిపయ దిన స్థాయి హంసా దశార్ణాః. శ్లో. 24). వేత్రవతీ నదీతీరములగల యట్టియు, దశార్ణ దేశమునకు రాజధాని అయినట్టియు విదిశను దర్శించును. (తేషాం దిక్షు ప్రథితవిదిశా లక్షణా రాజధానీం..వేత్రవత్యాశ్చలోర్మి. శ్లో. 25). 'నీచై' అను పేరుగల కొండనెక్కును. (నీచైరాఖ్యంగిరిమధివసేస్తత్ర. శ్లో. 26). ఉత్తరదిశకు పోవలసియున్న మేఘునకు చుట్టయినను ఉజ్జయిని గుండా పోవలసినదని యక్షుడు మేఘుని కోరును. (వక్రః పంథా యదపి భవతః ప్రస్థితస్యోత్తరాశాం, సౌధోత్సంగ ప్రణయ విముఖో మాస్మభూరుజ్జయిన్యా. శ్లో. 28). ఇంతవరకు పశ్చిమోత్తరముగ పయనించు మేఘుడు ఇప్పుడు పశ్చిమమునకు తిరుగును. నిర్వింధ్య అను నదిని దాటును. (వీచిక్షోభ... నిర్వింధ్యాయాః పథి. శ్లో. 29). అవంతీ దేశములోనికి ప్రవేశించును. (ప్రాప్యావంతీన్...పూర్వోద్దిష్టా మనుసర పురీం శ్రీవిశాలాం విశాలాం. శ్లో. 31). ఉజ్జయినీ నగరమును బాగుగా చూచును. శిప్రానదీ పవనముల ననుభవించును. (శిప్రావాతః. శ్లో. 32). మరల పశ్చిమోత్తరము వైపు సాగును. గంభీరానది, (గంభీరాయా పయసి. శ్లో. 44), దేవగిరి (ఉపజిగమిషోర్దేవ పూర్వం గిరిం తే. శ్లో. 46), మీదుగవెళ్లి చర్మణ్వతీ నదిని సత్కరించి (వ్యాలంబేథాః సురభి తనయా లంభజాం మానయిష్యన్, స్రోతోమూర్త్యా భువి పరిణతాం రంతిదేవస్య కీర్తిం. శ్లో. 49), దశపురము చేరును. (తాముత్తీర్య...దశపుర. శ్లో.51). దశపురము నుండి సూటిగ ఉత్తర దిక్కున నుండు బ్రహ్మావర్తమునకు పోవును. అచ్చటి కురుక్షేత్రమును భజించును. ((బ్రహ్మావర్తం జనపదం,......క్షేత్రం.... కౌరవంతద్భజేథా. శ్లో. 52). సరస్వతీనదీజలమును సేవించును. (కృత్వా తాసా మధిగమ మపాం సౌమ్య సారస్వతీనాం. శ్లో. 53). ఇపుడు మేఘుడు తూర్పునకు మరలును. హిమాలయమునుండి మైదానమునకు దిగిన చోట గంగానదిని దాటును. (తస్మాద్గచ్ఛేరను కనఖలం శైలరాజావతీర్ణాం, జహ్నోః కన్యాం. శ్లో. 54). పిదప ఆ గంగకేదిపుట్టినిల్లో ఆ హిమాలయములోనికి ప్రవేశించును. (తస్యాఏవ ప్రభవమచలం ప్రాప్యగౌరం తుషారైః. శ్లో. 56). ఈశ్వరుడు ఒకానొకప్పుడు పదమూనినచోటును గాంచును మేఘుడు. (తత్రవ్యక్తం దృషది చరణన్యాసమర్ధేందుమౌళేః శ్లో. 59). క్రౌంచాద్రి బిలముద్వారా హంసల వెంబడి ఉత్తరము వైపు సాగును—మానస సరోవరమునకు. (హంసద్వారం.....యత్క్రౌంచరంధ్రం, తేనోదీచీం దిశమనుసరే... శ్లో 61). క్రౌంచరంధ్రమునుండి వెల్వడి అంతకన్న పైనున్న కైలాసపర్వతమునకు, పోవును. (గత్వాచోర్ధ్వం... కైలాసస్య. శ్లో. 62). ఆ కైలాసము దగ్గర బంగారు కమలముల కాకరమైన మానససరోవర జలమును త్రాగును. (హేమాంభోజ ప్రసవి సలిలం మానస స్యాదదానః. శ్లో.66). తుట్టతుదకు కైలాసపర్వతము మీది అలకాపట్టణము చేరును. (తస్యోత్సంగే ప్రణయిన ఇవ స్రస్త గంగా దుకూలాం, నత్వం దృష్ట్వా నపునరలకాం. శ్లో. 67). అలక మేఘుని చివరి మజిలీ. ఇంతటితో మేఘుని ప్రయాణము ముగియును. "మేఘసందేశ" మందు పూర్వమేఘము ఇది. మనకు కావలసినదింతవరకే.

మేఘ సందేశమందలి స్థలాదికముల నేటి నామములు

పై వర్ణనమున కాళిదాసు ప్రయోగించిన స్థలాదికముల నామములే వాడబడినవి. వీనికి క్రమముగా నేడు వ్యవహారములో నున్న పేర్లు ఇట లీబడినవి.

నాడు	నేడు
రామగిరి	నాగపూర్ సమీపమందలి రాంటెక్. ఇది వైన్‌గంగ సమీపమున ఉన్నది.
ఆమ్రకూట పర్వతము	మహాదేవకొండలు
వింధ్యపాదము	వింధ్యలోయ
రేవానది	నర్మదానది
దశార్ణదేశము	భోపాల్ — బుందేల్ ఖండ్
విదిశపట్టణము	బెస్ నగర్, భిల్సాయో
వేత్రవతీనది	బెట్వా
ఉజ్జయిని	ఉజ్జయిని
శిప్రానది	షిప్రా
చర్మణ్వతీనది	ఛంబల్
దశపురపట్టణము	మాండసార్
బ్రహ్మావర్తము	హరియానా ప్రాంతము
సరస్వతి, దృషద్వతి	రావి సట్లెజ్ నదులకు సమాంతరముగ ఆగ్నేయముగ ప్రవహించిన నదులు. ఇవి అంతరించినవి. నేడు లేవు.
కురుక్షేత్రము	కురుక్షేత్రము
"శైలరాజావతీర్ణాం... జహ్నోః కన్య"	హరిద్వారము దగ్గరి గంగానది
అచలం...గౌరంతుషారైః	హిమాలయము
మానసము	మానససరోవరము
కైలాసము	కైలాసశిఖరము
అలక	(ఊహాకల్పితము) మాత్రమే

మేఘుడుపోయిన దిక్కులు

రామగిరి నుండి కైలాసశిఖరము సరిగా సూటిగ ఉత్తరమున నుండును. ఇది అన్నిటికన్న దగ్గరి త్రోవ. ఆ దగ్గరి త్రోవ విడిచి మేఘుడు పోయిన దిక్కులు, తిరిగిన మలుపులు అనేకములు. వైవిధ్యములతో కూడినవి. ప్రయాణదిశలిట్లు సూచింపవచ్చును:

ఉత్తరము, కొంచె
రామగిరి ——————> ఆమ్రకూటం——
ము పడమర, తిరిగి
(భారతదేశపు ఉత్తరము
నడిబొడ్డు)

ఉత్తరము ఉత్తరము
———> రేవానది ———> విదిశ———

పడమర పశ్చిమో
———> ఉజ్జయిని ———>
త్తరము

ఉత్తరం
దశపురము ———> బ్రహ్మావర్తము———

తూర్పు ఉత్తరము
———> హరిద్వారము———>

మానస కైలా సాలకలు.

పై స్థలాదికములతోడి మేఘుడు పోయిన దారి పటము చూడ ముచ్చటగ నుండును.

భౌగోళిక విశేషములు

మేఘుడు పోయిన ప్రదేశములు నిజముగా ఉండెనా లేక అవి కాళిదాసు భావాంబరములో మాత్ర ముండెనా? అప్పుడవి నిజముగనే ఉండినట్లయిన నేడవి ఉన్నవా? నేటి హిందూదేశమున కాళిదాసు చెప్పిన చోటనే అవిఉన్నవా? గుర్తింపగలమా? ఒక ప్రదేశముగాని, కొండగాని, నదికాని, పట్టణముగాని పరస్పరము సరియైన దిక్కులలో సరియైన నైసర్గిక భౌగోళిక పరిస్థితులలో నున్నవా? రామగిరి కుత్తరమున వింధ్య ఉన్నదా? వింధ్య లోయలో నర్మదానది యున్నదా? నర్మద కుత్తరమున విదిశ ఉన్నదా? విదిశ, వేత్రవతీనది యొక్క ఒడ్డున ఉన్నదా? విదిశకు పడమట ఉజ్జయిని ఉన్నదా? ఉజ్జయిని నుండి పశ్చిమోత్తరముగ దశపురము చేరుటకు చర్మణ్వతీ నదిని దాటవలెనా? దశపురమునుండి బ్రహ్మావర్తము మధ్య మేఘునకు మజిలీలు లేకుండుట ఆ ప్రాంతము మరుభూమి అగుటచేతనా? ఇట్టి సూక్ష్మ విషయములు పూర్తిగ నిజమని మేఘసందేశము

లోని మేఘమార్గ వర్ణనము పరిశీలించిన తెలియును. భారతదేశమనగా ఒకే భౌగోళికాంశముపు స్పష్టమైన విజ్ఞానమును వెదజల్లిన ప్రాచీన భారతీయులలో కాళిదాసు ఒకడు. వాల్మీకి వ్యాస ఆదిశంకర వేంకటాధ్వరు లితరులు.

ఉత్తరం యత్సముద్రస్య
హిమాద్రేశ్చైవ దక్షిణం
వర్షం తద్భారతం నామ
భారతీ యత్ర సంతతి—అని.

(విష్ణుపురాణము. II, 3.1)

వాతావరణ విశేషములు

మేఘుడు పయనించిన దిక్కుల సమన్వయము కష్టముగ ఉన్నది. మేఘుడు రామగిరిని వదలినది ఆషాడమాస ప్రథమ దివసమున. అప్పుడు నైరృతి ఋతుపవనములు వీచుచుండును. ఇవి ముఖ్యముగ, పడమటనుండి తూర్పునకు వీచును. ఈ పవనముల గమనమార్గములోగల ప్రాంతీయ భేదములు ఎచ్చటి కచ్చట దిగువ పేరాలలో సూచింపబడును. పవనము లెట్లు వీచునో మేఘములట్లు పోవును. "మేఘ సందేశ" రంగమయిన రామగిరి యుండు నేటి మధ్య ప్రదేశమందు ఆషాడమందు పవనములు పశ్చిమము నుండి తూర్పునకు వీచుచుండును. అనగా, మేఘములు కూడ పశ్చిమమునుండి తూర్పునకు పోవుచుండును. కాని "మేఘసందేశ" మున మేఘుడు రామగిరి నుండి ఉత్తరముగ ఆమ్రకూట వింధ్యపాద రేవా విదిశలకు ప్రయాణము చేసినట్లున్నది. ఇదెట్లు సాధ్యము?

వాతావరణ శాస్త్రము ప్రకారము మేఘములు రెండు విధములు. ఒక కిలోమీటరు ఎత్తువరకు ఏర్పడునట్టివి. ఇవి వర్షామేఘములు. ఇవి ఆషాడ మాసమున పడమరనుండి తూర్పునకు ప్రయాణము చేయును. ఇంక రెండవ తరగతికి చెందినవి రెండు కిలోమీటరు ఎత్తులో . నేర్పడునట్టివి. ఇవి పొడి మొయిళ్లు. ఇవి పశ్చిమోత్తరముగ వీచవచ్చును. మన మేఘుడు వర్షించు తరగతికి జెందినవాడు కావున తూర్పుకు పోవలెనుగాని రామగిరి నుండి ఉత్తరదిశ కెట్లు పోగలడు?

తర్వాత,

విదిశ నుండి మేఘుడు పశ్చిమమునకు సాగి ఉజ్జయిని జేరును. యక్షుడు మేఘునితో, "వక్ర పంథాయదపి భవత ప్రస్థిత స్యోత్తరాశాం.. ఉజ్జయి న్యా" అను శ్లోకములో పశ్చిమమునకు బోవుటకు గల నెపమును చెప్పినాడు. ఇది కావ్యశిల్ప దోహద కారియగునేమోకాని యాథార్థ్యమునకు న్యాయము చేకూర్చునదిగాలేదు. మేఘుడుత్తరమునకు బోవుట యను విషయము సరియైనపుడు గదా, పశ్చిమము నకు బోవుటకు నెపము గల్పింపవలెను?

కాళిదాసు వాతావరణ పరిశీలనము జోలికేపోపక ప్రాచీన కవి సమయమునే పాటించి యుండవచ్చును. దక్షిణానిలము ప్రాచీనకవి సమయము. ఔత్తరాహ కవులకు దీనియందు మోజు మెండు. దక్షిణానిల మార్గానుసారము మేఘుడుత్తర దిశకు పోయినట్లు వర్ణింపబడినదా? కాళిదాసుకు ప్రకృతి కవి అన వచ్చును. తాను స్వతహా పరిశీలించిన ప్రకృతినే సూక్ష్మ సూక్ష్మముగ వర్ణించు కాళిదాసునెడ ఈ వాదము చెల్లదు. మేఘుడుజ్జయినినుండి పశ్చిమోత్తరమున నున్న దశపురమునకు బోవుటకూడ సాధ్యముకాని సంఘటన. దశపురమునుండి సూటిగ ఉత్తరాభి ముఖముగ ప్రయాణముచేసి మేఘుడు బ్రహ్మావర్తము చేరును. ఇది నైరృతిఋతుపవనముల గమనమార్గ మునకు కొంత సరిపోవచ్చును. ఏలయన కచ్ సింధు శాఖపైనుండి ఋతుపవనములు రాజాస్థానము పంజాబువైపు వీచుచుండును. దశపురములోని మేఘుడు ఈ గాలులలో చిక్కుకొని ఉత్తరము వైపు పోయి యుండవచ్చును. కురుక్షేత్రమునుండి తూర్పు దిక్కుకు తిరిగి హిమాలయముల వైపు పోవుట కూడ పొసగదు. ఏలయన ఈ ప్రాంతమున నైరృతిఋతుపవనములు హిమాలయమునుండి పడమట దిక్కునకు వీచుచుండును. మేఘుడు గాలుల కెదురుగ ఎట్లు ప్రయాణము చేయగలడు? హిమా చలము ప్రవేశించిన మేఘుడు కొంచెమీశాన్యపు దిక్కున సాగి మానస కైలాసములజేరును. హిమా లయములలో మాత్రము మేఘుని పోకడను ప్రశ్నింప జాలము. హిమాలయములోపల గాలులు ఎప్పు డెట్లు వీచునో చెప్పుటకు వీలులేదు.

వాతావరణ విషయక చర్చ

అషాఢమాస ప్రథమ దివసమునుండి వర్షా మేఘము "మేఘ సందేశ" ములో వర్ణింపబడినట్లు దక్షిణమునుండి ఉత్తరమునకు పోవుట నైరృతి ఋతుపవన చలన మార్గమునకు, వాతావరణశాస్త్రము (Climatology) నకు విరుద్ధము.

ప్రసిద్ధ కవి సమయమయిన దక్షిణానిలము మనసున ఉంచుకొనియే మేఘముత్తర దిశకుపోయి నట్లు వర్ణించినాడు కాని నిజముగ మేఘమెట్లు పోవుచున్నదను విషయమును లక్ష్యమే పెట్టలేదు, అనువాదము సరికాదు. దీనికి రెండు కారణములున్నవి. ఒకటి, కాళిదాసు అనౌచిత్య దోషమునైన సైచును గాని ప్రకృతి విరుద్ధ వర్ణనముల జేయడు. "కుమార సంభవము" జూడవచ్చును. రెండు, రామగిరి నుండి కైలాసము వరకు పోవుటకు కాళిదాసెన్నుకొనిన మార్గము. మేఘుడు పోయిన దారి (రామగిరినుండి కురుక్షేత్రము వరకైనను) భారతదేశములో అంత రామణీయకమయినది కాకపోయినను, అంతకంటె మంచి త్రోవలున్నను, మేఘుని ఈ దారినే పొమ్మనుట అకాలములో అషాఢమాసము నాటి ఋతుపవనములు "మేఘసందేశ" మందు వర్ణింపబడినటులే వీచు చుండెనా అను బలవదనుమానము కలిగించుచున్నది.

కాళిదాసు కాలములో అషాఢమాస మందు మేఘములు "మేఘసందేశ" మందు చెప్పిన రీతినే ప్రయాణము చేయుచుండెనేమో! తర్వాత తర్వాత వాతావరణము మారి నేడు ఋతుపవనములు ఇంకొక విధము వీచుచున్నవేమో! రెండు వేల ఏండ్లలోనే వాతావరణ పరిస్థితి ఇంతగ మారునా? ఏల కాకూడదు? సరస్వతీ దృషద్వతి నదులు నేడు కన్పడవు. ఇవి కొన్ని వేల ఏండ్లకే ఇంకిపోయినవి. నేటి రాజాస్థానము పూర్తిగ మరుభూమి యగుటకు, హరియాన ప్రాంతము పంచనద ప్రాంతము (పంజాబు,పాకిస్థానము లోని పంజాబు)ల కంటె విస్తారతరమగుట కిదే సంఘటన కారణమని భూగోళశాస్త్రజ్ఞుల మతము.

ఇట్టి శాస్త్ర విషయములెన్నియో "మేఘ సందేశ" మున ఇమిడి యున్నవి.

శాస్త్ర విషయ కౌద్దాలికులకు "మేఘ సందేశము" విజ్ఞాఖని. విజ్ఞులు విచారింప వినతి.

---

1. "మేఘసందేశ" వాతావరణ విశేషములయెడ అడిగిన కొన్నివిషయములపై తమ అమూల్యాభిప్రాయముల నొసంగిన Directer- General of Observatories, Meteorological Department climatology and Geo-Physics Section, New Delhi వారికి నా కృతజ్ఞతాపూర్వకాభివందనములు.



కొండమెట్లు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

ముసురు పట్టింది.

ధర్మం.. ఉద్యోగధర్మం.. తప్పదు కదా!

"చీమాచా! వానలో తడవొద్దు. జలుబు చేస్తుంది.." అనేది అమ్మ. ఆమె మాటంటే లక్ష్యం లేదు.—తాగితప్పు పడవలు—అదే పనిగా తడవటం.— జలుబు చేసేది.—జ్వరం వచ్చేది.—అమ్మ కోప్పడేదికాదు. నాన్నతో చెప్పేదికాదు—చెబితే చర్మం ఒలిచేవాడు...

ఈ నీళ్లోడుతున్న గొడుగుని తీసుకుని జాగ్రత్త పెట్టుతాడేమో ననుకుంటే ఏడీ వీడు గరుడయ్య, ఎక్కడా కనిపించడే! లైబ్రరీ తీసిపెట్టి వీడెక్కడికి వెళ్లినట్లబ్బా!

అబ్బ! వణుకు పుట్టుతోంది.

"చీమాచా! స్వెట్టర్ తొడుక్కుని వెళ్లనాయవా!" ఏనాటి అమ్మ! ఇప్పుడెందుకో జ్ఞాపకం? ఇప్పు డేజ్వరమూరాదు...చిత్రం, అలా చెప్పేవాళ్లుంటే అన్నీ వస్తాయి...ముసలితనం ప్రవేశించి...

ముసలితనం?

అవును, దేహాన్ని కుర్చీ రోజాకు రోజా మరీ కటువుగా, నిర్దాక్షిణ్యంగా పలకరిస్తోంది...

రెట్టైరై ఎనిమిదేళ్లు — ఎనిమిదీ అయిదూ పదమూడు—అంటే అరవైమూడేళ్లు.

షష్టిపూర్తి—ముసలితనం కాక పడుచుతనమా?

అంత బ్రతుకూ బ్రతికి, పట్టె చేతులో పుట్టిన ఊరు, ఏకాకిగా చేరుకోక తప్పలేదు. కాలేజీ లైబ్రరీలో ఈ ఉద్యోగం.. దేవస్థానంవారి దయా, ఏడుకొండలవాడి దయా—

ఉద్యోగం వ్యాపకం — కాదు ధర్మనిర్వహణ — కాదు కర్మచేస్తూ ఉండటం—ఉద్యోగం లేకపోయినా పెన్షన్‌తో గడుస్తుంది.. అంతే.. బొంబాయి మాత్రం వచ్చినా వెళ్లే అవసరం రాదు... ఎందుకు వస్తుందీ? వాడు చచ్చాడనీ, కొడుక్కాదనీ ఇరవై ఏళ్ల క్రితమే చెప్పడమైంది.

దేశం, జాతి, మతం, కులం, అన్నీ తప్పాడు.

కడుపున చెడబుట్టాడు ... ముందుగానే దాటుకున్న ఆండాళ్ అదృష్టవంతురాలు... తల్లి చావుకు రాలేకపోయిన దౌర్భాగ్యుడు అమెరికాలోనే అడుక్కుతింటూ ఉండక తిరిగి ఎందుకు వచ్చినట్లు?

"కిచ్చూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు — కిచ్చూ అమెరికా వెళ్తున్నాడు — టాటాస్‌వాళ్లు ఎనిమిది వందలిస్తామన్నారు—బొంబాయిలో దిగి ఉద్యోగంలో చేరాడుట—రేపు వస్తాడుట—"అందరికీ చాటింపు వేసి గొప్పలు చెప్పుకుంటే దరిద్రుడు, భ్రష్టుడు, కృతఘ్నుడు, ద్రోహి, తెల్లదొరసానితో వచ్చి, హోటల్‌లో దిగి రాయబారం నడుపుతాడా?—ఛీ! ఛీ!! ఫోరా ఫో—నీ ముఖం చూపించకు—వేంకటేశా!, స్వామీ! నీదయ!!...

మమతలు త్రుంచివేశావు— పరీక్షలు పెట్టావు. ఒకదాని మీద ఒకటి...

ఆండాళ్ పోయినప్పుడు అమెరికా వదలి రాలేక పోయాడు తుచ్ఛుడు.

—విశ్వాసం, తల్లి అన్న విశ్వాసం ఉంటే రాకపోవునా?—వచ్చి బాగుపడకపోవునా?—అప్పటికే ఒళ్లమ్ముకున్నాడో ఏమో!—కుక్క!—దొరసాని లాప్ డాగ్ (lap-dog) వాడూ మనిషే...

"గరుడయ్యా! గరుడయ్యా!!"

"ఏం సామీ?"

"ఇంతసేపూ ఎక్కడున్నావ్?"

''ఇక్కడే.. నిన్నటి పుస్తకాలు సర్దుతున్నా..''

''నేనొచ్చింది చూశ్లేదూ?''

''లేదు''

దొంగముండావాడు!

''పేపర్లొచ్చాయా?''

''ఆఁ. టేబిల్ మీద పెట్టినా సామీ''

''హిందూ యిలా తీసుకురా''...

''కొలంబో ప్రతిపాదనలు.. అంగీకరించినట్లు నెహ్రూ ప్రకటన''

ఎందుకీ తాపత్రయం నెహ్రూకి! దెబ్బలు తినడమూ మనమే, సంధికి ప్రాకులాడటమూ మన మేనా!....

'జాన్సన్స్ బేబీ పౌడర్'..

కిమ్పాకీ పిల్లలు ఉంటారు యీపాటికి .... అంగ్లోయిండియన్ పిల్లలు!..

రామ! రామ!...

ఏంపేరు పెట్టాడు?— టామ్, డిక్, అండ్ హారీ—హరీ కాదు హరీ! ఏదీ వాడికా మగతనం, వ్యక్తిత్వం ఏదీ?—వ్యక్తిత్వం ఉంటే ఏ ఆర్యసమాజం ద్వారానో దాన్ని హిందువుని చేసి ఏడవక పోవునా?...

ఉత్తరాలొచ్చేయి...

మూడు కేటలాగులూ, ఒక పత్రికా. అమూల్యమైన రహస్యాల్ని మోసే లేఖలకు మల్లే ఎప్పుడూ చేతికే అందిస్తానంటాడు హుసేన్.. ఈ పోస్టుమన్ హుసేన్ ఒక రాబట్. కొయ్యబొమ్మ. చక్కిలిగింతలు లేని రాతిబొమ్మ..

బూబుని పరదాలోంచి బయటికి లాగటం పత్రికని ర్యాప్ పేపరు నుంచీ వివస్త్రను చేయ్యటం..

హ హ్హ...హాఁ...లైఫ్

అప్పుడు పదేళ్ల వయసు.. ఇంకా ఇప్పుడు చూస్తున్నట్లుంది. మేడ మీద కిటికీ నుంచీ. స్నానం చేస్తున్న వివస్త్ర. అదే ఓం ప్రథమం..

'లైఫ్'... అమెరికన్లకి లైఫ్ అంటే కేవలం క్రురతనం..

అబ్బ! ఎన్ని ఉత్తరాలో!

ఉత్తరాల్ని తాకడంలో ఒక సరదా ఉంది!.. నాకా? నా కెక్కణ్నుంచీ వస్తుంది ఉత్తరం? ఏమో!.. అర్థంలేని ఆశ.. అడ్రసులు చదవటం పెద్ద అలవాటై కూచుంది.. ప్రమాదంలేని వ్యసనాలు!

కార్డులు తల్లిదండ్రులు వ్రాసేవి — విశేషాలేమీ ఉండవు.

విశేషాలన్నీ—క్రురతనపు విశేషాలు ఇన్‌లాండ్ లెటర్లలో, కవర్లలో దాక్కుని ఉంటాయి. — రహస్యాలు— స్నేహాలు— సంబంధాలు— వాంఛలు— ప్రేమలు — సినిమాలుచూచీ నవలలుచదివీ తెచ్చిపెట్టుకునే అనవసరపు బెడదలు!

ప్రభావతి ఫస్టు బి. ఎస్‌సి. వాళ్ల నాన్న దస్తూరీ— కార్డు—వారానికోసారి బాగా చదువుకొమ్మని వ్రాస్తాడు— గ్రామకరణం దస్తూరీ.

కుమారి జానకి—సెకండ్ బి. ఎస్‌సి—గులాబీరంగు కవరు!

ఇదివరకెన్నడూ ఉత్తరం వచ్చినట్టు లేదు జానక్కి... తల్లిదండ్రులిక్కడే ఉన్నారయ్యె. టైపు చేసిన అడ్రసు...పుస్తకాల కంపెనీ కావచ్చు...ఇంత నాజూకు కవరు ఉపయోగిస్తారా? ఎక్కణ్నుంచీ?... పోస్టు ముద్ర?....

ఓహ్! సువాసన గుబాళిస్తున్న కవరుగాని మరోటికాదు!

న్యూఢిల్లీ...దూరాభారమే...

జానకి! పారిజాతప్పువ్వు... ఎర్రరంగు చీరలో స్వచ్ఛంగా, పవిత్రంగా, విప్పారిన తెల్లని సౌందర్య రాశి!...

మహాగంభీరంగా ఉంటుంది— కొత్త పెళ్లికూతురులా ఉంటుంది — ఈ కాలపు పెళ్లికూతురులా కాదు—పాతకాలపు, బిత్తరిచూపుల, సిగ్గుదొంతరల, సౌకుమార్యాల పెళ్లికూతురు—అందరూ ''గుడ్ మార్నింగ్'', 'నమస్తే' అంటారు జానకి మాత్రం అలా అనదు— అసలు పెదవి విప్పదు—మహా అయితే మధురంగా ఎప్పుడన్నా చిరునవ్వు నవ్వుతుంది....

చెలికత్తెల వెనుకనక్కే రాజకుమారిలా వస్తుంది హంసనడకలు నడుస్తూ—ఒంటరిగా ఎప్పుడూ రాదు— ఆకాశరాజు కూతురు పద్మావతి లాగ..

వచ్చి నిలుచుంటుంది పుత్తడి బొమ్మ లాగ..

తెచ్చిన పుస్తకం అడిగితేగాని చేతికివ్వదు — తనకు కావలసిన పుస్తకం పేరు చీటీ మీద వ్రాసి తెస్తుంది—నోటితో చెబితే ముత్యాలు రాల్తాయని కాబోలు!.. ఆ నోరు, ఆ చక్కని పెదవులు ఎప్పుడూ ఒక స్నేహితురాలి భుజం వెనకాల దాక్కుంటాయి— మెరుపు చూపులు మాత్రమే మాట్లాడతాయి—

ఈ పరిమళం ఆమెకోసం! ఆమె యీ పరిమళం కోసం!!

అబ్బ!!

అయ్యో!....

ప్రళయం వస్తూన్నట్లు ముసురుపట్టి, సూర్యుడి కాంతి అంతా హరించుకుపోయి,

మృత్యువులాగా, చలి వణికిస్తూ, పాడుగా ఉన్న ఒక ఉదయాన—

పరిమళ పారిజాతం పతనమై పోయిందా!

'టింగ్'—

తొమ్మిదన్నర.

''అయ్యగారూ! జాబులు లెటర్ బోర్డ్‌లో పెట్టిరానా?''

గులాబీ కవరు సొరుగులో పడింది...

''ఆఁ.. ఇదుగో ఈ కార్డుని గర్ల్స్‌రూమ్‌కి తీసుకు వెళ్ళు.''

స్టూడెంట్స్ వస్తూపోతూ ఉన్నారు. జనసమ్మర్దం ఎక్కువై పోతోంది..

పుస్తకాలిస్తున్నారు, పుచ్చుకుంటున్నారు..

న్యూస్‌పేపర్లు, వారపత్రికలు, మాసపత్రికలు తిరగ వేస్తున్నారు..

ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో గది వేడెక్కిపోతోంది..

లెడ్జర్‌లో ఖాతా పెరుగుతోంది— భూలోకపు పుణ్యపాపాల్తో చిత్రగుప్తుడి చిట్టా కూడా పెరుగుతూనే ఉంటుంది...

లోపల దాగిన రహస్యాలు జీవితాల్ని దహించి వేస్తున్నాయి..

ఎవరో! ఏమిటో కథ!..

అపశ్రుతి, అధర్మం ఆరని జ్వాలగా బ్రతుకుని బూడిద చేస్తూనే ఉంది...

లోకంలో పవిత్రత సౌందర్యం నిలవనీరు—సర్వం మైలపడి నశించాల్సిందే!

ఆశ—చివుళ్ళు తొడిగిన పచ్చని చెట్టుని మొదలంట నరికేశాడు కిరాతుడు—దాన్నే బొగ్గుగా—నల్లగా కాల్చేసి పోయింది కమలాక్షి!

కమల—ఎలా పెంచినపిల్ల, నిప్పులాంటిది, ఎలాచేసి, పోయింది!

ఆటాప్సీ.. అవమానం..

కాష్ఠం.. బూడిద..

అంతే!

''టింగ్..టింగ్..టింగ్..టింగ్....''

పదిగంటలు. అందరూ వెళ్ళిపోయారు - వెళ్ళిపోయారు— నిర్మానుష్యం—నిర్విశేషం.

ఏం మిగిలిందనీ, ఎవరున్నారనీ, యింకా జీవించటం?

ఉద్యోగం.. ధర్మం—ధర్మం తప్పదు కదా!

శ్రీనివాసుడు..వేంకటేశుడు..

శాంతి..ప్రశాంతి.. శరణాగతి..

''గరుడయ్యా!''

''స్వామీ!''

''ఈ పుస్తకాలన్నీ తీసుకెళ్ళి సర్దేయ్.''

''మధ్యాన్నం అన్నీ ఓమాటే పెట్టేస్తానండి''

''బద్ధకమా? ఎప్పటి పని అప్పుడు చేసెయ్యాలి.''

గరుడయ్య లోపలికి వెళ్ళిపోయాడు. అరగంటయ్యేవరకి రాడు...

అబ్బ!

ఎవరూ లేరు...

కవరు ఉంది...

అవును...

వేశ్యకూతురిలా సువాసనలు గుబాళిస్తోంది!...

నిస్సహాయంగా ఉంది—దీనంగా ఉంది..జానకి!జా..న..కి!! మిటారిపిగ్గ నటిస్తోంది—తననితాను దాచుకుంటోంది. పెదవులు బిగబట్టినట్లు..అదంతా కులుకే!..కులట కవ్వింపే!..

ఆడదాన్ని నమ్మరాదని ఊరికే అన్నారా?..
ఆడది భోగవస్తువు...
జానకి అందం పెళ్ళయ్యే దాకా ఆగలేదు!
స్వాతంత్ర్యం— స్వయంనిర్ణయం— ఏం కాలం మహా ప్రభో!
అవినీతి, అధర్మం, విగ్నమాలినతనం — దీన్ని అరికట్టాలి!..
నాశనం చేయాలి!..భగ్నం చేయాలి!..
చిరిగింది కవరు గులాబీ!.. చిరిగింది!
భగ్నమైందీ కవ్యాత్వం ! ... బయటపడిందీ రహస్యం!..
నల్లగలువలాంటి నీలికాగితపు లేఖ!—ఆహా!
"డార్లింగ్ జానీ!..."
ఏమిటా పిలుపు? పెంపుడు కుక్కని పిలిచినట్లు!...
ఛీ ఛీ...
"డార్లింగ్ జానీ!

నువ్వింత బేలవు, పిరికిదానివి అనుకోలేదు. నిన్నెలా మరచిపోతాననుకున్నావు?.. నేను ఉత్తరం వ్రాయకపోవటానికి కారణం—ఆ మాత్రం ఊహించ లేవూ! ఆ నాడు వక్షాన్ని వక్షంతో అదుముతూ, ఈ రెండు హృదయాల స్పందనమూ రహస్యమూ ఒక్కటేనని నాకు బుద్ధిచెప్పిన దానివి, నీయింటి అడ్రసుకు నేను ఉత్తరం వ్రాయరాదని ఆంక్ష పెట్టిన దానివీ నువ్వే, రెండునెలలు కాలేదే, యిలా కోప్పడుతూ, నామీద దోషారోపణ చేస్తూ వ్రాయడం ఎందుకో!...

నన్ను గూర్చి మా బంధువులెవరో చెప్పిన ఆ సంగతేమిటో చెప్పకుండానే నన్ను నిందిస్తూ నంజాయిషీ అడిగితే నేనేం వ్రాయగలను? నీ చదువు పూర్తికావాలనీ, నా ఉద్యోగానికి ఒకచోటు అంటూ కాస్త నిలకడ ఏర్పడాలనీ కదా అనుకున్నాను. ఆ మాటకు భిన్నంగా జరుగుతుందని ఇంతలో నువ్వెందుకూ అనుకోవడం?....

నువ్వు వ్రాసిన ఆ చివరి వాక్యాలు నాకు ఆందోళన కలిగిస్తున్నాయి సుమా! నీకు జీవితం మీద అంత విరక్తి ఎందుకు కలుగుతూ ఉందో యింత దూరం నుంచీ ఊహించుకోలేని నా అశక్తతని క్షమిస్తావా!.. ఉత్తరం కాలేజికి వ్రాయమన్నావు, వెంటనే వ్రాస్తున్నాను. ఈ భాగ్యానికి పదిహేను రోజులు గడువెందుకు? "వ్రాయకపోతే మళ్లీ కనిపించను" అంటావే ఏమిటా సందేహం నీకు! నీ ధోరణి నాకు చాల భయం కలిగిస్తోంది జానీ! ఎదురుగా ఉంటే 'ఎదలో ఎదనై' నీవేనేనై, ఎలానో నచ్చజెప్పుకునే వాణ్ణి. ఇప్పుడు నీ హృదయాన్ని నువ్వే అనునయించు కోవాలి మరి! వెంటనే సమాధానం వ్రాస్తావు కదూ!

నీ
రామం.

వక్షాన్ని వక్షంతో అదుముతూ బుద్ధులు చెప్పిం దట! ఔరా తెంపరితనం! మళ్లీ చూడటానికి నంగనాచిలా ఉంటుంది.. ఎంత బూటకపు పోజ్!.. ఎవరి కళ్ళ కనిపిస్తే ఏమైపోతానో అనేంత పతివ్రత వేషాలు పైకి చూస్తే!..
అయ్యో, స్త్రీని నమ్మి బాగుపడిన వాడెవడు?..
ఈ వయసుకే—తల్లీదండ్రీ, భయమూ భక్తీ, సంఘమూ దేవుడూ ఏమైనా వుంటేనా! కామం కళ్ళకు కప్పితే ఏమైనాసరే-ఎదలో ఎదనై!- అహా!- ఏం మాట!—ఎన్నిసార్లయిందో అలా ఎదలో ఎద! నీవేనేను!

* * *

"'రెబెకా'?... ఆ నవల ఎవరో తీసుకు వెళ్ళి నట్టు జ్ఞాపకమోయ్!.. ఉండు చూస్తాను..

అవును.. అది ఒక బి. ఎస్‌సి. అమ్మాయి దగ్గరుంది... ఓవర్ డ్యూ....

..గరుడయ్యా!"

"ఏం సామీ?"

"బి. ఎస్‌సి. జానకి, ఈమధ్య 'రెబెకా' పుస్తకం రిటర్న్ చెయ్యలేదూ?"

"ఏమో సామీ!"

"మేష్టారూ! ఇంకేం జానకండీ! మీరింకా వినలేదా? పెద్దగొడవగా ఉంది. ఆయమ్మాయి రాత్రి విషం త్రాగి చనిపోయింది!—పోలీసులూ, జనం, హడావుడిగా ఉంది, దొడ్డాపురం వీధిలో—మేము వెళ్లాం.. వాళ్ళెవర్నీ లోపలికి రానివ్వడంలేదు—ఇవ్వాళ కాలేజికి సెలవు కూడా యిస్తారనుకుంటున్నారు."

"విషం తాగిందా?.. ఎందుకేమిటి?"

ఎందుకేమిటి? కానిపనులు చేస్తే—కమలాక్షి దారే జానకీ చూసుకుంది..

"కారణం ఏమీ లేదండీ.. మంచి గర్లండి.. కాలేజిలో అంత మాడెస్ట్ ఎవరూ లేరండి.. వాళ్ల నాన్న ఏదో కోప్పడ్డారనీ.. ఇంటి గొడవలు.."

"అమాత్రానికే ఎవరైనా చచ్చిపోతారా! ఏం విపరీతపు కాలం!"

"ఏం చెబుతామండి! కొంతమంది మరీ సెన్సిటివ్..."

సెన్సిటివ్! సెన్స్‌లెస్!! కమలాక్షి, జానకి...
అంతా ఒకటే కథ!..
ఇదుగో, నోటీసు రానేవచ్చింది....
సంతాప సమావేశం.. వెంటనే, గంట కొట్టగానే అందరూ చేరాలి.. తర్వాత సెలవు...
రెండు నిమిషాలు మౌనం అందరూ..
జానకి ఆత్మకు శాంతట! ఇలా అర్ధాంతరపు చావులు చచ్చేవారికి శాంతి ఎలా వస్తుందీ?
అందరూ వెళ్తున్నారు—వెళ్లిపోతున్నారు నిర్మానుష్యం.

*   *   *

శ్రియఃపతే! శ్రియఃపతే!!
జానకి ఎందుకు తాగిందో విషం!
అటాప్సీలో ఏమీ తేలలేదుట— కమలాక్షిలా చావలేదు జానకి!!..
మరేమిటి కారణం? ఎందుకు చచ్చిందీ?..
కేవలం ఆ ఉత్తరం వ్రాసిన వాడు రాలేదనేనా?!..
వస్తానని వ్రాశాడుగా ప్రేమని ఒలకబోస్తూ...అంతలో తొందరా!..
ఏదీ ఆ ఉత్తరం?
"..నీకు జీవితం మీద అంత విరక్తి ఎందుకు కలుగుతూ ఉందో ఊహించుకోలేని నా అశక్తతని క్షమిస్తావా!.." అశక్తతట! ఏడిశాడు!
"..ఉత్తరం కాలేజికి వ్రాయమన్నావు. వెంటనే వ్రాస్తున్నాను, ఈ భాగ్యానికి పదిహేను రోజులు గడువెందుకూ?".. గడువా! గడువు పెట్టిందన్నమాట!..
హరిహరీ! ఉత్తరం అందకపోవటమే కారణమా? చావుకి!

"వ్రాయకపోతే మళ్లీ కనిపించను.."
మూడో తేదీ ఉత్తరం వ్రాశాడు.. ఇవ్వాళ ఇరవై.. బెదరింపుకాదు, గట్టి నిర్ణయమే!
నిర్ణయం ప్రకారం చేసేసిందీ?..
ఉత్తరం రాలేదనే విషం తాగిందీ?..
ఉత్తరం రాకపోతే ఆత్మహత్య!..
ఉత్తరం వచ్చింది.
జానక్కి.. ఎదురు చూస్తున్న జానక్కి అందలేదు!...
చచ్చిపోతామని బెదరించే ఆడవాళ్లు లోకంలో ఎక్కడైనా ఎవరైనా ఎప్పుడైనా చచ్చారా?.. ఇదొక్కటి తప్పు!.. ఛస్తుందని ఎలా అనుకోను!..
కాని చచ్చిపోయింది!...
ఎందుకు?..
నువ్వు ఉత్తరం దాచావు కాబట్టి!..
ఎందుకు దాచాను? దాని శ్రేయస్సు కోసం దాచాను—ఆ ఉత్తరం మరొకరి చేతిలో పడితే ఎంత అప్రతిష్ఠ అని దాచాను!—అధర్మాన్ని అరికట్టాలని దాచాను!.. ఉత్తరం ఎవరి చేతిలో పడ్డదీ? నీ చేతిలో నేగా! నువ్వు మాత్రం మరొకరుకాదా!—నీవల్ల 'అప్రతిష్ఠ' కాదు హత్యే జరిగింది!—ఉత్తరం అందితే జానకి బ్రతికేది!—అన్ని అధర్మాలనూ నువ్వు అరికట్టుతున్నావా?—ఏదో చెయ్యబోయి హత్య చేశావు!.
ఇది హత్య ఎలా అవుతుందీ? ఒళ్లు పొగరెక్కి, మద పిచ్చిలో మతి చలించి, పాపంపండి, కన్యాత్వం చెడి, అది చచ్చింది.. ఛస్తే చచ్చింది!..చావొచ్చి చచ్చింది!..
కాదు! ఎదుగుతున్న మొక్కని, అల్లుకుంటున్న తీగని, క్రూరంగా, రాక్షసంగా, కత్తిరించి వేశావు—నువ్వే సైంధవుడిలా అడ్డుపడకపోతే దాని ప్రేమ ఫలించేది!...
వివాహం జరిగేది...ఆనందంతో, ఆ పారిజాతం, పరిమళించేది!...
శ్రియఃపతే! ఈ పాపం, ఈ నింద నాతలకు చుట్టుకుందా?..
పాపం! నింద!.. నీకు ప్రేమ లేదు, నీకు ప్రేమ తెలీదు!..
ఏమిటి 'సినిమా ప్రేమ'? ఎందుకు తెలీదు, బాగా తెలుసు!!..

సినిమా ప్రేమ—చొకబారుగానే ఉండవచ్చు—

కాని జానక్కి—కమలాక్షికి—వాళ్ల అమాయక హృదయాలకి—అదే పరమార్థంగా కనిపిస్తుందేమో! దానికోసమే వాళ్లు ప్రాణత్యాగం చేశారు!...

చేశారు! ఆత్మహత్య మహాపాతకం! ధర్మం విలువ తెలీని అజ్ఞానంతో ఏమైనా చేస్తారు? నరకానికి పోతారు!....

ఆత్మహత్య ఎలా అవుతుంది? జానకి విషయంలో హత్యకు కారకుడివి నువ్వు!..

శ్రియఃపతే! శరణాగతుణ్ణి. వృద్ధుణ్ణి, ధర్మం కోసం, అన్నిమమతలూ వదలుకొన్నవాణ్ణి, నే నెందుకు చేస్తాను హత్య? ఎందుకు పెట్టావయ్యా ఈ పరీక్ష నాకు!!....

పరీక్షకాదు, స్త్రీ హత్యాపాతకం! ఒక్కసారి చూడు: నీ నీడ సోకిన చోట, ఎక్కడైనా, పచ్చదనం నిలిచిందేమో! భార్యను మింగావు, కొడుకుని తరిమే శావు, కూతుర్ని పెళ్లి చెయ్యకుండ పొట్టను పెట్టుకున్నావు, నీపాడు కళ్లు పడ్డాయో లేదో, పారిజాతంలాంటి చిన్నది, వాడి, వగ్గి, నేలమట్టమై పోయింది! ఇక సంతోషించు!...

వేంకటేశా! స్వామీ! ఈ బాధ్యత, ఈపాపం, నాదికాదు!.. మరెవరిది?...

మా యింటావంటా లేదు!...

నిజంగానే? ఆలోచించు!..

మా నాన్న భక్తుడు— రామాలయంలో అర్చకుడు... అతనికి గొల్ల పేరమ్మతో ఉండేది కాదూ?..

అవి, ఎవరో, అన్నారు: కిట్టనిమాటలు, నాకు తెలీదు! అది నిజమై ఉండదు!..

నువ్వు, దాని కూతురు, సుబ్బులు కోసం ఎగబడలా?...

నాకు పసితనం, యిదమిత్థమని ఊహ తెలీని వయసు, అమాయకత్వం.. అందుకేనా నాన్న మంద లింపు!—"తక్కువ జాతి వాళ్లతో ఏమిట్రా?"..

సుబ్బులు, పారిజాతాలు తెచ్చేది, పూజకోసం.. అది వయసులో, నా కంటె రెండుమూడేళ్లు, పెద్దది, అవును, దాన్ని పట్టుకుని వేళ్లాడాలనీ, ముద్దెట్టుకోవాలనీ అనిపించేది కాదూ!.. దానితో దాగుడుమూతలు ఆడేవాణ్ణి.. కుర్రతనం.. దాని జాతి తక్కువ!.. కాదుమరి! ఆడవాళ్లె మగవాళ్ల కంటె తక్కువ! అందుకేనా అమ్మ మాట ఎన్నడూ వినలేదు?..

అమ్మ మంచిది—వినకున్నా ఏమీ చెయ్యదు—
నాన్న చండశాసనుడు చర్మం ఒలిచేస్తాడు..

నాన్నకు భయపడేవా, సుబ్బుల్ని ఏమీ చెయ్య లేదు?...

కాదు, కాదు, నేను పాపం చెయ్యను, చెయ్యలేను, చేతకాదు! నేను పాపం చెయ్యలేదు!!

చేతగానితనం!..

ఏమైతేనేం, నేను పాపం చెయ్యలేదు, వేంకటేశా! నేను చెయ్యలేదు!...

నువ్వు కమలాక్షి పెళ్లికి అడ్డుపడలేదూ?...

అది వర్ణాంతర వివాహం-ఎలా సమ్మతించేది?-
కమలాక్షి రహస్యంగా, హద్దుమీరి ప్రవర్తించి గర్భం తెచ్చుకుని, తన అవమానంతో, తనే మస్సై పోయింది...

నువ్వు జానకి ఉత్తరం దాచలేదూ?...

అందులో జానకి ప్రాణాలున్నాయని నాకేం తెలుసు? ఎలా అనుకోను! కేవలం దుర్విధి!...

నువ్వు!—నీకు!-వాళ్లమీద ఏమిటి హక్కు?-ఏమిటి నీ జోక్యం?..

హక్కు? అధికారం? ఉందని నేనన్నానా? ధర్మం, ధర్మం తప్పదుకదా అని చేశాను— అంతే!....

జీవితాల్ని నాశనం చేసి, ప్రాణాలు తీసే పనులు, ధర్మమా?....

నేను—నేను—కేవలం నిమిత్తమాత్రుణ్ణి!..

తప్పించుకో జూస్తున్నావా?...

లేదు!..

లేదు!-ఎక్కడికి పోతావు?-ఎక్కడికిపోతాను-! స్వామి దగ్గరకు—ఈ లోకం పుణ్యపాపాలో నాకేంపని! వెళ్తాను స్వామి దగ్గరకు—ఆయనదే తీర్పు—ఆయనదే భారం—

* * *

"గరుడయ్యా! కొండ పైకి వెళ్ళాలోయ్"

"టికెట్లు తెమ్మంటారా స్వామీ?"

"బస్సు మీద కాదోయ్. నడిచి వెళ్ళాలని ఉంది."

"ఆయాసం స్వామీ! ఈ వయసులో మీవల్ల అవుతుందా?"

"వయసుకీ ఆత్మకీ సంబంధం లేదోయ్."

"శరీరమేగదండి ఎక్కేది"

"ఆత్మ గొప్పదా శరీరం గొప్పదా?"

"ఏమో అవన్నీ నాకేం తెలుసండీ!"

"నువ్వు ఎక్కగలవా లేదా?"

"ఇప్పుడెవ రెక్కుతున్నారండీ!.. అలవాటు పోయిందండి.. వాళ్ళూ బస్సే మేలనుకోండి.. మీరు రమ్మంటే వస్తాను.. మద్దె మద్దె కూచుంటూపోతే ఎక్కిపోవచ్చులెండి.. అయితే నల్లపొద్దున బయల్దేర లండి.."

"ఈ శనివారం సాయంకాలం వెళ్దాం.. మరచి పోవద్దు.."

* * *

వికలాంగులు.. కుష్ఠువాళ్ళు..

గుడ్డివాళ్ళు.. అనాథలు..

భిక్షాటనమే వృత్తి చేసుకున్న సంసారాలు...

ఎగుడి దిగుళ్ళు...

రాళ్ళు.. చెట్లు చేమలు.. ఆకాశం..

అబ్బ! ఆయాసం!...

అబ్బ! నీరసం!...

మెట్లు.. పైకి, పైపైకి మెట్లు..

పైన ఆకాశం.. మబ్బులు..

చీకటిపడింది.. చల్లని వర్షపుగాలి..

"గరుడయ్యా! టైమెంతైంది."

కొత్త వారి వైపు—ఎంత ధీమాగా ఎంత గర్వంగా—ఎంతసేపు—చూస్తున్నాడు!

"సీకట్లో సరిగా కనిపిస్తే గదండీ!..ఎనిమిదింబావు!.. ఇంకెంత!.. వచ్చేశాం సామీ"

చినుకులు.. వర్షం..

"రామానుజాచార్యుల యింటికి వెళ్ళి విశ్రమిస్తాను నువ్వు 'సుప్రభాతం' వేళకు దేవాలయం దగ్గర ఉండవోయ్."

* * *

"కమలా కుచచూచుక కుంకుమ.."

ఈ వర్షం తగ్గదు.. అబ్బ! వణుకు!..

జారుతోంది.. కాళ్ళు తడబడుతున్నాయి.. ఎంత నీరసంగా వుంది! రామానుజంలేడు సమయానికి... వీడు గరుడయ్య ఎక్కడ పడి నిద్రపోయాడో ఏమో... పోనీ తిరువెంగళం కనిపించినా బావుణ్ణు.. కాస్త సాయం... లోపలికి వెళ్ళేందుకు...

వాడి కృప ఉంటే అన్నీ సమకూరుతాయి—లేకపోతే ఏమీలేదు.

అబ్బ!..అయ్యో!!....

* * *

ఎక్కడ?....

ఏమిటీ పడక?.. ఏదీ దేవాలయం?..

పడ్డాను.. అయ్యో! పడ్డాను.. కుడికాలు...విరిగింది కాబోలు ..నొప్పి... అబ్బ! కదల్లేను..భగవాన్—ఇది ఆస్పత్రిలా వుంది—దేవాలయం కాదు!—ఆస్పత్రికి వచ్చాను!— లోనికి— దేవాలయంలోనికి— వెళ్ళలేదు!

"పాలు తీసుకోండి"

ఎంత మెలకువగా పాలు త్రాగిస్తోంది.. అబ్బ! ప్రాణం లేచివస్తోంది...నొప్పి!...బాధ!...

"ఎవరమ్మా మీరు? డాక్టరా?"

"అవును... ఇక్కడ కాదు..."

ఇంగ్లీషులో మాట్లాడుతోంది... ఈ వైపు కాదు... ఉత్తరదేశం...

"ఎక్కడ?"

"మాది బొంబాయి... మీరు కొండమీద దేవాలయం దగ్గర పడిపోయారు...మేము వెనకాలే వస్తున్నాము... మీకు తోడు ఎవరూలేరు. మీబంధువు లెవరో తెలీదు...మీకు పూర్తి స్పృహలేదు...కుడికాలు జాయింట్ ఫ్రాక్చర్ అయింది...మా కారుమీద వెంటనే యిక్కడకు తీసుకువచ్చాము...వచ్చాక తెలిసింది

మీరిక్కడ కాలేజిలో లైబ్రేరియన్ అని... ఎందు కండీ, కన్నీళ్ళు పెడుతున్నారు? బాధగా వుందా?..."

"మీరు దేవాలయంలోకి వెళ్ళారా?"

"లేదు. మీతోబాటే వెళ్ళబోతున్నాను. అంతగా మీరు పడిపోయారు. మిమ్మల్ని అలా వదలి ఎలా వెళ్ళేది?...యిప్పుడు వెళ్ళవచ్చు."

"బొంబాయిలో ఎవరో జబ్బు రోడ్డు మీద పడిపోతే ఎవరూ పట్టించుకోలేదని విన్నానే."

"అందరూ అలా బాధ్యత లేకుండా ఉంటారాండీ!"

నవ్వుతోంది ... స్వచ్ఛంగా — పవిత్రంగా — నవ్వు తోంది.. పుణ్యాత్మురాలు..

"మీ పేరేమిటమ్మా?"

"ప్రేమ"

"అంటే? పూర్తి పేరు?"

"ప్రేమావాంచారి... బాలాజీ మాకు యింటి దేవుడు."

"వాంచారి!.. మా అమ్మపేరూ వాంచారమ్మే.. మీరు బ్రాహ్మలా?"

"కాదు"

"మీ కులం?"

చిరునవ్వు నవ్వుతూ సందేహిస్తోంది..

"హరిజనులు"

హరేరామ! శ్రియఃపతే!..ఎందుకీ కొన ఊపిరి? ఎందుకీ శిక్ష?..

"మీరు విశ్రమించండి"

* * *

"అప్పా..అప్పా..అప్పా"

"ఊ... ఊ..."

"అప్పా..నేను కిచ్చానిని..యిటూ చూడు"

"ఎవరు! అబ్బ!...కిచ్చా?.. క్రిష్ణస్వామి?..నువ్వు.. నువ్వు ఎప్పుడు ఎట్లా వచ్చావు?"

"రామానుజాచారి వైరిచ్చారు"


"ఎందుకు?"

"ఎందుకేమి? మీకు ఆక్సిడెంట్ అయిందని"

"కిచ్చా... అవును..కిచ్చా.. పాపని అయిపోయింది."

"ఎందుకప్పా కన్నీళ్ళు?..నీకు నయమౌతుంది.. వంట్లో శక్తి రాగానే బొంబాయి వెళ్ళిపోదాం."

"వద్దు...ఈ దేహం యిక పనికిరాదు... స్వామి నన్ను కొండకు రమ్మన్నాడు.. ఎక్కడానికి యింకో దేహం కావాలి.. కిచ్చా! నాయనా!.. ఈ దేహానికి అగ్నిసంస్కారం చెయ్యటానికి వచ్చావు.. చేసి పో, నాయనా!.. ధర్మం తప్పదు కదా!"



తెలుగు కవిత్వంలో ఎలిజీ

శ్రీ పణతుల రామచంద్రయ్య

'ఎలిజీ' కి సరైన పర్యాయపదం మనభాషలో, నాకు తెలిసినంతవరకు, లేదు. ఈ పదం గ్రీక్ సాహిత్యం లోంచీ వచ్చింది. గ్రీక్‌లో 'ఎలిగాస్' అంటే శోకం అని అర్థం. శోకభరితమైన కవిత ఎలిజీ. దీని ప్రకారం ఎలిజీ ఆధునిక సాహిత్యంలోవలె మరణించిన వ్యక్తుల పైనే వ్రాయబడనక్కరలేదు. అది యుద్ధాలనూ రక్తపాతాలనూ గురించి కావచ్చు. రాజకీయ పరిస్థితులను గురించి కావచ్చు. తగాదాలను గురించి కావచ్చు. సమకాలీన జీవితాన్ని గురించి కావచ్చు. ఒక్కొక్కసారి అసలు శోకమే లేకుండా, పర్వదినాల్లో లభించే ఆనందాన్ని గురించికానీ, తను ప్రజలకు చెప్ప దలచిన నీతిపాఠాన్ని గురించి కానీ కవి ఎలిజీ వ్రాయ వచ్చు. అది విషాదాన్ని ధ్వనించే ఎలిజాయిక్ (Elegiac) ఛందస్సులో నడిస్తే చాలు, ఏ పద్యమైనా ఎలిజీ అవుతుంది. ప్రాచీనకాలంలో టిర్టియస్ (Tyrtaeus), మిమ్‌నెర్మస్ (Mimnermus), సొలన్ (Solon) వంటి గ్రీక్ కవులూ, గాలస్ (Gallus), ఒవిడ్ (Ovid), ప్రాపర్టియస్ (Propertius) వంటి రోమన్ కవులూ వ్రాసిన ఎలిజీలలో చాలాభాగం ఈ కోవకు చెందినవే. 16 వ శతాబ్దంలో ఇంగ్లండులో సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance) ప్రారంభమైనప్పుడు, గ్రీక్ రోమన్ సాహిత్యాలను అధ్యయనం చేసిన వారిద్వారా యీ ఎలిజీ అనే పదం ఇంగ్లీషులోకి వచ్చింది. వచ్చిన తర్వాత చాలాకాలం పాటు ఇంగ్లీషు సాహిత్యంలో కూడా ఎలిజీ పరిధి ప్రాచీన గ్రీక్ సాహిత్యంలో వున్నంత విస్తృతంగా వుండేది. 17వ శతాబ్దంలో డన్ అనే ప్రసిద్ధ ఆంగ్లకవి తను రచించిన ప్రేమగీతాలూ (Love poems), హేళన కావ్యాలూ (Satires), లేఖాకావ్యాలూ (Epistles) చాలా భాగం ఎలిజీలుగా పేర్కొన్నాడు. 18 వ శతాబ్దంలో థామస్‌గ్రే రచించిన "ఎలిజీ ఇన్ ఎ కంట్రీ చర్చ్ యార్డ్" (Elegy in a country Church yard) కూడా యిలా విస్తృతపరిధిలో వ్రాయబడ్డది.

కాని 16 వ శతాబ్దం నుంచీ మరోక వేపు ఎలిజీ 'శోకకావ్యం'గా కూడా ప్రాముఖ్యం గడించుకో సాగింది. 1579 లో రిచర్డ్ పుటెన్‌హామ్ (Richard Puttenham) అనే విమర్శకుడు ఎలిజీని 'దీర్ఘ శోక గీతం' ('A song of long lamentation')గా నిర్వచించాడు. కాలక్రమాన మిల్టన్, షెల్లీ, ఆర్నాల్డ్ మొదలైన ప్రముఖకవులు ఎలిజీలను మరణించిన వ్యక్తుల పైనే వ్రాయటంవల్ల ఎలిజీ అర్థం అంత వరకే పరిమితమై పోయింది.[1] ఆధునిక సాహిత్యంలో (ఏ భాషలోనైనా సరే) 'ఎలిజీ' మామూలుగా ఎవరైనా మరణించినప్పుడు వ్రాయబడే కవితాఖండిక, ఆ మరణించిన వ్యక్తి కవికి మిత్రుడు కావచ్చు; ఆత్మబంధువు కావచ్చు; ఒక ప్రసిద్ధ వ్యక్తి కావచ్చు; లేక జీవితంలో దెబ్బతిన్న ఏ అపరిచితుడైనా కావచ్చు.

ఎలిజీ వ్రాసే కవికి ముఖ్యంగా కావలసింది, జీవన విషాదాన్ని గురించిన స్మృతీ, మానవ హృదయావేశాలను బలవత్తరంగా చిత్రించగల శక్తి. ఇంగ్లీషు కవితో పోల్చిచూస్తే, పూర్వపు తెలుగుకవికి యీరెండు లక్షణాలూ కొంత తక్కువే నవాలి. అంటే హృదయావేశాల చిత్రీకరణకు మనపూర్వ సాహిత్యంలో చోటు లేదని కాదుగాని, ఇంగ్లీషు సాహిత్యంలోవలె అదే

1. అంటే ఆ తరువాత కవులు ఎలిజీ విస్తృత పరిధిని గుర్తించలేదనికాదు. 19 వ శతాబ్దంలో ప్రముఖ ఆంగ్ల కవి కోలరిడ్జ్ యీ విస్తృతపరిధిని గుర్తించిన వాడుకాబట్టే, 'ఆలోచనాపరమైన మనస్సుకు సహజమైన కవితా విభాగం' (The form of poetry natural to the reflective mind) అని ఎలిజీకి నిర్వచనం చెప్పాడు.

ప్రధానలక్ష్యంకాదు. ఆ ఆవేశాలను శాసిస్తూ చివరకు ద్యోతకమయ్యేది ఒక ప్రశాంతత; 'జీవితం నిత్యకల్యాణం పచ్చతోరణం' అన్నభావం. అందువల్ల, విషాదాంత నాటకాల వలెనే ఎలిజీ కూడా భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని మనపూర్వులు భావించారేమో తెలియదు.

తెలుగుసాహిత్యంలో పెద్దన కాలంవరకూ ఎలిజీ లేదు. అంతకుపూర్వం వ్రాసిన పోతన భాగవతంలో, శ్రీకృష్ణ నిర్యాణ వార్తను అర్జునుడు ధర్మజునికి చెప్పేటప్పటి పద్యం—

'మన సారధి మన సచివుడు
... ...
మనలను విడనాడి చనియె మనుజాధీశా!'

అన్నది—ఎలిజీ ధోరణిలోవున్నా అది కథ సందర్భంలో వచ్చినదే కాబట్టి దానిని ఎలిజీ అనలేము.[2] శ్రీనాథుడు తన అవసానంలో వ్రాసిన 'కాశికా విశ్వేశుగలసె వీరారెడ్డి' అనే పద్యం కూడా విస్తృత పరిధిలో ఎలిజీ అవుతుంది కాని ఆధునిక దృష్ట్యా కాదు. ప్రబంధయుగంలో పెద్దన తప్ప మరెవ్వరూ ఎలిజీ వ్రాయలేదు. అది సహజమే. జీవితంలో, సాహిత్యంలో శృంగారరసం తప్ప మరొక్కటి తెలియని కవులకు ఎలిజీలు వ్రాయగల వ్యవధానం వుండదు.

అయితేనేమి? వాళ్లంతరూ ఎలిజీలు వ్రాయని కొరతను పెద్దనామాత్యుని పద్యం తీర్చివేసింది. సాహితీ సమరాంగణ సార్వభౌముడైన కృష్ణరాయల మరణం తన హృదయాన్ని రగిలించగా, ఆయనతో తన సాన్నిహిత్యాన్నీ, ఆయన తనకు జరిపిన గౌరవాలనూ తలచుకుని,

'అట్టి
కృష్ణరాయలతో దివి కేగలేక
బ్రదికియున్నాడ జీవచ్ఛవంబ నగుచు'

అంటూ ఆ మహాకవి పడిన ఆవేదన తెలుగు సాహిత్యానికొక అపూర్వమైన ఎలిజీని బహూకరించింది. దీనిలో ఎక్కడా కృత్రిమాలంకారం లేదు. 'రాజకోటంరపు' దన్న కైవారం లేదు. ఎలిజీకి అవసరమైన నిజమైన ఉద్వేగం వుంది. కారణం, ఇది మిగతా కావ్యాల వలె రామరాజభూషణుడు, రామభద్రుడు మొదలగు వారి మొహాలు చూస్తూకాక, 'శోకము పొంగి పొరలి వచ్చినప్పుడు తనకొరకేశ' వ్రాసినది.

ఆంగ్లసాహిత్య ప్రభావం వల్లనేమో, ఆధునికాంధ్ర సాహిత్యంలో ఎందరో ప్రముఖకవులు ఎలిజీలు వ్రాశారు. వీనితో ఆత్మబంధువులపై వ్రాయబడ్డ ఎలిజీలలో మొదట పేర్కొనదగినవి— విశ్వనాథ, సత్యనారాయణగారి "వరలక్ష్మీ త్రిశతి", నాయని సుబ్బారావుగారి "మాతృగీతాలు". "వరలక్ష్మీ త్రిశతి" భార్య మరణంపై వ్రాసిన వియోగ కావ్యం. ఏళ్ల తరబడి తన కష్టసుఖాలతో భాగస్వామినిగా కలిసి మెలగిన యిల్లాలి ప్రాణోత్క్రమణం కవి మనస్సులో కలిగించిన ఆర్తి యీ "వరలక్ష్మీ త్రిశతి". కావ్యం 'కర్మశతకము', 'స్మృతిశతకము', 'నిత్యశతకము' అని మూడుభాగాలుగా విభజించబడింది. కర్మశతకములో ఆమె ప్రాణోత్క్రమణం దగ్గరనుంచీ దహనాది కర్మకాండనంతా వర్ణిస్తాడు కవి. వియోగ విషాదాన్ని ఇంతగా వేదసంప్రదాయబద్ధం చెయ్యటంలో పరమార్థమేమో తెలియదు. కాని అది వేరే విషయం. మనకు కావలసింది కవి ఆవేశంలోని నిజాయితీ. భార్య మృతశరీరాన్ని కౌగిలిస్తూ, తనను వారించే వాళ్లతో, 'ఈ తుదిసుఖమ్ము నను పొందనీండు మీరు' అంటున్న కవివాక్యాలు, "వేయిపడగలు"లో అరుంధతి శవంపై పడి ఏడ్చే ధర్మారావు శోకాన్ని గుర్తుకు తెస్తాయి.[4] ఆధునిక కవులందరికి వలెనే విశ్వనాథకు కూడా జీవన విషాదాన్ని గురించిన స్మృతి వుంది. వేరొక కావ్యంలో, కవిగా తన వ్యాసంగాన్ని తలచుకుంటూ అషాఢ మేఘాన్ని వుద్దేశించి,

'నీవు మింటికి, క్షితికి నేన
కవులమై లిమి హృదయ దుఃఖములు పాడ'రే

2. "రఘువంశం"లో ఇందుమతి మరణించినప్పుడు అజుని విలాపమూ, "కుమారసంభవం"లో రతివిలాపమూ ఇలాంటివే.

3. శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ: "వేమన కవిత్వము"పై ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ఇచ్చిన ఉపన్యాసాల్లో ఏడవది.

4. "వేయిపడగలు" ఒకవిధంగా ఆత్మాశ్రయమైన నవల. ధర్మారావులో విశ్వనాథ కనబడతాడు.

5. "గిరికుమారుని ప్రేమగీతాలు"

అంటాడు ఆయన. ఆయనకు కూడా కవిత్వం హృదయ దుఃఖంలోనుంచే వచ్చింది. అందువల్ల అది ఒక నీడ వంటిది. తన బ్రదుకుబాటలో 'అరుంధతీ ప్రముఖ దివ్యమహా పరిశీలనమూర్తి'గా వెలుగులు నింపిన భార్య దూరమైనప్పటినుంచీ 'యీ కవిత్వ మనునట్టి విచిత్రపు నీడ' పారిందట (స్మృతిశతకము). కాదామరి? ఆమె ఆయన కొరకు 'జ్యోతిర్మయ స్వస్తి లోకములందుండి' వచ్చిన వ్యక్తి. తన కోపతాపాలను ఓర్చిన క్షమామూర్తి. ఆమెను సుఖపెట్టలేక తను దుఃఖపడినప్పుడు, 'శాశ్వతమా ధనంబు? మీరలు కల'రని ఓదార్చిన యోగిని. ఈ భూమిమీద 'అన్ని మార్లాత్మహత్యాబుద్ధి పెడద్రోసి' తను జీవించింది ఆమె కొరకు. ఆమె లేనప్పుడు తను ఎవరి కోసం బ్రదకాలి? 'ఎలిజీ' రచయిత లందరికి మల్లేనే యీ కవికి కూడా మృతవ్యక్తి ననుసరించాలన్న భావం కలుగుతుంది. కాని తన పిల్లలున్నారు. వారు తన 'ప్రాణముల యందు బల్లులట్టు అతుకుకొన్నారు.' తననూ, చితాగ్ని భస్మమై పోయే తన భార్యనూ విడదీసే హద్దులుగా నిలబడిన యీ బాధ్యతలను దాటలేక, ఆమె నుద్దేశించి జాలిగా,

'ఏ సుకృతలేశఫలమొ, నా యిల్లు నీవు
లీలగా కొన్ని నాళ్లు వెలిగించినావు.'

అంటాడు కవి. అందుకుగాను ఆమెకు, ప్రేమతో కూడిన కృతజ్ఞత చెప్పుకునే దారిలేదు. తను చెయ్యగలిగిందల్లా ఆమెకు 'ప్రళయరహిత గౌరీలోకములు' కలిగేటట్టు కర్మక్రతువులు చెయ్యటం. ఇలా భార్య ప్రాణోత్క్రమణంతో ప్రారంభమైన కవి శోకం, 'కర్మశతకము' లోని చివరి ఘట్టమైన 'కృష్ణార్పణము' తో పతాకస్థాయి నందుకుంటుంది. కృష్ణానదిలో అస్థి నిమజ్జనం చేస్తూ కవి తన బ్రదుకులో ఏర్పడ్డ వెలితిని తలచుకుని

'మిగిలినది యొక్కడే నాకు మేరువంత
బరువు నా గుండెలో మధ్యభాగమందు
అంతె పేరున కంతె భార్యాస్థిగాని
నా శరీరాస్థి నిజము కృష్ణార్పణమ్ము'

అంటాడు. కాని ఎంత ఎలిజీలో నైనా చివరన ఒక ఆశాలేశం వుండాలి.[6] అందులోనూ విశ్వనాథ భారతీయ సంప్రదాయంలో పూర్తి విశ్వాసం వున్న కవి అవటంవల్ల, కావ్యంగా వుద్దేశించిన యీ ఎలిజీని తీవ్రనైరాశ్యంతో ముగింపు చెయ్యటం ఆయన కిష్టం వుండదు. కావ్యంలో రెండవభాగమైన 'స్మృతి శతకము'లో తన దుఃఖాన్ని, జీవన్మరణాలనూ, మిథ్యనూ చర్చిస్తాడు కవి. మరణించిన భార్య తన స్మృతుల్లో, స్వప్నాల్లో జీవిస్తూ ఒక మధురార్తిని కలిగిస్తున్నది. 'ఈ దుఃఖంబులు కూడ నిష్టమగు కాదే గుండెకున్' అనిపిస్తున్నది. క్రౌంచమిథునం పట్ల వాల్మీకి దుఃఖం లాగా, తన దుఃఖం కూడా కావ్యయోగ్యం. తన భార్యా వియోగం సీతారాముల వియోగంవంటిది. ఈ 'ఉన్నత చిత్తవృత్తిని' తనలో కలిగించటంవల్ల తన 'అఖిల ప్రశస్త కవనంబున కాయమ' పట్టభద్రురాలయింది. ఇక మూడోభాగమైన 'నిత్యశతకము' పూర్తిగా వేదాంతమయం. దుఃఖాన్ని అధిగమించిన కవి 'ఉత్తిష్ఠత జాగ్రత' అని ఉపదేశిస్తాడు. చివరకు "ది వేస్ట్‌లాండ్"(The waste Land)[7]లాగా 'శాంతి శ్శాంతి శ్శాంతిః' అనే ఉపనిషత్సందేశంతో గంభీరంగా ముగుస్తుంది ఈ ఎలిజీ.

వాయువి సుబ్బారావుగారి "మాతృగీతాలు" తల్లిపై వ్రాసిన ఎలిజీ. సుబ్బారావుగారి తండ్రి వెంకటగిరి సంస్థానంలో ఉద్యోగం చేసేవారట. ఆయనంటే అందరికీ, యింట్లో వాళ్లకు కూడా, సింహ స్వప్నమట. అందుచేతనేమో, సుబ్బారావుగారికి తల్లిపై మమత ఎక్కువ. అలాంటి మాతృమూర్తిని పూజించటానికి పుష్పాలు సేకరించాడు కవి. కాని యింతలో ఆమె వెళ్లిపోయింది.

'ఎంతకాలమ్ము పట్టెనదే? త్వదీయ
పూజకై ద్రవ్యసంతతుల్ ప్రోవుసేయ

---

6. ఈ సంప్రదాయం కూడా గ్రీక్ సాహిత్యం లోనే ప్రారంభమయింది. ప్రాచీన గ్రీక్ కవి బియాన్ (Bion వ్రాసిన "లామెంట్ ఫర్ ఎడొనిస్" (Lament for Adonis) అనే ఎలిజీలో చివరన ఇలాంటి ఆశాలేశం కనబడుతుంది. ఈ విషయంలో మిల్టన్, షెల్లీ, ఆర్నాల్డ్ మొదలగు ఇంగ్లిషు ఎలిజీ రచయితలు బియాన్‌ను అనుసరించారు.

7. ఆంగ్లంలో టి. యస్. ఇలియట్ వ్రాసిన పద్యకావ్యం.

టెంకను సమాప్తి లేదు తల్లీ! ఇకొక్క
వత్సరమ్మైన నీ పేర్పు బట్టలేదు.'

తను ఆమె పూజకొరకు సన్నద్ధుడౌతుంటే, ఆమె దేవపూజ కొరకు వెళ్ళిపోయింది. "వరలక్ష్మి త్రిశతి"లో వలె యిక్కడ కూడా జీవన్మరణాల సరిహద్దు కేవల నిస్సహాయుడై నిలబడిపోతాడు కవి.

'నీవు మడి కట్టుకొని పోయినావు పండ్లు
పుష్పములు బట్టుకొని దేవపూజ కొరకో!
నేను నీ కొంగుబట్టుక నీడువెంట
బోవుటకు లేక కన్నీటి బొట్లు రాల్తు.'

కవిత్వాన్ని స్థూలంగా ఆత్మాశ్రయం (subjective) అనీ, పరాశ్రయం (Objective) అనీ విభాగిస్తే, ఎలిజీ ఆత్మాశ్రయ కవిత్వంలో చేరుతుంది. దీనిలో వస్తువు కోసం కవి తన ఆలోచనలలోనే, తన ఆవేశాలలోనే, తన అనుభవాలలోనే వెదుక్కోవాలి. అంటే ఎలిజీలో కవిపూర్తిగా తనను గురించే చెబుతాడని కాదుగాని, చనిపోయిన వ్యక్తిని గురించి అతడు మిగతా కవితా విభాగాల్లో వున్నంత Objective గా వుండలేడు. ఒక్కొక్కప్పుడు మరణించిన వ్యక్తి గుణగణాలనూ, అతడితో తన సాన్నిహిత్యాన్నీ వర్ణిస్తూ కవి తన బ్రదుకులోనూ, సంఘంలోనూ అలుముకున్న నైరాశ్యం గురించీ, సమకాలీన పరిస్థితులను గురించీ, అన్యాయాలను గురించీ వ్యాఖ్యానిస్తాడు. కీట్సు మరణించినప్పుడు షెల్లీ వ్రాసిన "ఎడొనిస్" (Adonais) అనే ఎలిజీని ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు.[8] ముప్పై ఏళ్లు నిండీనిండక ముందే కీట్సు మరణించటానికి కారణం భగ్నప్రేమ జనితమైన నిరాశా, అనారోగ్యమూ మాత్రమేకాక, అతడు వ్రాసిన "ఎండిమియాన్" (Endymion) అనే కావ్యంపై ఒక పత్రికలో వచ్చిన నిర్దాక్షిణ్య విమర్శ కూడా ఒక కారణమని కొందరి అభిప్రాయం. షెల్లీ దీన్ని ఆధారంగా చేసుకుని తన ఎలిజీలో అలాంటి కువిమర్శకులందరినీ దూషిస్తాడు. తర్వాత సమకాలీన జీవితాన్ని ఒక ఎండమావిగా, పీడకలగా వర్ణిస్తాడు. చివరన మళ్లీ కీట్సును గురించి చెప్పి, అతడు నిజంగా చనిపోలేదని, 'బ్రదుకనే స్వప్నంలోంచీ మేలుకున్నా'[9]డని అంటాడు.

తెలుగులో యీ విధంగా నడిచిన ఎలిజీ కొంపెల్ల జనార్దనరావుపై శ్రీశ్రీ వ్రాసినది.[10] జనార్దనరావు జీవిత విశేషాలను గూర్చి నాకు అంతగా తెలియదు. కాని అతడొక రచయిత. సాహిత్యరంగంలో అద్భుత విజయాలను సాధిస్తాడని అతణ్ని గురించి శ్రీశ్రీ కనిన కలలేవీ ఫలించకుండా ఆ యువకుడి జీవితాన్ని మృత్యువు మధ్యలోనే త్రుంచివేసింది. ఈ దృష్ట్యా అతణ్ని గురించి శ్రీశ్రీ పడిన ఆవేదనకూ, "ఎడొనిస్" లో కీట్సును గురించి షెల్లీ పడిన ఆవేదనకూ సామ్యం వుంది. షెల్లీ దృష్టిలో కీట్సు ఒక 'దీనస్త్రీ దాచుకున్న పాలిపోయిన పుష్పం'[11]. పరిమళం వెదజల్లకుండానే రాలిపోయిన ఆ పుష్పాన్ని గురించి షెల్లీ

'The bloom, whose petals nipped
before they blew,
Died on the promise of fruit'
("Adonais")

అని వ్రాశాడు. కాని యీ భావాన్నే శ్రీశ్రీ తన ఎలిజీలో మరింత సహజంగా చెప్పాడు. జనార్దనరావును గురించి తాను కన్న కలలను జ్ఞాపకం చేసుకుంటూ,

'ఎన్ని ఆశలు నీమీద పెట్టుకుని
ఎన్ని కలలు నేసుకుంటూ పోగు చేసుకుని...'

అంటాడు. ఈ వాక్యం అసంపూర్ణం. చివరన వున్న Pause—ఆ ఆశలు నిరాశ కావటంవల్ల కలిగే దుఃఖభారాన్ని, మాట్లాడనివ్వనిగాద్గద్యాన్నీ సూచిస్తుంది.

'ఎన్ని కలలు నేసుకుంటూ పోగుచేసుకుని...
అన్నీ తన్ని వేశావా నేస్తం?'

---

8. మిల్టన్ వ్రాసిన "లిసిడాస్" (Lycidas), ఆర్నాల్డ్ వ్రాసిన "థిర్సిస్" (Thyrsis) అనే ఎలిజీలు కూడా యీ పద్ధతిలోనే నడిచాయి.

9. 'He hath awakened from the dream of life' (Adonais)

10. "మహాప్రస్థానం" అంకితం చేస్తూ వ్రాసినది.

11. 'A pale flower by a sad maiden cherished (Adonais)

ఆ తర్వాత తను జనార్దనరావుతో కలిసి మెలగిన రోజులు గుర్తు చేసుకుని, అవన్నీ కలలై కరగిపోయినందుకు దుఃఖిస్తాడు. ఇక్కడ షెల్లీ వలె శ్రీశ్రీ కూడా తన ఆశయాలకు సంకెళ్లు వేసే సమకాలీన సంఘాన్ని విమర్శిస్తాడు.

'చుక్కలలో ఆదర్శాలను లెక్కిస్తూ
ఎక్కడకో పోతూన్న మనల్ని
రెక్కపట్టి నిలబెట్టి లోకం
ఎన్నెన్ని దుస్సహదృశ్యాలు చూపించి
ఎన్నెన్ని దుస్తరవిఘ్నాలు కల్పించి
కలలకు పొగలనూ కాటుకలనూ కప్పి
శపించిందో, శిక్షించిందో మనల్ని!'

షెల్లీకి కీట్సులా, శ్రీశ్రీకి జనార్దనరావు కూడా 'చిరునవ్వులనే పరిషేచన చేసే' మెత్తని పువ్వులాంటివాడు. అలాంటి 'సుకుమారపు హృదయానకు' లోకంలోని 'మురికితనం, కరుకుతనం' గాయం చేశాయన్న భావన కవిని బాధించగా, ఆ బాధ కోపంగా మారి 'ధూర్త' లోకాన్ని తిట్టుతాడు. షెల్లీ తన ఎలిజీలో కీట్సు మరణానికి ప్రపంచమూ, ప్రకృతి దేవతలూ దుఃఖిస్తున్నారని పాస్టొరల్12(pastoral) సంప్రదాయబద్ధంగా వ్రాశాడు. కాని శ్రీశ్రీ అలా వ్రాయలేదు. తన మిత్రుణ్ని అనాదరించిన లోకంపై కోపం అతణ్ని అలా వ్రాయనివ్వదు.

'ఎవరు దుఃఖించారులే నేస్తం! నువ్వుచనిపోతే
ఏదో నేనూ అరుగురు స్నేహితులూ తప్ప!
ఆకాశం పడి పోకుండానే వుంది
ఆఫీసులకు సెలవు లేదు
పొరాదుకాణాల వ్యవహారం
సజావుగానే సాగింది
... ...
ఎవరి పనులలో వాళ్లు
ఎవరి తొందరలో వాళ్లు!'

ప్రపంచమంతా యీ మిత్రుడి జీవితాన్ని ఒక విలువలేని వస్తువుగా తోసివేసినా, కవికి మాత్రం అతడొక 'ఒరవడి.' షెల్లీ ధోరణిలో శ్రీశ్రీ 'జనార్దనరావు చనిపోలేదు' అనలేదుగాని,

'లేదు నేస్తం! లేదు
నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు'

అనుకుంటాడు. ఆ ప్రాభవంతో ఉత్తేజితుడై మిత్రుణ్ని మళ్లీ 'ఆవాహన చేస్తున్నాను' అంటాడు. షెల్లీ ఎలిజీలో చివర దాదాపు ఇలాంటి భావమే ధ్వనిస్తుంది.[13] శ్రీశ్రీ షెల్లీ ఎలిజీని అనుకరించాడన్నది నా అభిప్రాయంకాదు. కాని, ఇంగ్లీషు రొమాంటిక్ కవుల వల్ల ప్రభావితులైన తెలుగు కవులలో శ్రీ శ్రీ ఒకడు కాబట్టి, షెల్లీ ఎలిజీలోని భావతీవ్రత ఆయనలో కొన్ని అలాంటి ప్రకంపనాలనే కలిగించి వుంటుందని అనుకోవచ్చు.[14]

దేవులపల్లి కృష్ణశాస్త్రి తన మిత్రుడు రామమూర్తిపై వ్రాసిన ఎలిజీ[15] నిడివిలో చిన్నదైనా గుణంలో, సహజత్వంలో గొప్పది. కనుమరుగైపోయిన మిత్రుణ్ని

'ఓ మానవోత్తమా! ఓ వీరమూర్తన్య!
ఓ అమృత భాసమానోన్నత
ప్రేమ సామ్రాజ్యైక చక్రవర్తీ!'

అని సంబోధించటంలో, గుండె లోతుల నుండి దూసుకువచ్చిన స్ఫాటిక స్వచ్ఛమైన ఆవేశం వుంది. రచయిత దృష్టిలో అంత గొప్పవానికి జీవితం రుచించదు, ఎందుకంటే అది కొసరు తేనియలతో బాటు విషం కలిసింది కాబట్టి, అందులో 'హాసమృదుల వాసనలతో' బాటు 'అశ్రుఝరులు' కూడా ప్రవహిస్తాయి కాబట్టి.

'ఈ పాటి బ్రదుకు నీ కేపాటి దోయి, నా
నెచ్చెలి! నెచ్చెలి!'

పద్యపాదాలను ఇలా మధ్యలో అసంపూర్ణంగా వదలి వెయ్యటం ద్వారా విషాదంలో స్థాయిని సాధిం

12. సమకాలీన సమాజ చిత్రణలో పశువుల కాపరుల జీవితాన్ని నేపథ్యంగా వాడుకునే కవితా సంప్రదాయం గ్రీకులోంచీ ఇంగ్లీషులోకి వచ్చింది.

13. 'The breath whose might I have invoked in song descends on me'
(Adonais : 487—8)

14. ఈ ఎలిజీ వ్రాసిన తర్వాత చాలారోజులకు శ్రీశ్రీ ఒకమారు రేడియోలో జనార్దనరావును గురించి ప్రసంగించి 'I weep for Adonais' అనే "ఎడొనిస్" లోని మొదటి వాక్యంతో ముగించాడు.

15. "ప్రవాసము" అంకితంచేస్తూ వ్రాసినది.

చటంలో కృష్ణశాస్త్రి నేర్పు అసమానమైనది. ఆలోచనలకూ, భావాలకూ సరైన పొందిక కుదుర్చ లేక విఫలులౌతున్న ఆధునిక కవులలో పదాలను ఇంత బల్లంగా ప్రయోగించగలవారు తక్కువ.

చనిపోయిన మిత్రులపై వ్రాయబడ్డ ఎలిజీ లలో ఎన్నదగ్గది మరొకటి వుంది. అది డాక్టర్ పి. శ్రీదేవి మరణవార్త విని నాయని కృష్ణకుమారి వ్రాసిన "ఏం చెప్పను నేస్తం?" అన్న గేయం.[16] షెల్లీ శ్రీశ్రీల ఎలిజీలలో వలె యిక్కడ కూడా కవయిత్రీ చనిపోయిన వ్యక్తీ—ఇద్దరూ రచయిత్రులు. కీట్సు లాగా, జనార్దనరావు లాగా శ్రీదేవి కూడా తన కథలతో "కాలాతీత వ్యక్తులు" అనే నవలతో సాహితీ రసికులకు ఆశలు కల్పించి ఆ ఆశలు తీర్చకుండానే లేతపువ్వులా రాలిపోయిన వ్యక్తి. అలాంటి వ్యక్తి, అప్పటిదాకా తన మధ్య మెలగిన స్నేహితురాలు, హఠాత్తుగా 'మాటలు మరకలు అంటుకోలేని ఊహాపథాలకు, ఎగసిపోతే ఆ దుఃఖభారం ఏమీ చెప్పనివ్వదు ఆవేశ పరురాలైన రచయిత్రిని. నేస్తం విూద ఏదో చెప్పాలని వుంది, కాని ఆ చెప్పేది నలుగురిలా యాంత్రికంగా, ముఖారి రాగంలో చెప్పటం యిష్టంలేదు.

'నలుగురికీ మల్లె నువ్వూ కష్టాలకు కుంగి
సుఖాలకు పొంగావనీ
అలముకొన్న అపవాదులకు
అనంత నైరాశ్యం వరించావనీ
... ...
చెప్పనా?'

చెప్పవచ్చు. కాని రచయిత్రి దృష్టిలో అది చాలదు. మరింత సహజంగా, చనిపోయిన నేస్తానికి తన గుండెలోని ఆత్మీయత పూర్తిగా తెలిసేలా చెప్పాలి. శ్రీదేవి 'మానవత్వం నిండుగా స్పందించే' రచయిత్రి. పైగా ప్రతిభగల డాక్టరు. 'రోగాల చీకట్ల మధ్య వెలిగించిన రాగాల వెన్నెల వత్తి.' ఆ వెన్నెల చల్ల దనాన్ని అనుభవించిన వారిలో రచయిత్రి కూడా కరు. అలాంటి అపురూపమైన స్నేహితురాలిని

16. భారతి, అక్టోబరు, 1961.

గురించి, తన కృతజ్ఞత, ప్రశంస, అనురాగం, ఆవేదన వ్యక్తమయ్యేటట్టుగా రచయిత్రి చెప్పగలిగింది ఒక్కటే.

'నీవు మామధ్య లేనందువల్ల మాకు చెలిమి
నీ కలం కథలుగా మారనందు వల్ల
తెలుగుకథలకే వెలితి

నీ అమృత హస్తం రోగుల వెన్ను నిమరక
పోవటంవల్ల
ఆరోగ్యానికే వెలితి.'

మిగతా ఎలిజీ కవులందరికి వలె, యీ రచయిత్రికి కూడా లోకం నిరాశాభరితంగా కనిపిస్తుంది. ఆ నిరాశ ఆవేశాలను అణచివేసి, తన హద్దులను జ్ఞాపకంచేసి, మరోలోకంలోని స్నేహితురాలితో, మాట్లాడనివ్వకుండా చేస్తున్నది. కాని దాన్ని అధిగమిస్తూ ఒక ఆశాలేశం—

'ఎప్పుడో ఒకనాడు
రెండు లోకాలు కలిసే పొలిమేర గీత మీద
నువ్వు నవ్వుతూ నా కెదురుగా వచ్చినప్పుడు
అంతరంగంలో నువ్వంటే నాకెంత యిష్టమో
అంతా నిజంగానే చెప్తానులే నేస్తం!'

అప్పుడే తను చెప్పదలచుకున్నది స్నేహితురాలికి చెప్పగలుగుతానన్న రచయిత్రి థీమా, 'ఎడొనిస్' ముగింపులో షెల్లీ వాక్యాలను గుర్తుకు తెస్తుంది.

దేశనాయకులు మరణించినప్పుడు కూడా ఎలిజీలు వ్రాసే ఆనవాయితీ వుంది. ఇంగ్లీషులో యీ కోవకు చెందిన వానిలో ప్రసిద్ధమయినది— అబ్రహాంలింకన్ మరణంపై వాల్ట్ విట్మన్ (Walt Whitman) వ్రాసిన "ఓ కెప్టెన్! మై కెప్టెన్!" అనే గేయం; ప్రతి పదంలోనూ ఆవేశం తొణికిసలాడే రచన. 1964 లో నెహ్రూ మరణించినప్పుడు తెలుగులో అసంఖ్యాకంగా ఎలిజీలు వచ్చాయి. కాని వానిలో చాలాభాగం నెహ్రూ పోయినందుకు విషాదంలో కాక ఎలిజీ వ్రాసి పేరు తెచ్చుకునే అవకాశం దొరికిందన్న సంతోషంతో వ్రాయబడ్డవి. ఇవీ ప్రబంధ ధోరణిలో నడచిన సీస పద్యాలతో నిండి, ఒక్కొక్క పాదంలో, నెహ్రూ చేసిన ఒక్కొక్క పనిని ఏకరువు పెట్టి చివరన 'హా, పోయితె, 'అస్తమించితె' అంటూ ముగిసి, అంత విషాద సన్నివేశంలోనూ హాస్యరసాన్నే ఎక్కువగా పోషించాయి. అలాకాకుండా ఒకస్థాయికి వచ్చిన ఎలిజీలలో రెండింటిని పరిశీలిస్తాను. ఒకటి పి. నారాయణ రెడ్డి వ్రాసినది.[17] నలభై అయిదు కోట్ల హృదయాలను ఒక మంత్రశక్తిగా శాసించిన నెహ్రూ మూర్తిని స్మరిస్తూ

'మరువలేము జవహర్! నీ
మధురకాంతి రూపమ్మును.
మరువలేము తండ్రీ! నీ
మహిత స్మృతి తేజమ్మును.'

అని మొదలవుతుం దీగేయం. ఆ మహనీయ మూర్తి గంధపు చెక్కలలో ఆహుతై పోతున్నప్పుడు కూడా కనకప్రభలు చిందాయట. ఋత్విజులు చదివే వేదమంత్రాలలో ఆయన తన హృదయంలో అని నాళ్లపాటు దాచుకున్న వేదనాస్వరాలు వినిపించాయట. ఆయనను పోగొట్టుకున్న జాతి దైన్యాన్ని వర్ణిస్తూ,

'చుక్కలలో చోటు నీకు
రెక్కలు తెగిపోయె మాకు.'

అంటాడు కవి.

... ...

రెండవది బాలగంగాధర తిలక్ వ్రాసిన "నెహ్రూ."[18] సి. నారాయణరెడ్డి తన ఆవేశాన్ని మోసే పదాలకు చిత్రికలు పెడతాడు, టెన్నిసన్ లాగా. కాని బాలగంగాధరతిలక్ తన ఆవేశాన్ని యథాతథంగా మాటల్లో పెడతాడు. నెహ్రూ లేని విషాదాన్ని వెలితినీ ప్రారంభంనుంచీ పూర్తిగా అవగతం చేసుకున్న ధోరణిలో సాగే ఎలిజీ నారాయణరెడ్డిది. ఎలిజీ ఆద్యంతాలమధ్య కవి ఆవేశంలో మార్పు లేదు. ఎక్కడ ప్రారంభమయిందో అక్కడే ముగుస్తుంది. బాలగంగాధరతిలక్ ఎలిజీ అలాకాదు. నెహ్రూ మరణంవల్ల ప్రపంచంలో కలిగిన హఠాత్ సంక్షోభాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్న కవి అమాయిక హృదయపు టార్తితో ఎలిజీ ప్రారంభమై, చివరన అసలు సత్యాన్ని తెలుసుకున్నప్పటి గాంభీర్యంతో అంతమవుతుంది. ఎందుకో ఆ రోజు దుర్దినంగా తోచింది కవికి—

17. ఆంధ్రప్రదేశ్, జులై, 1964.
18. భారతి, జులై, 1964.

'ఈవేళ పువ్వులన్నీ వాడిపోయిన రోజు
ఏకాంతంలో భూమి ధ్రువగళాలెత్తి ఏడ్చినరోజు.'

కారణం, ఆరోజున ఎవరో మహావ్యక్తి, 'సర్వ జనావళికి యాత్రా పథంలో సైన్‌పోస్టు' వంటి వాడు, 'చరిత్ర మిట్ట మధ్యాహ్నంలో చలివేందర' వంటివాడు అస్తమించినట్టున్నాడు.

'ఆకాశద్వారంలో అతడికిస్వాగతతోరణంకట్టారు.
రణంలో మరణంలో అజేయుడైన యీవ్యక్తి
అమరుడన్నారు.'

ఆ అస్తమించిన వ్యక్తితో మిగతా మానవులందరితో బాటు కవికి వున్న అనుబంధం ఎలాంటిదంటే,ఆ వ్యక్తి ఫలానా అని గుర్తించకుండానే అప్పటి దాకా అతడి మేరుపర్వతమంతవ్యక్తిత్వపు ప్రభావాన్ని మాత్రం అనుభవిస్తున్నాడు.

'ఎవరు చెప్పు ఇంతటి దాకా
యీ భూవలయం మీద ఇంత హుందాగ
యింత అందంగా తిరిగిన మనిషి!

... .

ఎవరుచెప్పు ప్రపంచ చరిత్ర తలుపుతట్టి
లోపలి చీకటిలో గదిగదిలో
మూలుగులు వినవచ్చే ఎదఎదలో
ఆశాకరస్వారదీపాన్ని వెలిగించిన నవీనరాజర్షి!'

అంటూ ఆయనను గుర్తించటానికి ప్రయత్నిస్తాడు. కాని ఆ మనిషి జవహర్ అని గుర్తించాక ఆ కఠోర సత్యాన్ని ఎదుర్కొలేకపోతుంది కవి హృదయం.

'ఈ దేశంలో ఏ హృదయ ద్వారం తెరచినా
పాలోచనగా జాలిగా గంభీరంగా నిలబడే నువ్వు
ఈ దేశంలో ఏ దారి మలుపు తిరిగినా
అక్కడ నీ పదాంకం నువ్వు కట్టిన యిల్లు
ధైర్యంగొలిపే నీ చిరునవ్వు—
ఎలాగ నీ స్మృతి నుండి పారిపోగలము?'

కాని యీ నిజంతో రాజీపడక తప్పదు. పువ్వులు వాడిపోయిన తోటను చూచి మొదట బెదరపడినా, అది తాత్కాలికమేననీ, యికపై కూడా ఆతోటలో నిత్యమూ నవజీవనం వికసిస్తుందనీ భావిస్తాడు, రచయిత. ఈ భావనతో ఊరడిల్లి, తనతోబాటు శోకించే మానవాళిని ఓదార్చుతాడు.

'మనవాడు జవహరుడు భారతభూషణుడు
వదలిపోతున్నాడు
కన్నీరు విడువకండి
... ...
ప్రియదర్శనుడు నెహ్రూపండితుడు శాశ్వతనిద్ర
పోతున్నాడు
సద్దు చేయకండి.'

ఇక్కడ మొదట వున్న సంక్షోభంలేదు—అసలు పరిస్థితిని అర్థం చేసుకున్న విషాద గాంభీర్యం తప్ప. ప్రారంభంలో 'ధ్రువగళాలెత్తి ఏడ్చిన' భూమి చివరన 'విధుర వసుమతి' యై 'మౌన విషాద గీత మాలపిస్తున్నది.' ఈ మార్పును కవి గేయంఎల్లెడలా అత్యంత ప్రతిభావంతంగా నిర్వహించాడు.

ప్రత్యేకించి ఒక మరణించిన వ్యక్తిపై వ్రాయబడకపోయినా ఎలిజీలని పిలువదగిన కవితా ఖండికలు, జాషువా రచించిన "శ్మశానవాటి", శ్రీశ్రీ "సుప్తాస్థికలు." "శ్మశానవాటి" లో కవి శ్మశానంలో తాండవించే ప్రశాంతతను చూచి, 'ఇచట సౌఖ్యం బెంత క్రీడించునో!' అని భ్రమిస్తాడు. కాని నిజానికి అది జీవిత చరమాంకం పూర్తి చేసిన వాళ్ళందరినీ ఆహ్వానించే చోటు. అక్కడికి చేరి శాశ్వతంగా నిద్ర పోయే మందభాగ్యులూ, వాళ్ళకోసం కఠిన పాషాణాలే కరిగేటట్టుగా తల్లడిల్లే తల్లులూ కవి హృదయ నాళాలను కదిలిస్తారు.

'ఆయూ పిల్ల గోరీలో
ఏ లేబుగ్గల సొరు రూపరియెనో?
ఏ ముద్దు నిద్రించెనో?
ఏ లీలావతి గర్భగోళమున
పహ్నిజ్వాల జీవించునో?'

ఈ ఎలిజీకీ, ఇంగ్లీషులో థామస్ గ్రే రచించిన "ఎలిజీ ఇన్ ఎ కంట్రీ చర్చ్‌యార్డ్" కీ చాలా పోలికలున్నాయి. "శ్మశానవాటి"లో రచయిత, శ్మశానంలోని 'గుండె ఝల్లుమను' వాతావరణాన్నీ, ప్రశాంతతనూ వర్ణించాడు. గ్రే ఎలిజీలో కూడా ప్రారంభంలో యిలాంటి నిశ్చల వాతావరణం (Solemn

stillness) వర్ణించబడింది. శ్మశానానికి దయా దాక్షిణ్యాలు లేవు. జీవితంలో వివిధ రంగాలలో వికసించవలసిన ఎందరో వ్యక్తులనూ, శక్తులనూ, అందాలనూ అది హరించి వేసింది.

'ఇచ్చోట నే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పులలోన కరగిపోయె?
ఇచ్చోట నే భూములేలు రాజన్యుని
అధికార ముద్రిక లంతరించె?

... ...

ఇచ్చోట నెట్టి పేరెన్నిక గనుగొన్న
చిత్రలేఖకుని కుంచియ నశించె?'

గ్రే ఎలిజీలో కూడ ఒకచోట ఇలాంటి భావమే వుంది.[19] ఆ శ్మశానంలో లయించిన వాళ్ళలో కాళిదాసు, భారవి వంటి గొప్పవాళ్ళున్నారని "శ్మశాన వాటి"లో కవి ఆక్రోశిస్తే, ఇంగ్లీషు కవి ఆ చర్చియార్డుమట్టిలో కలిసిపోయిన వాళ్ళలో మిల్టన్, క్రాంవెల్ వంటి వాళ్ళున్నారని విచారిస్తాడు. ఇంకా వాళ్ళలో ధనవంతులున్నారు. పేదవాళ్ళున్నారు. ధనవంతులను పాతిపెట్టిన చోట అందమైన రాళ్ళు, వాటి వాటి మీద పద్యాలు వ్రాయించారు. కాని పేదవాళ్ళ కలాంటి స్మృతి చిహ్నాలు లేవు. వాళ్ళ మూగ బ్రతుకులు విస్మృతిలో పడిపోతాయి. గ్రే ఎలిజీలోని ఈభావానికి ప్రతిధ్వనులు "శ్మశానవాటి"లోవున్నాయి[20]. చివరన 'విశ్వంభరా నటన' మ్మంతా కబళించి గర్భంలో దాచుకోగల శ్మశానం సమతాపాం నేర్పే ప్రదేశంగా కనిపిస్తుంది కవికి.

శ్రీశ్రీ "సుప్తాస్థికలు" ఇలాంటి ఎలిజీయే. దానిలో కూడా కవి 'ప్రాతః ప్రసక్తి' లేని శ్మశాన శయ్యనూ, అక్కడి మృత్యుకైతల్యాన్నీ,

'తమ చర్మ కవచ మెపుడో
బ్రదికిన దినాల తలపోత బరువుచేత'

చలించే 'మానవాస్థికా పరంపర'లనూ వర్ణిస్తాడు. ఈవిధంగా ఎలిజీని విస్తృతపరిధిలో పరిశీలించినప్పుడు మరికొన్ని మంచి ఎలిజీలు తెలుగులో కనిపించవచ్చు.

---

19. 'Perhaps in this neglected spot is laid,
Some heart once pregnant with celestial fire,
Hands, that the rod of empire might have sway'd,
Or waked to ecstasy the living lyre'
(Elegy in a country churchyard)

20. ఈ ప్రతిధ్వనులు కేవలం యాదృచ్ఛిక మనుకోవటానికి వీల్లేదు.



అసురవాణి

శ్రీ చౌడూరి

నేను చదువుకొన్న పాఠశాల స్వరాజ్యం
వింశతి వత్సరాల్లో నేర్చుకొన్నది పూజ్యం
నిజాలు తెలియని ఇజాల ఇంట్లో పుట్టాను
మూఢాతత్వపు మందిరాల్లో తిరిగాను
నేను వలయాల్లో పెరిగిన వింత మానవుడను
నేడు వికటిస్తున్న నరరూపంలో దానవుడను
మైనారిటీ దాటినా మైనరువే నీవు
తెలివి యెత్తినా ఈ నాటకం చూడలేవు
అదే నాలో నీకు కనిపించని నిగూఢశక్తి
అభ్యుదయం పేర నిన్నల్లుకొన్న యుక్తి
నేను నీ భావి తరాలకు అధినేతను
నిన్ను వూబిలో పడవేసే విధాతను.

వే నొక విస్తృతాధికారపుటధికారిని
అవసరాలపై నైవేద్యం కోరే వ్యాపారిని
నేను గమిస్తున్నది సిఫారసుల వైపు
నన్నావరించుకొన్నది మతాల కైపు
సమయం చూచి నా ధరను పెంచగలను
తాలును తూచి మానదండం వంచగలను
అక్షరాలా స్వాతంత్ర్య ధనుడను
ఆంగ్ల పద్ధతికి లొంగిన యోధుడను
నా వ్యక్తిత్వం సున్నా చేసుకొని
నా కర్తవ్యం విన్నా వనుకొని
నడుస్తూన్న మొనగాడిని
యేడుస్తున్న క్రీడిని.

చెప్పినవి చేయలేను చేసినవి చెప్పలేను
అభినయం చూపించి ఆవరించగలను నిన్ను
నా ప్రయాణం నీలి నీడలవైపు
నాకు కావలసినది నీ బుద్ధిమీది కైపు

బడాయిలకోసం లడాయి అల్లగలను
పెద్దల సూత్రాలతో నిజాన్ని దాచగలను
అభ్యుదయపు అరఖులోన అవినీతిని కలుపుతాను
పేషెంటుని చంపుకొని పేరు తెచ్చుకొంటాను
నీ పిరికితనంపై ఆవేశించినవాడిని
నీ మేధలోన పెరుగుతున్న నీడని
నా కాంక్షను ఓటువైపు తరలిస్తా
నీవు నాయింటికి వస్తే గేటు మూయిస్తా.

నేనొక వింత యంత్రాన్ని
నీ మెదడులోని కుతంత్రాన్ని.

కార్యాన్ని లయింపజేసేది కార్యాలయమని
సమమైన ఆవేశం కలదే సమావేశమని
నీతికిముందు అవి మాత్రం సైలెంటని
శాంతికిముందు 'అ' కనబడదని
నా నైఘంటికార్థాలు మార్చివేస్తున్నాను
పదాల గారడిని అల్లజూస్తున్నాను

నే నీ యుగకర్తను
నీతిని తెగటార్తును.

అడ్జక్టివ్‌ని మింగిన నౌను వలె
అభ్యుదయ మెరగని టౌను వలె
జీవ ప్రణాళికలు వేసుకొంటు
జీవితాలని దోచుకొంటు
స్వీయ సంస్కృతికి స్వాహా పలికి
పర సంస్కృతికి ప్రాణంపోసి
ఇచ్ఛాపూర్వకపు హద్దులచే
స్వేచ్ఛాపూర్వకపు సిద్ధులచే

నీలో తిరుగుతున్న నీలి నీడను
నీ ఐక్యతకు అడ్డంగాఉన్న గోడను.

మైనారెటీకి నావైపునుండి రక్ష
మెజారెటీకిమాత్రం నే నిస్తాను శిక్ష
వెనుకబడినవానికే నా దయాభిక్ష
ముందు నడిచేవానిమీద నాకు కక్ష
సుఖాన్ని భాజ్యంచేసే సౌధాల్లో

నీ కిస్తుంటాను శిక్షణ
నీ కందుతుంది దక్షిణ.

నా ప్రపంచంలో పేజీలులేని పుస్తకాలు
నా జేబులో సిరాలులేని కలాలు
నా ప్రాంగణంలో అంగాలులేని విగ్రహాలు
నా ఇంట్లో మగతనంలేని ఆగ్రహాలు
జాణల జాడగానే జారుతున్న నిగ్రహాలు
నా కంట్లో విలాసాలు నా వొంట్లో మోసాలు

నే నీ కాలపు రుద్రుడిని
నీ పాలిటి దురిద్రుడిని.


అవకాశవాదం నా మోదం
అందరినీ మోసం చేయడం నా వేదం
నీవు ఊహిస్తున్నదంతా అసత్యం
నేను చేస్తున్నదే అక్షరాలా సత్యం
నీవు నా మహేంద్రజాలంలో వంచితుడవు
దానిలో మూర్తీభవించిన సంకుచితుడవు

నేను నీ జేబులోని ధనాన్ని
నీవు చేస్తున్న రౌడీతనాన్ని.

వాజమ్మవలె చూస్తావెందుకు నన్ను
ఎప్పుడో తెలపకుండా మింగుతా నిన్ను
నీ రాజ్యంలో నా కెదురులేదు
నీకు బుద్ధివచ్చినదాకా నాకు బెదురులేదు
నీ చుట్టూ అల్లుకొన్న వింత వ్యవస్థను
నేడు నిన్నావరించుకొన్న దురవస్థను

నే నొక అధునికుడను
నీలిమను కోరే పథికుడను.

స్వీయ సంస్కృతిని మఱచిన సీమంతినులు
గురువునుతిట్టే శిష్యులు
క్షణంలో మతాన్ని మార్చే మనసులు
గుణం గణించని మనుష్యులు
బలహీనంగా పరుగెత్తే బాహుబలులు
అన్నిటిని స్వాహాచేసే హవనగర్భులు



అప్పులకై వూరేగే బికారులు
మగతనంలేని మానధనులు
చౌర్యం నేర్చిన శౌర్యవంతులు


వీరంతా నాకు మిత్రులు
నీ భవిష్యత్తుకు పుత్రులు.

నీ వలయం మారదు నీ బుద్ధి ఇక మారదు
నిన్నయోమయంలో పడవేసిన గారడిని
నీ వ్యక్తిత్వాన్నే మార్చిన వీరుడిని
ఒక శిఖరంనుండి జారిన నీ బ్రతుకు
తిరిగి చేర్చలేదు నీవు "సతికిన సతుకు"[1]

నేను చూస్తున్నాను నీ వ్యర్థ అభిమానాన్ని
నేను నీలో దాగిన వర్తమానాన్ని.

1. చదివిన చదువు.





మతిమరుపు
అతి ప్రమాదకరం

మీ జీవిత భీమా పత్రాలను ఇటీవల సరిచూసుకున్నారా ? మీరీ కింది విషయాలు గమనించారా ?

- వయస్సు గురించిన వప్పుదల
- చిరునామాలో మార్పు ఏదైనా వుంటే అది తెలియబరిచారా
- మీ పట్టా ప్రతిఫలం ఎవరికి ముట్టాలో పేర్కొన్నారా

ఈ పైన వివరించిన అంశాలను పట్టాదారులు సకాలంలో తెలియబరచనందున ఏటేటా అనేక క్లెయిములను వెంటనే పరిష్కరించడానికి వీలు లేకుండా పోతున్నది.

నేడే మీ పాలసీని తనిఖీ చేసుకోండి. ఈ నెం ప్రతి నెలా కట్టవలసిన ప్రీమియం సంగతికూడా సర్వదా జ్ఞాపకం వుంచుకొని, సకాలంలో సరియైన ఆఫీసుకు పంపించండి.

జీవితభీమాకు
ప్రతిగా మరొకటిలేదు

EP-LIC-SZ 62.

జ్ఞాన స్వరూపో భగవాన్ యతోఽ సౌ
వ శేషమూర్తి ర్న తు వస్తు భూతః
తతోహి శైలాబ్ధి ధరాదిభేదాన్
జానీహి విజ్ఞాన విజృంభితాని.

విష్ణుపురాణ 2—12—32.

'All things are self deployings of the divine knowledge'

అతిమానస తత్త్వం*

లేకఋత-చిత్

శ్రీ వేలూరి శివరామ శాస్త్రి

మానవ మనస్సుకు అవలి ఒడ్డున ఇచ్ఛాశక్తీ జ్ఞానశక్తీ క్రియాశక్తీ కల ఒకానొక తత్త్వం ఉన్నది. పురుషోత్తముని ముమ్మొగాలలో అదొకటి. మన మనస్సునుబట్టి దాన్ని అతిమానస తత్త్వం Super Mind అని అందాం. అది బ్రాహ్మీస్థితి నైశ్చల్యానికీ మానసస్థితి చాంచల్యానికీ నడుమ [1]ఉండి ఈరెంటికీ సంయోగ సంబంధం నెలకొలుపుతూ విశ్వాన్ని సృజిస్తుంది. ఆ తత్త్వ స్వభావం మనకు విరుద్ధమూ విడ్డూరమూ ఐనది మాత్రం కాదు. మనకెంతో దవ్వుగా ఉన్నా అది మన సత్తా శిఖరమే. మనం దాన్ని అందుకోనూ వచ్చు, తదుపలబ్ధిని పొందనూ వచ్చు. అయినా మన మనస్సుకూ దానికీ పోలిక లేదు. దాని స్వరూపమూ దాని క్రియాప్రణాలీ వేరు. మానవులలో దాని అభివ్యక్తికి ఉదాహరణం విరళాతివిరళమూ ప్రచ్ఛన్నమూ. గురికి బారెడు హెచ్చు తగ్గుగా మానవ మనస్సుకు, తెలుప వచ్చునా అంటే అదిన్నీ సందేహమే. దివ్యమైన దానికర్మశక్తిని దేవితోనయినా పోల్చి ప్రయోగించి మానవుల కర్మ జ్ఞాన జీవనక్రమాన్ని పెంపొందించడానికి వీలా కాదా అని అంటే గుటకలు మింగవలసి వస్తుంది. ఈ తత్త్వంతో మానవ మనస్సుకు ఏదో అంశంలో ఏకత్వం లేకపోతే ఆ అతిమానసం అలాటిది ఇలాటిది అని చెప్పి మానవ మనస్సుకు తెలియజెప్పడం అసంభవం. ఇక ఆ తత్త్వం కేవలం జ్ఞానఘనమే అయి దానికి క్రియాశక్తి గనుక లేకపోతే సాధకులు తమ కోర సాధనచే దాని స్వర్లోకానికి వెళ్ళి దివ్య జ్యోతిచే ఉద్భాసితులై దివ్యానుభవము పడయవచ్చుగాని ఈ మహావిశ్వం సృజించిన విశ్వకర్మ యెడల, పురుషోత్తమునెడల దానిని సార్థకపరచే జ్యోతిర్మయ సామర్థ్యం వారిలో మొలకువ పొందదు. అతిమానసచేతన విశ్వప్రసవిని అని మనకు తెలుసు. కనుక ఆ చేతన జ్ఞానఘనమే కాక దాని శక్తి కూడా జ్ఞానఘనమే. ఇక మనస్సు అతిమానసచేతనా నిసృష్టియే అయినప్పుడు 'ఆద్యాశక్తి'—'పరా సంవిత్తు'ల ధర్మమేఘమయిన 'మధ్యమా వాక్' క్రమిక సంకోచం వల్లనే దాని పుట్టుక. కనుకనే ఆత్మ తలపోసిన ప్రతిలోమ ప్రవృత్తిచే అది

---

* Life Devine-The Supermind as creator., Cha. XIV. (కొంత అనుసృతం, కొంత అనూదితం.)

1. తంత్ర శాస్త్రంలో మధ్యమా వాగ్రూపం. లేక బిందువు.

స్పృహ ప్రవేశం చేయగలదు. కాబట్టి తెలుస్తూనే ఉంది— మానసాతి మానసాలకు తాదాత్మ్య సంబంధం ఉందనిన్నీ మనసులో అతిమానస స్వరూపం పొందే యోగ్యత దాగి ఉందనిన్నీ వ్యావహారికభూమిలో పడుగు పేకలుగా అల్లుకొన్న సంస్కారాలచే దళసరి అయిన మనోవృత్తి అతిమానసం కంటె వేరూ విద్వారం అయిపోయిం దనిన్నీ. కాగా ప్రకృత మనస్సు సాధర్మ్య వైధర్మ్యల తరాజుతో తూచి అతిమానసాన్ని— అస్పష్టంగానే అని అందాం— వూహించవచ్చు. ఇదియూ కాక అప్పుడప్పుడు వెలుగూ శక్తి విభూతీ గుప్తమయియున్న చేతనయొక్క ఉత్తర భూమి లోనికి సాధకుని మనస్సు పోతూ వుండవచ్చు. అక్కడ చిత్ ప్రభాసంబోధి చిత్ప్రభాసం, బోధి,(Intution) అథవా అపరోక్షానుభవం ద్వారా మనస్సు అతిమానసం యొక్క మెరుపు చూడవచ్చు[2]. కాని అతిమానసంలో నెలకొని దాని దీప్తిని శక్తిని పొంది కర్మ నాచరించగల పరమసిద్ధి యిప్పటికీ మనష్యాధీనం కాలేదని ఒప్పుకోవాలి.

ఈ విచారణలో తలవిత్తనుంచోని— 'ఈ తెలియని రాజ్యంలో ఈ రహస్యాన్ని సూచనగానయినా తెలియ జేయగలిగే వెలుగురేక ఏదీ అతిప్రాచీనకాలంలో లేదా?' అని వెనక్కి తిరిగి చూస్తూ అడగటానికి బుద్ధి పుటుతూంది. తుట్టతుద కొకపేరు, ఈ విషణకు ఒక ఆది బిందువయినా వెతికి పట్టుకో లేవగా? మనం ఈ దివ్యప్రభకు అతిమానసం అని పేరు పెట్టాం. కాని ఈ పేరుకు రెండర్థాలు చెప్పుకో వచ్చు— మనస్సుకే ఇది ఒక ఉన్నత మైన సంస్కరణం అని ఒకటి, మామూలు మనస్సుకు ఆవలి ఒడ్డున ఉన్న మనస్సు అని ఒకటి. కాని ఇది అతివ్యాప్తం. ఎంచేతనంటే మనస్తత్త్వానికి పైనున్న అప్రమేయ తత్త్వంతో పాటు నడుమ నున్న తత్త్వ మేదయినా దీనికి అర్థం కావచ్చు. ఇటువంటి తత్త్వం ఒకటి ఉందని నిక్కచ్చి చేయబోయేముందు అతిమానసం అనే ఈ పేరు ఇపుడు అనుషంగికంగాగాని గౌణంగా గాని వాడుకొని దీని అర్థాన్ని మాత్రం వివరించడం ఆవశ్యకం.

ఇక్కడ మనకు రహస్యమైన వేదమంత్రాలు కొన్ని తోడుపడవచ్చు. వానిలో కొన్నిట అతిమాన సాన్నే దీపింపజేసే పశ్యన్తి విద్యుత్శిల వైఖరి తెరచాటు నుండి ఒక్కసారి మెరసి ఇట్లా చెపుతుంది: 'అతిమానస చేతన చిదాకాశ మహా ప్రసారం. అది భూమ. అచట సత్యజ్యోతీ ఋతవిభూతీ ఎడబాయ కుండా ఉంటవి. అది సాధారణ చేతనకు ఎంతో పైన ఉంది. సారసత్యమూ (ఋత) సత్యాభివ్యక్తీ తేజో మయమైన నిత్యైకత్వంలో స్వతఃప్రతిష్ఠితమై ఆ చేతనలో ఉండబట్టి అది సత్యదృష్టి అనిన్నీ ఆయాయి సత్యములన్నిటిని వరుస వరుసగా ఏర్చి తీర్చి చక్కగా రూపొందించగలదనిన్నీ దాని వాక్కూ కర్మా విఫలం కాదనిన్నీ అచట జ్యోతిస్సూ శక్తీ అభిన్నం అనిన్నీ, జ్ఞానమూ ఇచ్ఛా అభిన్నం అనిన్నీ చెపుతుంది.

ఆ వైదిక సూక్తాలను వివరిస్తే ఈ పై జెప్పింది అర్థం అని గోచరిస్తుంది. ఇంకా దేవతలు[3] స్వరూ పంచే ఆ అతిమానసం యొక్కయే ఓజస్సు. ఈ అదితి నుండియే వారి పుట్టుక. తమ సొంత యింట్లనే— 'స్వే దమే' వారు ఉన్నారు. ప్రజ్ఞచే వారు 'ఋత చిన్మయులు' (Truth Conciousness). కర్మచే సత్యాన్నే రూపొందిస్తారు. ఈ అతిమానసమయిన దివ్య ప్రకృతిలో అసలు రెండు తూగు లున్నవి: తన సృష్టిలో తన్ను వికసింప జేసికోవడం ఒకటి, మళ్ల వెనక్కి మరలించు కోవడం రెండు.

ఈ వివరణంతోపాటు మరి రెండు మాటలు కనబడతయ్. ఋషులు ఈ ఋత చిన్మయ చేతన యొక్క ముఖ్య వృత్తులను రెంటిని — 'చక్షుః' అనిన్నీ 'శ్రవః' అనిన్నీ వర్ణించారు. ఇవి అతిమానస చేతనలో నిరూఢమై యున్న ప్రజ్ఞ శక్తి యొక్క అపరోక్ష వృత్తులు. వీనిని క్రమంగా దివ్యదృష్టి అనిన్నీ దివ్య శ్రుతి అనిన్నీ అనవచ్చు. వీనినే కాక మరి రెండు వృత్తులను ఆ మహర్షులు విశ్లేషించి చూచారు. ఒకటి సంభూతి— సంవిత్. అనగా అంతటా వ్యాపించి అన్నిటినీ గ్రహించగల చేతనకు దరిదాపైన వత్తి. రెండవది విభూతి— సంవిత్.

---

2. 'యదేత ద్విద్యుతో వ్యద్యుతత్' (కేన)

3. The Gods are Personalities and Powers of the dynamic Devine...... (Dictionary of Sri Arobindo's Yoga, Compiled from the writings of Sri Aurobindo by M. P. Pandit.)

అనగా సృష్టికి అభిముఖంగా వెళ్ళే సంవేదనం. ఇది పరాగ్ దృష్టిని సూచిస్తుంది. వేదము చేసే సూచన ఇంతవరకే. ప్రాచీన ఋషుల ఆమ్నాయం నుంచి 'ఋత— చిత్' శబ్దాన్ని అతిమానసానికి వికల్పంగా వాడుకోవచ్చు. దీనివల్ల ఏ అతివ్యాప్తిగాని అవ్యాప్తిగాని ఉండదు.

అతిమానస చేతన పరభూమికీ అవర భూమికీ నడుమ 'క్రింది భూమికి దిగడానికీ మళ్ళా పై భూమికి పోవడానికీ నిచ్చెనవలె ఉన్న మధ్య భూమి' అని ఋషుల వివరణంవల్ల తేటతెల్లము. అతిమానసతత్త్వం వల్లనే పరతత్త్వంలోంచి అవర సృష్టి అయింది. దానివల్లనే అవరసృష్టికి పరంలోకి ఉత్తరాయణం సంభవిస్తుంది. అతిమానసానికి పైన అఖండ— సచ్చిదానంద— అద్వయచేతనం; దానికి క్రింద మనస్సుచేత నానావృత్తులలో వ్యూహింపబడే సఖండ చేతన. మనస్సుకు విశ్లేషించి కనుగొనడమే ఏకమాత్ర సాధనం. ఏకత్వమూ అనంత్యమూ ఈ రెండూ దాని అనుభవంలోకి రావు. అట్టి రెంటి నడుమ అతిమానసచేతన— ప్రపంచోల్లాసమయమైన సంభూతి సంవిత్తుచే—సర్వగ్రాహి సర్వావగాహి అయిన విజ్ఞానౌజస్సుచే—ఒక పెద ఉభయ బ్రహ్మనికి కూతురువలెనూ ఇంకొక పెద సృష్ట్యభిముఖమైన విభూతి సంవిదుల్లాసంచే మహామయ జగతికి తల్లివలెనూ ఉంది.

ఈ రీతిగా శాశ్వతమూ అద్వయమూ అచలమూ అయిన తత్త్వం ఊర్ధ్వంగా ఉంది. ఎప్పుడూ పరిణామం చెందుతూ చంచలమైన సృష్టి క్రింద ఉంది. ఈ రెంటికీ నడుమ సకలత్రిపుటికి ఆధారమూ సకల ద్విదళానికీ నిలయమూ అద్వైత సంపుటంలో బహుత్వం విప్పారే ఏకము యొక్కయే బహుధా వ్యంజనా రూపమైన పరమతత్త్వం [4] ఉంది. 'బాహ్యస్థితికీ విశ్వగతికీ నడుమ తటస్థంగా ఉన్న భూమియే సకల సృష్టికి మూలానికి అనగా విశ్వ సృష్టి సత్యాకరణానికి ఆదీ అంతమూ, ఆద్యంత వ్యాప్తకా మూలా భేద బుద్ధికి ఆదిబిందువూ, ఐక్యబుద్ధికి పరమ సాధనమూ గా ఉంది. ఈ మహావిద్యలో ఏక విజ్ఞానమూ— అనగా మూలతత్త్వం తెలిసికొని దాని సకల వైచిత్రినీ తెలిసికోవడం— ఆ మూల తత్త్వ కుక్షిలో నిగూఢమైయున్న సకలమునూ వికర్షించడమూ— మళ్ళా నిరంకుశమైన నానా సృష్టిచే తన్ను మరవని పరమ సామ్యపు అద్వైత రాగిణి ఉన్నది. 'మధ్యమావ్యాసపీఠియైన ఈ గౌరి' మనలో అనిరుక్త అద్వైతానుభవపు పరతీరమందున్న నిరుపాఖ్యసదాభాస, కేవలం అఖండం అద్వయం అనే కాక మనః కల్పితమైన నిర్విశేషాది విశేషణాలున్నా తొడగడానికి వీలులేనిది కాబట్టి ద్వైతా ద్వైత సత్తితమూ ఏకత్వ బహుత్వాది ద్వంద్వ విహీనమూ అయిన తత్త్వం మేలుకోదా? అదే ఆయా పరమార్థ సద్వస్తువు యొక్క పరమ నిర్విశేష ప్రత్యయం. దాన్ని ఆశ్రయించియే మన చేతనలో ఈశ్వరానుభూతి విశ్వ విజ్ఞానమూ వికసించేది.

ఈ వేదసూక్తాల వ్యంగ్యంగాని తాత్పర్యం గాని పూర్తిగా గ్రహించడం కష్టం. అందుకని కొంచెం తేట చేసి చూదాం— అద్వైత తత్త్వం సచ్చిదానందం అని అంటాం. కాని ఈ సంజ్ఞలో మూడు విషయాలు ఉన్నవి. ఆ మూటిని కలిపితే ఒక త్రయి లేక ఒక దివ్య త్రిపుటి అవుతుంది. మనం సత్, చిత్, ఆనందం అంటాం; ఆ పైని 'ఈ మూడూ ఒకటే' అని అంటాం. ఇది మన మనస్సు తెలిసికొనే రీతి. అద్వైత చేతనలో మాత్రం ఇట్టి విశ్లేషణం ఉండదు. అచట సత్తయే చైతన్యం, ఈ రెంటికీ ఏ మాత్రమూ తేడా లేదు. ఆ రీతిగానే చైతన్యమే ఆనందం, ఆ రెంటిలోనూ తేడా లేదు. స్వగత భేదం కూడా లేని బ్రహ్మములో జగత్తు ఎలా ఉంటుంది? కాబట్టి సచ్చిదానంద వస్తువే పరమార్థమయితే జగత్తు అసత్, అది ఏకాలంలోనూ లేదు. ఇంతేకాక అట్టి కల్పనకున్నా ఎప్పుడూ యోగ్యత లేదు. ఎంచేతనంటే, స్వభావం చేతనే అఖండమైన చైతన్యంలో ఖండన సామర్థ్యం ఎక్కడిది? కాగా దాన్ని పట్టుకుని భేద సృష్టికీ ఖండ సృష్టికీ అవకాశం ఎక్కడిది? దీన్నే 'అజాతి— వాదం' అని అంటారు. కాని దీన్ని అసంభవవాదమని అన్నా అనవచ్చు. అభావనీయ విరుద్ధ భాషణం అని అన్నా అనవచ్చు. 'పక్ష ప్రతి పక్షాలకు సమాధానం చెప్పరాని విరోధమే ఈ యుక్తికి పరిణామం' అని చెప్పజాలకపోతే ఈ వాదానికి బుజ వేయడం నిక్కంగా కుదరదు.

4 'ఏకం సద్విప్రా బహుధా వదన్తి.'

మనస్సు కేవలమూ భేదమే చూడగలదు. వస్తు పార్థక్యమే ప్రత్యక్షం చేసికోగలదు. జాతిని—సమష్టిని అనుమింప గలదు. నిర్విశేష మయిన ఏకత్వంగాని, అనంత్యంగాని దానికి అందదు. అట్టిదానిని కల్పన చేస్తే చేయవచ్చునేమో కాని అట్టి దానికి నిక్కమైన అస్తిత్వం ఉన్నదనికాని విశేషించి అదే ఏకమాత్ర సత్యమనికాని తెలిసికొనడం దాని శక్తికి మించిన పని. ఇక్కడ అద్వైత చేతనకూ దీనికీ పూర్తిగా విపరీతావస్థ. మూలంలో సహజమైన బహుత్వం తన్ను విలుప్తం చేసికోక ఏకత్వంలోకి పోలేదు. అంటే సఖండమైన బహుత్వ సత్యం అఖండాద్వైత సత్యాన్ని అడ్డగించి నిలేపి తనకు ప్రలయంరాకుండ దాంట్లో దూరలేదు. కాగా నిక్కమయిన అస్తిత్వం దానికి ఏకాలంలోనూ లేదని ఒప్పుకోవలసి వస్తుంది. అయినా దానికి అస్తిత్వం ఒప్పాలి. ఒప్పనంటావా సాక్షి ఎవరప్పుడు? దేనికి ప్రలయం వచ్చిందో మళ్లా ఆ అసంభవవాదంలోకే వచ్చి పడతాం. దీంట్లో ఆలా వాదించ వలసిన జాలం ఉన్నది. మనస్సును మూర్ఛతో పడవేయక ఇట్లా వాదించలేం.

మన మనస్సులోని చేతనకు పూర్ణ వికాసం కలుగలేదనిన్నీ ఉద్యోగ పర్వంలో పుష్టి పథంలో మనస్సు ఒక మజిలిమాత్ర మనిన్నీ మనం గ్రహించి నప్పుడు మనస్సుకూ చేతనకూ గల వైరుధ్యం తొలగుతుంది. మనస్సు విశ్లేషణానికీ (Analysis) సంశ్లేషణానికీ (Synthesis) యంత్ర మాత్రం. మూలతత్త్వం తెలిసికొనే సామర్థ్యం దానికి లేదు. తనకు గల శక్తి ఎంతో, అంతే తెలిసికో గలదు గనుక వ్యాపక మయిన వస్తువును తెలిసికొన్నంతే తప్ప ఇకపైన ఏమీలేదని అనుకుంటుంది. ఇది వస్తుజ్ఞానం కాదు, మరి తనయొక్కయే విశ్లేషణ సంశ్లేషణ జ్ఞానం. సత్యజ్ఞానం సంపాదించాలంటే మనస్సును దాటి ఉన్నతమైన వృత్తిని ఆశ్రయించాలి. మనస్సును అతిక్రమించడం ఎక్కడ వీలవుతుందో అదే మనస్సు తెలిసికోదగిన చోటూ దానికి పొలిమేరా!

ఇంకో విషయం: ఏసర్వ శూన్యం నుంచి ఏ మహాలయం నుంచి సమస్తమూ బయటబడి ప్రపంచాకారంగా ఏర్పడి మళ్లా ఇదంతా లయమై పోతుందో అట్టి అద్వైత చేతన అఖండాద్వయతత్త్వం ఎంత మాత్రమూ అసంభవం కాకపోగా అది అనాదియైన ఆత్మసంవరణపు శాశ్వత స్థితి. ఆ స్థితిలో సకల ప్రపంచమూ బీజరూపంగా ఉండి పోతుంది. కాని దేశకాలాలలో దానికి వికాసం ఉన్న చందం ఉండదు. ఆత్మసంవరణపు ఈ మహా బిందువు అచింత్యం అప్రమేయం పరమార్థ సత్స్వరూపం. ఈ స్వరూపాన్ని శూన్యవాదులు ఆత్మభావంగానూ విజ్ఞాన చరమ ప్రతిషేధరూపంగానూ చెపుతారు. తురీయ వాదులు దాన్నే సర్వాధారంగానూ మన భావాలకూ జ్ఞానానికీ ఏకాయనంగానూ చెపుతారు. 'ఏకమేవా ద్వితీయమ్' అని వేదాంతం చెబుతుంది. కాని ఈ అగ్రబిందువుకు ముందూ వెనుకా శాశ్వత కాలం నుంచీ కాలానికి ఆవలి గట్టున ఉన్నది మాత్రం ఆయా నిరూపాఖ్యమైన సత్—దేనిని అద్వైత స్వరూప మనిన్నీ చెప్పలేమో, అది మాత్రమే ఉంది. మరొటి లేదు. నిర్వికల్ప చేతనలో మొట్టమొదట అంతకూ ఆధారమయిన మహా బిందు ఘన స్వరూపం మెసలు తుంది. దానినే మనం అఖండ—అద్వయ— తత్త్వరూపంగా గ్రహింప చూస్తాం. ఇక రెండో సంగతి:— ఆ బిందువులో ఉపసుప్తమయిన యూపత్తూ వెలుగు తునకలై మున్నమై పొడిపొడియై ముగ్గై దేశకాలా లంతటా వ్యాపించి మహాగోచరమై యీ మహావిశ్వం కొంత ప్రత్యక్షమైన చందంగా మనం అనుభవానికి తెచ్చుకుంటాం. మూడో ముచ్చట: రెండోదంటూ లేని ఆ యేకమైన వస్తువు నుండి సమస్తమునూ వెలువరించి ముక్క ముక్కలుగా చేసి రూపెత్తించినా వాస్తవంగానే ముక్క చెక్కలుగా అనగా పరిచ్ఛిన్నంగా ఖండంగా పర్యవసితం కాకుండా చేసేదీ ఆ పరిచ్ఛిన్నత కాశ్రయమూ ఆధారమూ ఆ అద్వితీయైక వస్తువు నుండి ఎడతెగని ఆత్మ ప్రసారశైశ్వర్యమూ ఐనదే ఋత— చిత్.

సెక్షన్ 109

శ్రీ కొసకళ్ల వెంకటరత్నం

"గార్డ్ టర్నవుట్!" 'గార్డు రూముకి' ముందు నిలబడిన 'సెంట్రీ' ఒక్క అరుపు అరిచాడు. జిల్లాసూపరింటెండెంటు దొరగారి బాదామిరంగు 'ఫియట్ కారు' ఫిరంగి డిజైను' మలిచిన గేటులో సించీ బాణంలాగా రివ్వున దూసుకొచ్చింది. అటూ ఇటూ సిమెంటు కుండీలలో డాలియా మొక్కలు 'సెంట్రీ'కి 'సెంట్రీ'లల్లే నిశ్చలంగా పెద్దపెద్ద కళ్లు జేసుకుని కాపలాగాస్తున్నాయి. ఊచల గేటు కటూ యిటూ, ఇనపగొట్టాల రాటలు ఊతగా వేసిన వెదురు బద్దల 'ఆర్చీ' మీద, ఎర్రవిబోగన్‌విల్లా తీగ విప్పులు చెరిగిపోస్తోంది; ఎదుట పచ్చని 'లాన్' వెనక చిక్కగా విచ్చుకున్న సింగపూర్ సూరువరహాల గుత్తులు ఎవరో 'స్టెన్‌గన్' పేలుస్తున్న చిత్రాన్ని దృశ్యమానం చేస్తున్నాయి. 'వెయిటింగు'లో వున్న 'గార్డు' జవాన్లు ఆదరాబాదరా మడతటోపీలు సర్దుకుని, పటకాలు బిగించుకుని, 'ఫాలిన్' అయ్యారు.

జిల్లా 'పోలీసాఫీసులో' నెలవారీ 'క్రయిం మీటింగు' జరుగుతోంది. ఆ వేళ జిల్లాలో వున్న సర్కిలిన్‌స్పెక్టర్లూ, డిప్యూటీసూపరింటెండెంట్లూ, అందరూ 'హెడ్‌క్వార్టర్సు'లో హాజరై గడిచిన నెలలో తీసుకున్న పోలీసు చర్యల్ని సమీక్షించుకుంటారు. దొంగ దొరకని నేరాలలో దర్యాప్తు ఎందాకా కొనసాగిందీ, దొరికిన నేరాలలో ఎంతవరకూ 'ఛార్జిషీట్లు' దాఖలు చేసిందీ — ఇత్యాది సమాచారాన్ని కలబోసుకుని, ఆరాలు చూచుకుంటారు. పోలీసుల ఆచూకీ నించీ తప్పించుకుని తిరుగుతున్న పాత కేడీల ఉనికీ మనికీ, అనుమానమూ, చర్చలో కొస్తుంది ఆ 'మీటింగు'లో. ఏ నెల కానెల, నేరా లెక్కువవుతున్నదీ, తక్కువవుతున్నదీ, బేరీజు వేసుకుందుకు అవసరమైన భోగట్టా యావత్తూ 'సర్కిల్' వారీగా సేకరించి పట్టుకొస్తారంతా. ఎక్కువవడానికి కారణాలు చీల్చిచూచుకుని దాని కవలంబించదగిన చర్యలేవో, జిల్లా సూపరెంటు దొరగారు నిర్ణయించి, సబిన్‌స్పెక్టర్లకీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకీ సూచనలూ, సలహాలూ అందించి, ఆ మేరకి అవి అమలు జరిగేలా చూడమని డిప్యూటీలని ఆదేశించడం జరుగుతుంది.

'వైర్ ఫెన్సింగు' పక్కని కారాపి సూపరెంటు 'సెల్యూట్' తీసుకుంటుంటే 'బ్యూగ్లర్' 'బిగిల్' ఊదాడు. 'ప్రెజెంట్ ఆరమ్స్', 'స్లోపన్ ఆర్మ్స్' అయింతరవాత 'గార్డ్ ఇన్‌చార్జి' 'డిస్మిస్' అన్నాడు. సూపరెంటుదొర చేతిలో పేముబెత్తం పుచ్చుకుని, చంకలో 'హ్యాట్' పెట్టుకుని చీడీల మీదకి ఒక్క దూకుదూకి 'ఆఫీసురూమ్' లోకి వెళ్లిపోయాడు. సూపరెంటు ఆఫీసుకి వచ్చినా నిష్క్రమించినా తుపాకులు పేలుస్తున్నంత హంగామా జరుగుతుంది. ఆఫీసుగదిలో చుట్టూ గోడవారగా సర్కిలిన్‌స్పెక్టర్లు కూచున్నారు. 'యస్. పి.' అంటే సూపరెంటు దొర 'టేబిలు' కటూ ఇటూ 'డిప్యూటీలు' కూచున్నారు. దాని మీద 'కాలింగ్‌బెల్లూ', 'పెన్‌హోల్డరూ' పెన్ కుషనూ ఒక 'పంచింగ్ మిషీనూ' వున్నాయి. గాజు కూజాలో అమిర్చిన 'జినియాలూ, కాస్మాస్ పువ్వులూ' గుత్తుగుత్తులుగా 'సీలింగ్‌ఫాన్' కింద విరగబడి నవ్వుతో రంగులు కలబోసుకుంటున్నాయి.

చాలాసేపు క్రితంనెలలో జరిగిన నేరాలను గూర్చి చర్చ జరిగింది— 'టవున్'లో దొంగతనా లెక్కువయినయి. ధరలు మండిపోతున్నాయి— దేశంలో దరిద్ర మెక్కువయింది. కక్కుర్తి పెరిగి ఛిల్లర దొంగతనాలు విరామంగా సాగిపోతున్నాయి—అని సరిపెట్టుకుని చతికిలబడి కూచుందుకు అవకాశం లేదు 'పోలీసాఫీసర్ల'కి. మ రిహాను 'పోలీస్ డిపార్ట్

మెంటెందుకూ? దేశంలో ఉన్నవాడూ, లేనివాడూ, ఆకలి తీరనివాడూ, ఆకలి తీరినవాడూ, కూచుని కుప్పలందుకునేవాడూ, తిరిగి తిప్పలు పడేవాడూ— అంతా—ఒకళ్ల సరసని ఒకళ్లు—ఢీ అంటే ఢీ అనుకొంటూ ఉండాల్సిందే. అట్లా వుండగా, వాడి మీద వీడూ, వీడి మీద వాడూ దండయాత్ర చెయ్యకుండా, తుపాకీ మొనతో గిరిగీసి, గిరి దాటితే హంటర్ ఝళిపించాలిసిందే! దానికే 'పోలీసు డిపార్టుమెంటు!!' ఆ మాట కొస్తే, అందరికీ, చిత్తశుద్ధిగా కాకపోయినా, ఏదో సంసార పక్షంగా అన్నీ అమిరిపక్కా వున్నారుకుంటే, నిక్షేపంగా, ఒక్క పోలీసు డిపార్టుమెంటున్న మాటేమిటి, అన్ని డిపార్టుమెంటులలో ఒక్కటిగిని ఎత్తి పారెయ్యవచ్చును. అయినా నిరుద్యోగం పెరుకు పోగలదు! అమ్మయ్యో, ఉన్న పరిస్థితి ఇట్లా ఉండి పోషరిపించే! అంచాత, దరిద్రమెక్కువై నేరాలెక్కువై పోతున్నాయన్న మామూలు సిద్ధాంతం మరుగున పోలీసులు దాక్కుందుకు వీలులేదు. ''మరింకేమి కారణాలున్నాయా?' అని ఉపోగానంతో కుస్తీలు మొదలయినై. రాత్రిళ్ల 'పెట్రోల్ డ్యూటీలు', 'పెట్రోల్ చెకింగులు' సక్రమంగానే జరుగుతున్నట్టు నమోదయిపోతున్నాయి 'నోట్‌బుక్కు'ల్లో, 'జి. డి.'లలో, 'డయిరీ'లలో...

ఆఖరికి 'టవున్'లో జామీనుకేసులెన్ని పెట్టినట్లా అన్న మీమాంస వచ్చింది. జామీను కేసు పెట్టడమంటే, అనుమానించతగిన పరిస్థితులలో మనుషుల్ని పట్టుకుని కేసు బనాయించడం. మామూలు 'సెక్షన్ల' కింద దొంగాణ్ణి దొంగతనం చేసింతరవాత గానీ 'ప్రాసిక్యూట్' చేసేందుకులేదు. 'రాత్రిళ్ల, తక్కువలో తారుతూ సందుల్లో గొందుల్లో తిరుగుతున్నాడు—ఫలానిగంటకి నువ్వెక్కడ పెరుకున్నావు?' అని నిగ్గదియ్యగా, నమ్మదగిన సంజాయిషీ ఇవ్వలేదు— దొంగతనం చెయ్యబోతున్నాడు' —అని, మనిషిని మధ్యవర్తుల 'రిపోర్టు' కింద దొరకబుచ్చుకుని, పోలీస్ లాకప్‌లో పారేసి, మర్నాడు 'సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటు' కోర్టులో 'రిపోర్టు' దాఖలుచేసి కటకటాల వెనక నొక్కిపారెయ్యడానికి పనికి వస్తుంది, 'క్రిమినల్ ప్రొసీజర్ కోడు 109 సెక్షన్. ఆ 'సెక్షన్' కింద ఎన్నికేసులు పెడితే, ఆ ప్రాంతంలో నేరాలంత తగ్గ స్థాయిలో ఉంటాయా అని పోలీసువారి మతంలో ఖచ్చితమైన సిద్ధాంతం. పైవాళ్ళకి అది ఆషామాషీ అంచనా అనిపించినా అది లెఖ్ఖలోదికాదు.

'టవున్'లో క్రితంనెలా అప్పైనెలా చాలా తక్కువగా జామీనుకేసులు పెట్టడం జరిగింది. ''అర్గ్డీ'', అని జిల్లాసూపరెంటు 'టేబిల్' మీద ఒక్కగుద్దు గుద్దాడు, కీలకం దొరికిందన్న దిలాసాలో. 'యాష్‌ట్రే' మీద గాడిలో పొందికగా వుంచిన 'స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్టు' పీక అదిరిపడింది. 'సర్కిల్' తను తీసుకొచ్చిన 'క్రయింరిపోర్టు' ఒకసారి తిరిగేశాడు. 'వన్ టవున్ యిన్స్పె' (అంటే సబిన్స్పెక్టరు) జామీను కేసులేమీ పెట్టినట్టులేదు, ఈమధ్య. దాఖలు చేసినవన్నీ 'టూ' టవున్ యిన్స్పె పెట్టినవేను. 'సూపరెంటు' కొరకొరా చూశాడు 'డిప్యూటీ' వంక, ఎవరూ దీనికి బాధ్యులన్నట్లు. అయిన ఒక చిన్నదగ్గు దగ్గి 'సర్కిల్' వంక చూశాడు. 'సర్కిలు' గొంతు సవరించుకుని, అవసరంలేని 'పెన్ను' కోసం అదేపనిగా వెతికేస్తూ, ''అయ్య'' అని కొన్నిపు నీళ్లు నమిలి, ''ఏమిటయ్యా ఇదీ?'' అని పక్కనే ఉక్కిరిబిక్కిరవుతున్న 'వన్‌టవున్ యిన్స్పెయి' వంక చూశాడు, కరుగ్గా. ఉరుము రిమి మంగలం మీద పడ్డట్టు, ఆతగాడి పీకల మీదకి వచ్చిపడింది చివరికి.

మీటింగు ముగిసింది.

* * *

'వన్‌టవున్ సబిన్స్పెక్టర్' మోహనరావు ఉద్యోగానికి కొత్త. రాయవెల్లూరులో 'ట్రెయినింగ్'యి, 'ప్రాక్టికల్ ట్రెయినింగు' పూర్తి చేసుకుని ఇటీవలనే 'వన్‌టవున్ పోలీసుస్టేషన్'కి 'పోస్టు' అయ్యాడు... 'క్రాప్‌కటింగ్' మీసకట్టయినాలే బాజాకుగా 'ట్రిమ్' అయివుందిగాని, ఇంకా నలుపు తిరగలేదు: లేత మొహంలో వేలవిరాదపడ మకిలిగాని వానచినుకులోని నైర్మల్యమింకా ఇగిరిపోలేదు: లోకాన్ని పచ్చనిరంగులో చూడమరిగిన కళ్లతో, దొంగని కూడా మనిషి క్రిందనే జతగట్టి వ్యవహరించే సులిమెత్తని అలవాట్లింకా చూరుపట్టుకుని వేళ్ళాడుతున్న సుందర సుకుమార మూర్తి.

పక్కమీద నించీ లేస్తూనే, పోలీసుస్టేషన్ నించీ జవాను వచ్చి 'డిప్యూటీసూపరెంటు బంగాళా' నించీ

'టెలిఫోన్ కాల్' వచ్చిందని కబురు తెచ్చాడు. ఆదరా బాదరా కాలకృత్యాలు ముగించుకొని, క్రాపు నున్నగా దువ్వి, 'ఫుల్‌పాంటు' మీద 'కాకీ బుష్‌కోట్' వేసుకుని నికెల్ నక్షత్రాలు రెండూ బిగించుకుని, 'బ్యాడ్జి' పెట్టుకుని, 'క్రాస్‌బెల్టు' వేసుకుని, 'ఫోరేజ్' క్యాప్ పెట్టుకుని, కొత్తపండక్కి అత్తారిచ్చిన 'హంబర్ సైకిల్' మీద 'డిప్టీ' బంగాళాకి ఒక్కసరుగున వెళ్లాడు. బంగళాలో సర్కిల్‌ఇన్‌స్పెక్టరుగారు అప్పుడే హాజరై 'డిప్టీ'తో మాట్లాడుతున్నారు. ఇద్దరూ 'యుస్సాయి'ని తోమితోమి వదలిపెట్టారు జామీను కేసులు పెట్టనందుకు. ఎంత గుంజిపెట్టినా, 'యుస్సాయి' మోహనరావు ఒకే ఒక్క సమాధానమిస్తున్నాడు, 'తాను రాత్రిళ్లు గస్తీలలో జాగర్తగానే పరిశీలన చేస్తున్నాననీ, ఎవ్వరూ అనుమానాస్పదంగా అవుపళ్లేదూ' అని.— కేసు పెట్టాలీ అన్న సంకల్పం కలిగింతరవాత కేసు బనాయించేందుకు దారిదొరక్క తారట్లాడే 'యుస్సాయి'ని అదే మొదటిసారిగా చూచినట్టు ఆఫీసర్లిద్దరూ మోహనరావువంక తూట్లు పడేలా చూచినట్టేచూచి, ఆ తరవాత సాభిప్రాయంగా ఒకరివంక ఒకరు చూచుకున్నారు. ఇట్లాకాదని, 'డిప్టీ' వాదన కట్టిపెట్టి, ఒక్క నిట్టూర్పు విడిచి, "ఈ పులిపిల్ల కింకా పంజాగోళ్లు వచ్చివచ్చిగా వున్నాయి—వేట నేర్పండి" అని 'సర్కిల్' చెవిలో ఊది, 'జీప్' మీద హడావుడిగా దొరబంగళాకి వెళ్లిపోయాడు.

* * *

'యుస్సాయి' తిన్నగా పోలీసుస్టేషను కొచ్చిపడ్డాడు. టోపీ 'టేబిలు' అంచునపెట్టి 'రైటర్' అని పిలిచాడు. 'రైటర్' వచ్చి నిలబడ్డాడు. అతగాడికి జరిగిందంతా పూసగుచ్చినట్టు వర్ణించి చెప్పి, "దొరకడంలేదు మొర్రో మంటుంటే జామీను కేసులు పెట్టుపెట్టు అంటే ఎట్లాగోయ్, ఇదేమన్నా కాఫీ సేవించడమా?—గబగబ సాసర్లో పోసుకుని, రెండు సార్లు 'సిప్' చేసి కప్పు ఖాళీచేసేందుకు?" అని డిప్టీ దగ్గర చెయ్యాలిసిన 'ఆర్గ్యుమెంటు' పరోక్షంగా రైటరు దగ్గర ఏకరువు పెడుతున్నాడు 'యుస్సాయి.' రైటరికి జరిగిందంతా తెలుసు. అంతా విని, మెడ గీరుకొంటో, "కేసులు పెట్టాలండి మరి" అని ముక్తసరిగా సూచించి, తలపంకించి, 'యుస్సాయి'గారు 'సీరియస్'గా ఉన్నారని పసిగట్టి, మాలిమిడాయించుకుని నిల్చుండిపోయాడు. "ఇంతటితో వదలిపోకవా నిన్ను పిలుస్తా?" అన్నట్టు, ఒకసారి చిరాకుగా చూచి, 'రైటర్ని' పొమ్మని పెద్దహెడ్డు రంగయ్యని పిలిపించాడు 'యుస్సాయి'. రంగయ్యహెడ్డు వచ్చి 'ఎటెన్షన్'గా నిలుచున్నాడు. గుండ్రటిమనిషి; నడుమూ, ఛాతీ, మెడా, మెడకాయి మీద తలకాయీ, అన్నీ గుండ్రంగా ఒకదాని మీద ఒకటి పేర్చినట్టుంటాయి, రంగయ్యహెడ్డు విగ్రహంలో. నవ్వుతో మాట్లాడతాడు; ఆ నవ్వులో పన్నెంత వుందో, ఎద్దేవా ఎన్నిపాళ్లు రంగరించాడో తెలుసుకుందుకు ఓ పట్టాన సందివ్వడు. రంగయ్య హెడ్డుకి 'యుస్సాయి' గారి గుంజాటన అర్థమయింది. "ఇంకా ఉండేలు దెబ్బతినని పిల్లకాకి!" అనుకున్నాడు.

"మరి ఆ 'టూ టవున్ సబిన్‌స్పెక్టరు' చంద్రం వెట్లా పెడుతున్నాడోయ్ 109 కింద అన్ని కేసులూ? నా కొక్కటీ చిక్కకపోయెను" అని తల ఓరగాపెట్టి ప్రశ్నార్థకంగా చూశాడు 'యుస్సాయి' మోహనరావు.

* *

"ఏముంది సార్—పాత నేరగాళ్ల 'జెయిలు' నించీ విడుదలయి వస్తారు కదండీ. రేత్రిళ్లు చక్కర్లు కొడుతున్నాడని కాస్తంత నలుప్చేసి 'రికార్డు' కెక్కించేదీ. ఆమట్నే, ఏదో సందు చూచుకుని, 109 సెక్షన్ కింద నొక్కిపారేశేదీ. లేకపోతే చస్తామాండి? వాడు మళ్లీ దొంగతనాలకి తాపీగా ఉపక్రమించేదాకా కనిపెట్టుక్కూచుంటామాండి? దొంగాడు కన్నంవేదామని ఇంటి చుట్టూ తిరుగుతుండగా, హాజరుగా వనల్ని వచ్చి 109 కింద కేసు పెట్టుకోండని 'నోటీసి'స్తాడా మనకి?...అట్లా అట్లా...ఆ యిలాగ్గా...ఇంటిచుట్టూ దొంగాడూ... వాడి జేబులో అగ్గిపెట్టె, ఒకబ్లేడూ.., రెండు పెద్దమేకులూ...ఒక కన్నపుకర్రా... ఒకటేమిటండీ... 109 సెక్షన్‌కి అవసరమయ్యే సరంజామంతా జేబూ తడమగానే బైటపడ్డమూ.. సరిఫ్రా ఆ గడియలోనే 'యుస్సాయి'గారు గస్తీ తిరుగుతో అక్కడ తారసిల్లడమూ.. అదంతా 'సినిమారీలు' అతికినట్టు 'కేస్ డయరీ'లో 'రికార్డ'యితేనే తప్ప, 109 కింద కేసు ఓపట్టాన నిలిచి చావదుకదండీ. చంద్రం సబ్ ఇన్‌స్పెక్టరుగారు ఎట్లాగూ ఘటికులండి! తమరేమో

పరేసరి" అని, తలగోక్కుని, "చిత్తగించారూ—వచ్చిన చిక్కేమిటాండి..ఈ దొంగవెధవలు.. సాక్ష్యమూ సంపన్నమూ దొరకని సమయంలో దొంగతనాలకి దిగుతారండి... ఎవరేనా సాక్ష్యం పలికితేనేగాని కేసు నెగ్గి చావదాయిరి". 'యస్సయి' చుర్రుమన్నాడు.

"అయితే నన్ను అబద్దపు కేసులు పెట్టమంటావుటోయ్?" అని గద్దించాడు.

"ఓయబ్బో—చాలామందిని చూశాను—అరీతల నక్కకి మూడితల నక్క ముక్కడం నేర్పుతోంది!" అనుకున్నాడు [రంగయ్యహేడ్డు. పైకి మాత్రం, "అమ్మమ్మ అంతమాట అనగలవాండి?" అని సద్దుకున్నాడు.

"నేను ఫస్తు పెట్టనట్లాంటి కేసులు—మెచ్చి మేకతోలు కప్పుతారని పాపం మాట గట్టుకొమ్మంటావుటోయ్? ఉద్యోగం ఉండనీ ఊడనీ, నావల్ల కాదుస్మీ" అని కుర్చీకి జారగిలబడ్డాడు 'యస్సయి'.

"ఇది పోలీసు భాష కాదు" అనిపించింది రంగయ్య హేడ్డుకి.

* * *

రాత్రి భోంచేసి కిళ్లీలు నములుకొంటో 'యస్సయి' మోహనరావూ, రంగయ్య హేడ్డూ పెట్రోలింగుకి బయల్దేరారు, 109 కింద కేసులు దొరుకుతయ్యేమోనని. 'టవున్'లో వాన అప్పుడే వెరిసింది. వాననీళ్లు జలజలా రోడ్డువారని పల్లాలు వెతుక్కుంటున్నాయి. కర్రవంతెన దాటి పడమటి వీధి సందులోపడ్డారు. కక్కుస్‌దొడ్ల పక్కని సందుల ముఖా, 'డైనింగ్‌హాలు' పక్కని అతిథులు విశ్రమించినట్టు, ఒకదానికొకటి అంటిపెట్టుకుని, చప్టా మీద వానరాళ్ళు పరిచిన పతుగా సందు లేకుండా పడుకొని నిద్రపోతున్నాయి.

ఆ ఇరుకుసందుల్లోనే కొందరు ఆవుల్ని గేదెల్ని తోవకడ్డంగా కట్టేసి గడ్డిగాదం వడేశారు. ఆ రొచ్చులో పలుపుతాళ్లు జీరాడుతున్నాయి. ఈగల్ని తోలుకొంటో గాటలో గడ్డిపరకలు కొరుక్కొంటో నిశ్చింతగా పడుకున్నాయవి. అప్పుడే కురిసిన వానకి ఏళ్ళూ కోళ్ళూ ఏకమయ్యాయి. అటూ యిటూ వున్న 'సైడు' కాలవలు వాననీళ్లతో బలిసి నల్లగా కొండచిలవలల్లే పడివున్నాయి. ఆ నీళ్ళు ముందుకి కదలవు. వెన్నక్కిపోవు. ఉన్నచోట ఇంకవు. అక్కడక్కడ మురికినీళ్ళు తోవకడ్డంగా ప్రవహించి అటూయిటూ వున్న సైడుకాలవల చేతులు కలుపుకుంటున్నాయి. మురుగుకాలవ మీద దోమలపటాలం అగడ్తలో సైనికులు కోలాహలం చేస్తున్నట్టు 'జయ్య'మని వివాహం మోత పెడుతోంది. తెట్టెగట్టిన నల్లని మురుగు దోమలకీ, మసమలకీ పురుళ్ళు పోస్తూ, మశూచి క్రిముల్ని ఎడాపెడా సరఫరా చేస్తూ, ఏమీ పట్టనట్టు తన 'డ్యూటీ' తను చేసుకుపోతోంది. ఇంత గలీజలోనూ ఇళ్ళల్లో ముసుగులుతన్ని పడుకుని జనం కావేసిన మామిడిపళ్ళల్లే ముగ్గుతోనే వున్నారు. కొంతమంది ఉక్కకి తాళలేక సైడుకాలవల కడ్డంగా నులకమంచాలు వాల్చుకుని, ఆ దుర్వాసన అటూయిటూ వృధాపోకుండా గాఢంగా పీల్చేస్తున్నారు.

పడమటి వీధిలో నించీ పెద్దబజార్లోకి అడుగుపెట్టారు. అటూయిటూ బత్తెంలేని పహరా జవాన్లకి మల్లే 'ఎలక్ట్రిక్ లైట్లు' పెద్దపెద్ద కళ్ళు చేసుకుని నిర్మానుష్యంగా వున్న వీధుల్ని కాపలా గాస్తున్నాయి. పెద్దవయస్సేమో, రంగయ్యహేడ్డు చలికి వొణుకుతున్నాడు. 'యస్సయి' బనియనూ, బనీను మీద 'బుష్షర్టూ', 'షర్టు' మీద వూలు 'స్వెట్టరూ', 'స్వెట్టరు' కింద మెడ పైన 'మఫ్లరూ' బిగించినా, అడుగడుక్కీ దాటాలిసి వస్తున్న గలీజుకి విలవిలలాడిపోతున్నాడు. వాన చిత్తడిలో రోడ్డంతా నెత్తురోడుతున్నట్టు లసలసలాడుతోంది. అక్కడక్కడ గుంటలు రాచపుళ్ళల్లే మెరుస్తున్నాయి. సైకిలు చక్రాల పూచల మీదనించీ ఎర్రమట్టి తుంపులు తుంపులుగా పడుతోంది. బజార్లో పెట్టెకొట్ల మధ్యనించీ దారి తీశారు. నిదురలో కనురెప్పలల్లే మూసుకున్న తలుపుల వెనక దుకాణాలన్నీ, "డబ్బుడబ్బు" అని కలవరిస్తున్నాయి. రోడ్డునిండా పేడకళ్ళూ, మేక పెంటికలూ, ఖాళీ సిగరెట్టు పెట్టెలూ, సగం కాల్చిపారేసిన బీడీముక్కలూ, అరటిపళ్ల తొక్కలూ, కాగితముక్కలూ, తిని పారేసిన మొక్కజొన్న బొండూలు చెల్లాచెదురుగా పడివున్నాయి. రెండో ఆట సినిమా విడిచి పెట్టారుగావును, జనం తండోపతండాలుగా ఇళ్ళకు పోతున్నారు. విజృంభిస్తున్న దోమలతో పోటీగా ఒక్కటే రొద! తుబుక్కున ఉమ్మేస్తూ

పోతున్నారు. మధ్యమధ్య గణగణమంటూ విన్పురుగా, పోతున్న సైకిళ్ళు, రిక్షాలు, రోడ్డువార వలువుల్లో లోతుగా నిలిచిన వాననీళ్ళతో, సినిమానించీ చకచక నడిచిపోతున్న సరదా పురుషుల మీద ఇంత బురద జల్లి ముందుకి సాగిపోతున్నాయి. నడుస్తుంటే, మూసివున్న కిరణాకొట్ల పక్కనీ, కూరగాయ దుకాణాల వారనీ, సంచుల మొగదలలోనూ, మూగిన అరటితొక్కల్లో నించీ, కుళ్ళిన పుగాకు కాడల కశ్మలంలోనించీ ఘాటైన దుర్వాసన దూసుకొస్తోంది. అక్కడ ఒక్కక్షణం ఆగి, మేడల మీదకీ, మిద్దెల మీదకీ, ఒకసారి 'టార్చిలైటు' వేసి నాలుగువేపులా పరకాయించి చూశాడు సబ్‌ఇన్‌స్పెక్టరు. మనిషి పురుగు మసలడంలేదు. ఈ గలీజులో కుళ్ళులో, కరకర నములుతో, ఈగల్ని తోలుకొంటూ, విచ్చవిడిగా తిరుగుతున్న దైవాధీనపు గొడ్లకటే! అవి ఎవరివో, ఎక్కడివో, ఎవ్వరికీ తెలియదు! తెల్లవారగానే మటుకు యజమాని ఇంటికి భద్రంగా చేరుకుని, కట్టుకొయ్యల దగ్గర నెమరేస్తూ పండుకుంటాయి బుద్ధిమంతనంగా. పైన ఉరుముతున్న నల్లటిమబ్బుని ఒక మెరుపు తీగ చక్‌చక్ మని కత్తిరించి పారేసింది. అవతల వీధి నించీ ఎవరో ఒక బీటు జవాను వేస్తున్న 'విజిల్' ఈదురుగాలిని చీల్చుకుని, నిశ్శబ్దాన్ని గిలకొట్టి, ఆకాశంలో లయమైపోయింది. ఎక్కడో ఒక మద్దెల దరువు—ఏదో ఒక నాటకానికి 'రిహార్సలు' జరుగుతోంది గావును. మూసివున్న దుకాణాల ఖాళీ అరుగుల మీద, చిప్పాక్రా తలాపిని పదిలంగా ఉంచుకుని ముష్టివాళ్ళు పన్నులేకుండా పక్కలుపరుచుకుని, పడుగూపేకగా పండుకొని నిద్రపోతున్నారు. వస్తు వాహనాలు లేనివాడి నిశ్చింతా, చెదరని నిదరే ఆస్తిగా గలవాడి నిషూచీ ఆ పడకలో కొట్టొచ్చినట్టు ముద్ర వేసుకున్నాయి. ఈ చివరనించీ ఆ చివరకి ఒక్కసారి పారజూస్తే వీధి వీధంతా ఒక తెరిచిన అనాధశరణాలయంలా పరుచుకొని వుంది. కొందరిని లేపి, నిలేసి, "ఎవరు నువ్వ"ని ప్రశ్నించారు. ఒకళ్ళిద్దరు ఆకొట్టు కాపలా' ని కొట్టాయన పండుకోమన్నాడని నసిగారు. రంగయ్యహెడ్డుకి నమ్మబుద్ధి కాలేదు. 109 సెక్షన్ ముద్ర ఎవడి మొహాన వున్నదా అని వెతుక్కొంటూ పోతున్నారు.

అన్నదాన సత్రానికి దిగువ కిళ్ళీకొట్టు తాలూకు బడ్డీకి సైకిలాన్చి సత్రం అరుగు మీద ఆ పడుకున్న ఎవరో లేపి తీసుకురమ్మని రంగయ్య హెడ్డుని పంపాడు 'యస్సయి' మోహనరావు. దగ్గరసా కడుపుబ్బి పగిలిన మ్యునిసిపల్ కుండీలోనించీ చెత్తా చెదారమూ, గుడ్డపీలికలతో మూసిన నల్లమపెస్మమూ బైటపడి, కండలూ పేగులూ వెళ్ళుకొచ్చిన కళేబరంలా వుంది. 'ఎలక్ట్రిక్ పోల్' దగ్గర నిలబడి, 'బెర్కెలీ సిగరెట్టు' వెలిగించుకుని, అగ్గిపుల్ల గాలిలో వూగించి, ఆర్పి అవతల పారేసి, గుప్పుగుప్పున రెండు పీల్పులు పీల్చి, రంగయ్యహెడ్డు వెళ్ళిన వేపే చూస్తూ నిలబడ్డాడు 'యస్సయి'. 'ఎలక్ట్రిక్‌బల్బు' చుట్టూ వున్న పరివేషంలో, చిమ్మటూ, గొల్లభామలూ, రెక్కలపురుగులూ విహారం చేస్తున్నాయి. ఆ చిన్న పురుగుల తాలూకు పెద్దపెద్ద నీడలు రోడ్డుమయానా ఎదుటింటి తెల్లగోడల మీదా పారాడుతున్నాయి. అందులో కొన్ని ఆకతాయిలు 'యస్సయి'గారి చెవిలో దూరదామంటే 'మస్లి'రడ్డమొచ్చి, నోట్లోకి దారి తీదామంటే ఇంజన్లాంటి సిగరెట్టు పొగవిచ్చి అడ్డ ఆకాలేని నాసికాపుటాలల కి 'క్యాపిస్టం'లో జొరబడ్డాయి. 'యస్సయి' చీదరించుకుని ఆ సెంటా తొలిగాడు.

రంగయ్యహెడ్డు సత్రం అరుగుమీద పడుకున్న ఆసామీని తట్టిలేపాడు. వాడు కళ్ళు నులుముకుని, "ఎవరోరు?" అని గొణిగాడు. నల్లచింటోతులా వున్నాడు. అరిటిదొప్పల్లాంటి బుగ్గలు—బొద్దింక రెక్కల్లా కనుబొమలు...మనిషి ఎండిన; ఓ వారుగలే వున్నాడు. కళ్ళు గాజుబిళ్ళలు!"—చూచి, "ఓరి నువ్వటా మహంకాళీ?" అని విస్తుపోయాడు రంగయ్యహెడ్డు.

* * *

రంగయ్యహెడ్డు మహంకాళీని ఎరుగును. మహంకాళీ విజయనగరం సైడునుంచీ పొట్ట చేతో పట్టుకుని రెక్కలమ్ముకుందామని బస్తీకి వచ్చిన ఒక నిర్భాగ్యుడు. వాడికి తల్లీతోడూలేరు. బస్తీలో జనం రద్దీగా వుంటారు. ఇంత జనాభాలో మనం ఒకళ్ళమూ బ్రతకలేకపోతామా అన్న భరోసా ఒకటే వుదయిస్తుంది ఎంతటివాడికేనా. 'ఏరు ఎంత పారినా కుక్క

కతుకుపోశ్లే' అని నాలుగురోజులు పోతేనేగాని ఓపట్నాన గ్రాహ్యంకాదు. వాడికి ఏలూరు కొత్త. పట్టణ వాతావరణమే బెదురుగా వుంది. రాగానే ఏకాయకిని 'మెయిన్‌రోడ్డు' వెంబడి నడిచివెళ్ళి 'లెవెల్ క్రాసింగు' దాటాడు. రోడ్డు మొగని, తాపీమేస్త్రీలూ, కొంత మంది ఆడామగ కూలీలూ, దేనికో ఎదురు చూస్తున్నారు. మేస్త్రీలు చొక్కాలు తొడుక్కున్నారు. ఆడకూలీలు చెప్పు లేసుకున్నారు. చుట్టలు కాలుస్తున్నారు. మగకూలీలు పంచెలెగగట్టారు. అంచులు జజ్జు జజ్జయిపోయిన ఖాకీనిక్కర్లు తొడుక్కున్నారు. ఒక ఆడకూలీ చేతిలో మూలమట్టమూ చెక్కటాపీ వున్నాయి. మగకూలీ చేతిలో తూకమూ, గజంబద్దా, 'స్పిరిట్‌లెవెలూ' వున్నాయి. "ఏదేశా కూలీ ఇప్పియ్యండి మారాజా" అని అర్థించాడు మహంకాళి. ఒక మెల్లకన్ను మేస్త్రీ ఎగాదిగా చూచి, "ఎవడవురా నువ్వు?" అని పరామర్శించాడు. "రాజుగారింట్లో కట్టుడు పనుంది కూలీ కొస్తావా?" అన్నాడు. "ఊఁ" అన్నాడు మహంకాళి. నక్కని తొక్కి వచ్చానను కున్నాడు. రెండురోజులు వరసగా కూలీ దొరికింది. అంతలో వర్షాలొచ్చినయి. ఇళ్ళ కట్టుడు పనులూ రిపేర్లూ వాయిదా పడినై. కూలీ దొరకలేదు. 'ఆఫీసు'లకి వెడుతో, రైలుగేటు దగ్గర ఆగిన ఉద్యోగస్తుల ముందు "బాబూ నాయనా" అని చేయి జాపాడు. ఎవరేనా విదిపితే ఒక నయాపైసా రాలుతోంది. ఇది వరకు కానీ కానీ దక్కేది. ఇప్పుడది నయాపైసాకి దిగజారింది. ఏమార్పిడీ వచ్చినా అట్టడుగు మనిషి మీద ఒకరాయి అదనంగా పడిందన్న మాటేగా! ఏ చట్టంవచ్చినా, ఉన్నవాడి జేబులో కాస్త చివికి, లేనివాడి కళ్ళల్లో రెండు మెరుపులు మెరిపి దక్కా పోతుంది. ముష్టెత్తాడు చివరికి. ఏ గృహస్థూ ఒక్కగింజ రాల్చిన పాపానపోలేదు. కొండామంటేనే కనాకష్టంగా వున్న గింజలకి ముష్టి ఒకటా? అత్తగారు అడుక్కుతింటుంటే అల్లుడు మనుగుడవ నొచ్చినట్టుయింది. నాలుగురోడ్ల మొగలో తలగుడ్డ పరిచి కాస్సేపు బేలగా మోహంపెట్టి కూచున్నాడు. దురదృష్టం! కుంటి గుడ్డి కాదాయెను! ఒక్కపైసా రాలలేదు. ఊళ్ళో అన్నదాన సత్రమొకటుందని తెలిసింది. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళాడు. సత్రం గుమాస్తా చీటీ ఇచ్చాడు. ఆ వేళకి జీవాత్మ శాంతించింది. మర్నాడు మళ్ళీ చీటీకని దేవిరించాడు. "రోజూ ఇదేపనా?" అని కసురుకున్నాడు గుమాస్తా. కూలీ అపోహించి నప్పుడు మిగుల్చుకున్న చిల్లరడబ్బులు నాలుగూ క్షయమై పోయాయి. ఒకనాడు పాతాళించిన శనగలు తినీ, ఒకరోజు ఫక్తు కొళాయినీళ్ళు తాగీ, అగమ్మ కాకిలా తిరగగానే వొంట్లో ఒకానొక తూలుడు ప్రవేశించింది. పొత్తికడుపు కింద సన్నని మంట చురచుర పేగుల్ని కోస్తోంది. శనివారప్పేట మలుపు దగ్గర వంతెన పిట్టగోడమీద వొంటి మీద స్పృహ లేకుండా పడివుండగా ఎవరో ఒక పుణ్యాత్ముడు, పెద్దాసుపత్రిలో చేర్పి చక్కాపోయాడు.

ఆసుపత్రిలో తెలివి వచ్చేసరికి ఒక ఇనుపమంచం మీద వున్నట్టు గ్రహింపుకొచ్చింది మహంకాళికి. పైన 'సీలింగు' ఫేన్ గిర్రున తిరుగుతోంది. మంచం మీద తెల్లని దుప్పటి పరిచారు. మీద ఎర్రని 'రగ్గు' కప్పారు. కాళ్ళకట్టున తెరిచివున్న పెద్ద అద్దాల కిటికీ మీద 'ఎలక్ట్రిక్‌లైటు' వెలుగు ముద్దగాపడి జిగేమంటోంది. చుట్టూ మంచాల మీద ఈసురోమంటో పడుకున్న రోగులు ఉండి ఉండి మూలుగుతున్నారు. ఆసుపత్రంతా ఫినాయిలు వాసన. 'కారిడర్'లో 'ట్రాలీ'ల మీదా, 'వీలింగు చెయిర్ల'లో, 'స్ట్రెచర్ల' మీదా రోగుల్ని అటూ యిటూ తీసుకుపోతున్నారు. ఒకటే రణగొణ ధ్వని. కొందరు పక్కలమీద 'రబ్బరు సంచులతో' 'ఇంజక్షన్లి'చ్చిన చోట జబ్బల మీద వేన్నీళ్ళ కాపు కంటున్నారు. హాలుకి ముందు, కాస్త వారగా, 'టేబిలు' మీద మందుసీసాలూ, ఎనామిల్ గిన్నెలూ పళ్ళాలూ మెరిసిపోతున్నాయి. 'మేల్‌నర్సింగ్ ఆర్డర్లీ' ఒకతను 'అవున్సుగ్లాసుతో' మందులు కలుపుతున్నాడు. వెనకాల 'డ్యూటీరూం'లో మెడలో పాము మెలికలల్లే 'స్టెతస్కోపు' వేసుకుని, హడావుడిగా తిరుగుతో, 'స్టాఫ్‌నర్సు'తో ఎవళ్ళకేమి మందివ్వాల్సో వివరించి చెబుతున్నాడొక డాక్టరు. ఎక్కడచూచినా ఆసుపత్రి నర్సులూ తెల్లని 'పవుడరు' రాసుకుని, తెల్లని 'గవు'న్లేసుకుని పిప్పరమెంటు బిళ్ళలల్లే అవుపిస్తున్నారు. ఆసుపత్రిలో జేర్పిన రెండురోజులకి పరీక్ష చేశారు. పరీక్ష చేసిన రెండురోజులకి ఫలానా మందు వాడాలి అని మంచానికి వేళ్ళాడదీసిన 'కేస్‌షీటు'లో వ్రాశారు.

రోజామటుకు 'అగ్జిలియరీ నర్సింగ్ మెయిడ్' ఒకామె వచ్చి 'థర్మామీటరు' నోట్లోపుంచి 'టెంపరేచరు' చూచి 'ఛార్టు'లో వ్రాసిపోతోంది. ఎవరి 'డ్యూటీ' వాళ్లు చేసుకునిపోతున్నారు. ఏతావాతా, మందు చేతిలో కొచ్చేసరికి 'టెంపరేచరు' తగ్గిపోయింది. కాని, గుడ్డిలో మెల్ల—రోజూ ఉదయమూ సాయంత్రమూ దాని పుణ్యమా అని తోపుడుబండీ మీద వాస్‌రొట్టెలూ, బత్తాయిపళ్లూ,అరటిపళ్లూ ఒకబెల్లం ముక్కా తీసుకొచ్చి'కోటా'ప్రకారం వాటాలు లేకుండాఇచ్చిపోతున్నారు.ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు మహంకాళీ. మందుబిళ్ల నోట్లో వేసుకుందామంటే మంచినీళ్లు తెచ్చిపెట్టే నాథుడు లేడు. ఒంట్లోనా జీవచచ్చి లేచినప్పుడు కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. కాని తోపుడు బండీ వచ్చినప్పుడు మాత్రం, సత్తువ కూడదీసుకుని, ఎట్లాగో ఓపిక తెచ్చుకుని, సోలుతోనో తూలుతోనో దగ్గరికి వెళ్లి ఏమరకుండా పాలూ రొట్టే అందిపుచ్చుకుని 'బెడ్ లాకర్'లో భద్రంగా పెట్టుకుంటున్నాడు. మందూ మాకూ అడగాలన్న ధ్యాసే లేకపోయింది. మొదటి రోజున ఒక కుక్క వచ్చి రొట్టెముక్క కాస్తా నోట కరుచుకుపోయింది. ఆసుపత్రి నిండా ఎక్కడ చూచినా కుక్కలు! పెద్దగేటు దగ్గర ఫూర్కా అయితే మనుషుల్ని ఆటకాయిస్తున్నాడుగాని కుక్కల్ని వొదిలేస్తున్నాడు. ఆ కుక్కలికి 'కబోర్డు'లో రొట్టెముక్కా బెల్లంముక్కా ఏటయిముకు హాజరుగా వుంటయ్యో, ముట్టెతో మూసిన తలుపులు ఎట్లా నొత్తిగించాల్నో, ముంగాళ్లు పైకెత్తి సీట్లాములు బైటికెట్లా లాగాల్నో, ఆ నొడుపులన్నీ క్షుణ్ణంగా తెలుసును. మర్నాటి నించీ కుక్క ఆ దరిమేనా రాకుండా జాగర్తపడ్డాడు. పాలూ రొట్టే నాలుగురోజులు వంటబట్టగానే జ్వరం ఎక్కడిదక్కడ ఎగిరి చక్కాపోయింది. పొత్తికడుపు కింద మంట—ఇంతాజేసి ఆకలిమంట అయివుంటుంది. నిస్త్రాణకొద్దీ తూలి వుంటాడు. మంచంలో అరుబయట పండుకున్న మూలాన కొంత ఉష్ణం తగిలివుంటుంది బహుశా. ఇంతవరకూ మందులు వేసుకోవడం లేదన్న సమాచారం గాని, రోగనిదానం పుష్టికరమైన రొట్టెముక్కల లోనూ రసంగల బత్తాయి తొనలలోనూ ఉన్నంతగా 'స్టెతస్కోపులూ' 'థర్మామీటర్ల'లో లేదన్న చిదంబర రహస్యంగాని మహంకాళి కొక్కడికే తెలుసు. రెండోకంటివాడికి తెలియదు. నాలుగైదురోజులలో కోలుకొని, కాస్త నేవళం తేరి, మంచం వొదిలి, అడపా తడపా కొంచెం తచ్చాడుతున్నాడు. పాలయితే అన్నీ పిండి పాలు. కాని ఆసుపత్రి చివర, అయిమూలగా, రోజూ ప్రొద్దుట గేదెల్ని ఆవుల్ని గుంపుగా నిలబెట్టి పాలు తెగపితికేస్తున్నారు. అవన్నీ ఎక్కడికి సరఫరా అవుతున్నాయో, ఇవెక్కడనించీ వచ్చిరోగులపాలబడుతున్నాయో, "ఏదో కుంభకోణముంది" అనుకున్నాడు మహంకాళి. అయినా ఈ స్తనశల్య పరీక్ష తనకెందుకూ? పుణ్యానికి పుట్టెడుగింజలు కొలిస్తే పిచ్చకుంచ మన్నాట్ట! నోరు మూసుకున్నాడు. ఎట్టొచ్చీ ఓపిక లేనప్పుడు మంచం మీదనించీ తనని లేవదీసిన వాళ్లుగాని, రెక్కపట్టుకుని కాస్త ఆసరా యిచ్చిన మహారాజులుగాని ఎవరూ కనిపించలేదు. నర్సులయితే మందుబిళ్లలూ గట్టా ఇచ్చిపోతున్నారంతే. అయితే తనకంటే దిక్కూమొక్కూ లేదుగాని, ప్రతి రోగికీ పక్కన అయినవాళ్లెవరో ఒకరు ఉంటూనే వున్నారు. నర్సులయినా కాస్త పచ్చగా తెల్లబట్ట లేసుకున్న రోగుల దగ్గర అడకుండగా ఏమి కావాల్నో కనిపెడుతూనే వున్నారు. తనలాంటి బక్కచిక్కిన వాళ్లకే ఇరకటం. "నీ కెవరూ లేరట్రా?" అని గదమాయించింది ఒకనాడు నర్సు. "నోరూ లేరండి" అని దిగాలుగా మొహం పెట్టాడు కాస్సేపు. పక్కటిదిక్కున పాచిపని చేసుకుంటున్న లచ్చి వుందని వొదిలేసి.

మొత్తమ్మీద అందర్‌దర్బారుగా జరిగిపోతోంది మహంకాళికి. "దేశం ఎంత సుభిక్షంగా నడుస్తున్నది. మహారాజులు, అయాచితంగా, డబ్బా దస్కం అడక్కుండా, అప్పనంగా, ఎన్ని సదుపాయాలు అమిర్చి పెడుతున్నారు! ఎంత మర్యాద—ఎంత మన్నన!" అని తెగమురిసిపోయాడు మహంకాళీ.

* * *

కాని, ఒకనాడు ఒక విడ్డూరం జరిగింది. మహంకాళీ మంచానికి రెండుమంచాల అవతలగా ఒక రోగి వున్నాడు. ఆవేళ 'డి. యం. వో' 'రవుండ్సు'కి వచ్చి, అక్కడ నిల్చుని, స్టాఫ్‌నర్సుని పిలిపించి అందరి ముందూ దులిపేస్తున్నాడు. ఏమా ఈ రభస అని

మహంకాళీ చెవులు దోరబెట్టుకుని విన్నాడు. అర్థం కాలేదు. డి. యం. వో. వెళ్ళిపోయింతరవాత నర్సు ఏదో గొడవగా అరుస్తూ పోతోంది 'డ్యూటీరూం'లోకి. అతగాడు—ఆ రోగి—నీరసంగా వున్నాడట. కదల గూడదట. కదలలేడట. నోట్లో బిళ్ళవేసి మంచి నీళ్ళందివ్వలేదట నర్సు! వాడు తురతురమని డి.యం. వో.తో ఫిర్యాదు చేశాట్ట పైగా! అదో అపరాధమా? ఆ నర్సమ్మ అట్లా బేలగా తేలిపోతుందేమిటి? అది ఆవిడ డ్యూటీవా? నోరున్నవాడిదే రాజ్యం గావును. దిక్కుమాలిన గోల. ఆ తరవాత ఆరా తీశాడు మహంకాళీ. ఆ రోగి పేరు రాజాలు. వాడికి సిమెంటు కార్ఖానాలో పని. గుండెపోటుకని ఆసుపత్రిలో జేరాడు. మెల్లిగా మహంకాళీ వాడితో దోస్తీ కలిపాడు. రాత్రిళ్ళు పొద్దుపోయింతరవాత గుమ్మాల ముందు కూచుని ఏవో సొదలు వెళ్ళబోసుకునే వాళ్లిద్దరూను. రాజాలు విచిత్రంగా మాట్లాడలాడు. ఆ తిరుగుతున్న 'నర్సుల్ని', 'తోటీలని', 'నర్సింగ్ ఆర్డర్లీల'నీ రోగులకి ఉపచారాలు చేసేందుకే జీతాలిచ్చి పెట్టారట! ఏదో సుతారంగా మందుబిళ్లలిచ్చి, రొట్టెముక్కలందిచ్చి రోగులికి చెయ్యాలిసిన సేవలా గట్టా తక్కిన డ్యూటీలన్నీ ఎగవేస్తున్నారట! రోగి మంచం మీద నించీ లేవలేకపోతే, వాళ్ళ రెక్కాసరా యిచ్చి లేవనెత్తాలట. పక్కగుడ్డలు ఏరోజు కారోజు దులిపి అవసరమైనప్పుడల్లా మార్చాలట! రాత్రిళ్ళు మూలిగితే ఆరా ఒడగాలట! అవసరమైతే డాక్టరికి కబురు పెట్టాలట! అదేమీ కన పడదు ఆసుపత్రిలో. వాళ్ళు తీసుకుంటున్న జీతాలు గవర్నమెంటోడు ఇస్తున్నవేనట! సర్కారుకి పల్లెటి దిక్కు లగాయితూ పన్నులు గడితేనేగాని లేకపోతే ఖాళీయేనట! మహంకాళీకి నమ్మబుద్ధి కాలేదు. వాడొక తిక్కశంకరయ్య! ఆసుపత్రి అట్టుపుట్టు అన వాళ్ళన్నీ తనకి తెలుసున్నట్టు వాగుతాడు! అనుకున్నాడు మహంకాళీ. అంత సుబ్బరమైన బట్టలేసుకుని, అట్టే తెల్లగా మెరిసిపోతున్న ఈ నర్సమ్మలు తన లాంటి మకిలి మన్నాసుర్ని పట్టుకునీ, ముట్టుకునీ, చెంఘజేసుకునీ, అడ్డమైన చాకిరీలూ చెయ్యాలీలంటే తనకే నమ్మవనిపించడంలేదు. అసహ్యం వెయ్యదూ? బట్టలు గలీజు కావూ? ఇట్లా కాదని ఒకసారి తోటీ రాముల్ని అడిగి చూచాడు—మహంకాళి. ఈ నర్సుల కెంతెంత జీతాలూ అని. వాడు చెప్పిన అంకెతో మహంకాళీ గుండె ఆగింది. గవర్నమెంటోడు అంతేసి జీతాలు ఏదో తెల్లగవున్నేసుకుని, మెత్తని 'కేన్వాసు' చెప్పు లేసుకుని, పువ్వులమ్మినట్టు మళ్ళా పాలూ అందించీ, డాక్టర్లతో చలాకీగా మాట్లాడి, అట్టాఅట్టా కులాసాగా తిరిగినందుకే ఇస్తారా? ఇందులో ఏదో తిరకాసుంది అనుకున్నాడు మహంకాళి. తన కన్యాయం జరిగిందా? ఏమో మనిషన్న వాడికి మనిషిగా బ్రతికే హక్కు ఎంతవరకూ ఉందో, ఎంతమందికి తెలుసు ఈ విశాల ప్రపంచంలో? తలపించుకుని ఏ'డ్యూటీ' మాత్రం నువ్వు చేసుకుపోక్కే లేకపోతే-నరకాన పడతావు అని ధర్మశాస్త్రాలయితే ఉద్ఘోషిస్తున్నాయి. దారీ డొంకా తెలియని ఈ నాగరిక మహారణ్యంలో ఎవడి జేబులో ఎవడు చెయ్యి పెడుతున్నాడో, ఎవడికెవడు బాకీ వున్నాడో ఏమి తెలిసి చస్తుంది? తనకైతే అన్నీ సజావుగానే నడిచినా ఫరవాలేదు, అనిపించింది మహంకాళీకి. తనకి జరగని ఉపచారానికి తను బుర్ర పాడు చేసుకోవడం దేనికీ? కాస్త తెరిపిన పడగానే, హక్కుల సంగతిఆలోచనలు సుడి తిరుగుతున్నాయి తనలో— హక్కులు!

ఉన్నట్టుండి పిడుగుపాటులాంటి ఆపత్తు వొచ్చి పడింది. మహంకాళిని ఆసుపత్రినించీ 'డిస్చార్జి' చేశారు. ఇంకా రోజ్వరముంది.బాబ్బాబు అని ప్రాధేయ పడ్డాడు. డాక్టర్లు ఖాతరు చెయ్యలేదు. అయితే, జ్వరం-తగ్గి 'వార్డు'లో కాస్త అటూఇటూ తచ్చాడు తున్నప్పుడు ఒక చిన్నపథకం వేసుకునే కూచున్నాడు మహంకాళీ. రికామీగా ఉన్నాడని నర్సులు అడపా తడపా కొన్ని చిల్లరపనులు పురమాయిస్తూ వచ్చారు మహంకాళీకి. 'డి. యం. వో' 'రవుండ్స్'కి వచ్చే ముందు, 'కబ్బోర్డు'లు తుడవమనీ, తోవలో పడిన బత్తాయి తొక్కలు చెత్తకుండీలో పడేయమనీ, తోపుడుబండి వెనక తోడుగా ఉండమనీ, ఆ మూల ఫ్లిట్‌పంపు కొట్టిరమ్మనీ, అక్కడ రోగికి 'బెడ్‌పాన్' ఇచ్చి రమ్మనీ, ఇక్కడ రోగికి 'యూరినల్' అందివ్వమనీ. ఇట్లాంటి చిల్లరమల్లర పనులు చెప్పగానే ఇష్టంగా చేసేవాడు. డాక్టర్లకీ, నర్సులకీ కాఫీలూ టిఫినూ తెచ్చిపెట్టి వాళ్ళ కనుసన్నలలో మెలిగేవాడు. అత

గాడు అసుపత్రి సిబ్బందిలో ఒకడనుకుని, 'వార్డు'ల ఉన్న రోగులు సైతం ఆ పనీ ఈ పనీ చెప్పి చేయించుకోవడం ప్రారంభించారు. 'డిస్చార్జ్' అయి వెళ్ళిపోయే ముందూ మధ్యలోనూ పావలా అర్ధా ముట్టజెబుతున్నారు. నర్సులూ యం. యస్. వోలూ తను 'డిస్చార్జ్' అయింతరవాత గూడా చేతికిస్తే పొంగా ఇంత రొట్టె, ఒక అన్నంపళ్ళెమూ అడక్కుండానే ఇస్తూ వచ్చారు. అవసరమైతే ఏ రోగి నోట్లోనో కరక్కాయగొట్టి వాడి కోటా వాడికి మిగిల్చి, మరీ ఆ కట్టుకుంటున్నారు వాళ్ళే. మెట్టుకి 'నర్సు'లూ, 'అగ్జిలియరీ నర్సులూ' తాము చెయ్యాల్సిన 'డ్యూటీ'లన్నీ లబ్బుగా మహంకాళిచేత చేయించి చిల్లర మల్లరగా రోగుల దగ్గర పిండుకొమ్మని చెప్పకుండా ఉపాయం చెప్పి ఊరుకున్నారు. అమట్నే తిరిగా 'డ్యూటీరూం'లో కిలకిలా నవ్వుకొంటూ ఖుషీగా కాలక్షేపం చేస్తున్నారు. ఇది మహాబాగా వుందనుకొన్నాడు మహంకాళి. పెద్దమనుషుల్లా తనదాకా వొచ్చేవా అని సరిపెట్టుకున్నాడు. ప్రొద్దున్న 'డి. యం. వో' 'రవుండ్స్'కి వచ్చి రోగుల్ని పరీక్ష చేస్తున్నప్పుడు మటుకు కాస్సేపు ఏమూలనో తల దాచుకుంటున్నాడు. అసుపత్రిలో అసుపత్రిఉద్యోగులూ, రోగులూ మినహా ఎవరూ ఉండగూడదు మరి. ఆ తరవాత విచ్చలవిడిగా డాక్టర్లకీ, నర్సులకీ, రోగులకీ, కావలిసిందల్లా అందించి, అడ్డమైన చాకిరీలూ చేస్తున్నాడు. ప్రతిఫలంగా నాలుగు చిల్లరడబ్బులు చేజిక్కించుకుంటున్నాడు. రాత్రిళ్లు బీడిలు కాల్చుకొంటూ ఖులాసాగా రోజులు వెళ్లమారుస్తున్నాడు. తనపని నిమ్మకాయవాటంగా ఉన్నదనుకున్నాడు మహంకాళి.

ఆ సందర్భంలోనే రంగయ్యహెడ్డు తటస్థపడ్డాడు మహంకాళికి. రంగయ్యహెడ్డు ఏదో గాయానికి కట్లు గట్టించుకుందామని 'ఇన్‌పేషంటు'గా 'జాయిన్' అయ్యాడు అసుపత్రిలో. అతనికి అరఖాళం దివ్వా, 'బెడ్‌లాకర్' నించీ మంచినీళ్లతేనా, లోటాలో పాలుపట్టి జాగర్త పెట్టనూ, బత్తాయి తొనలు వొలిచిపెట్టనూ అన్నిసదుపాయాలూ అమిర్చిపెడుతో అతగాణ్ణి మంచి చేసుకుని కాస్త దండిగానే డబ్బులు వడుక్కున్నాడు. రంగయ్యహెడ్డు మంచివాడు. అసుపత్రిలో వున్నన్నాళ్లూ తనని కనిపెట్టుకుని వున్నందుకు మహంకాళిని మహాప్రీతిగా చూచాడు. 'డిస్చార్జ్' అయి వెళ్లిపోతూ రెండురూపాయలు బక్షీసిచ్చి ఎప్పుడేనా 'స్టేషను'లోకి రా అన్నాడు.

కాని ఒక చిన్న పొరపాటు జరిగింది. మహంకాళి అసుపత్రిలో అడగనివాడిదే పాపమన్నట్టు అందరికీ అరవచాకిరీ చేశాడు. అదీ వొచ్చిన అసిఫాల. ఇష్టంగా చేస్తున్నాడు గదా అని చేయించుకునే వాళ్లు ఎక్కువైపోయారు 'వార్డు'లో. అప్పనంగా చేయించుకోవడం మరిగారు కొందరు; ముట్టజెప్పే నాలుగు చిల్లడబ్బులికీ గుంటచిక్కులు పెట్టారు మరికొందరు. ఇస్తాఇస్తా అని ఆఖరికి తాంటుచెయ్యి చూపించి చెప్పపెట్టకుండా ఉడాయించారు ఇంకొందరు. ఇట్టా కాదనుకున్నాడు మహంకాళి. అర్థంలేనివాడు వ్యర్థుడని! ఇప్పుడే నాలుగురాళ్లు వొల్చుకోవాలనుకున్నాడు. చెరుకా బెల్లం పెట్టమంటే పెడుతుందీ? విరిచి గానుగలో పెట్టి తిప్పి, నలగ్గొడితేనేగాని నాలుగు పానకం చుక్కలు రాల్చదు ఓపట్టాన. మనిషికింతా అని 'రేటు' పెట్టాడు. కోతికి కొబ్బరికాయ దొరికినట్టు, ఆ 'రేటు' దఫదఫాలుగా పెంచాడు. 'ఎడ్వాన్సు'గా కొంత ముట్టజెబితేనేగాని అసలు పలికేదే లేదని మొరాయించాడు. వెనకాల నించీ వాళ్లు పిలుస్తుంటే పట్టించుకోకుండా ముందుకి దూసుకుపోతున్నాడు. దరిమిలా రంగయ్యహెడ్డు కొక్కడికీ మినహా తక్కిన వాళ్లకెవళ్లకీ పలక్కపోవడంతో కొందరు 'పేషెంట్లు' కావేషలు పెంచుకున్నారు. వాడు అసుపత్రి సిబ్బందిలో ఒకడన్న అపోహ అల్లుకుపోయింది పైగా. దానాదీనా కొంత శత్రుత్వమూ కొనితెచ్చుకున్నాడు మహంకాళి.. తోటి రాముడుకి సరేసరి. మహంకాళి అంటే పీకలదాకా వుంది. మహంకాళి చేస్తున్న కొన్ని చిల్లరపనులు తోటి రాముడు చెయ్యకుండానే ఎగవేసి, 'పేషెంట్లు' అసుపత్రినించీ 'డిస్చార్జి' అయి వెళ్లిపోయే సందున నవ్వుతో ఎదురుగా నిలబడి "తోటీనండి" అని వెళ్లబోసుకుని మామూళ్లు వట్టేనే దండుకునేవాడు అందాకా. ఇప్పుడు వాడికి ఏడి పోటీ ఒకటి—రోగులకి కావలిసిన పనులు చేసిపెట్టడంలో కాదు, బక్షీలు వొడుక్కోవడంలో—ఈ మహంకాళిగాడు ఏకై వచ్చి మేకై బిగిసిపోయి

తనకి రావలసిన మామూళ్ళు కాజేస్తున్నాడని వాడికి అక్కసుగా వుంది. చూస్తూవుంటే మేస్త్రీ పోతున్నాడాయెను—వాడికి అక్కడ వున్న డాక్టర్లూ, నర్సులూ వత్తాసే! కాని, కోడిగుడ్డు చితగ్గొట్టాలంటే గుండ్రాయి కావాలి! వీడి పని పట్టాలని, తోటి రాములు ఒకనాడు నేరుగా 'డి. యం. వో.'కే పితూరీ చేశాడు. వాడు పై మనిషనీ, ఇక్కడ గాదెకిందపందికొక్కులే జేరాడనీ, ఏనాడో డిస్చార్జయిన రోగి అనీ, వాడికిక్కడ ఉండాల్సిన పనిలేదనీ, రోగుల్ని జలగల్లే పీల్చుకు తింటున్నాడనీ, ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పాడు. కొంతమంది రోగులు వంత పలకనూ పలికారు. "ఎవడీ మహంకాళీ?" అని ఆరా తీశాడు 'డి.యం.వో'. వచ్చి నిలబడ్డాడు. "ఎవడవురా నువ్వు? ఎందుకొచ్చావిక్కడికి?" అని 'సీరియస్'గా అడిగాడు. దొంగకి తేలు కుట్టినట్టు బిక్కుబిక్కుమంటూ చూచాడు మహంకాళీ. నర్సులు తమని కాదన్నట్టు మొహాలు తప్పించారు. "ఒరే రాములూ వీణ్ణి బైటికి నెట్టు" అని 'ఆర్డరు' వేశాడు 'డి. యం.వో'. తోటి రాములు అంతపనీ చేశాడు. "వోట మట్టిగాడిలివి గదరా" అనుకుని బైటికి నడిచాడు మహంకాళీ.

నదురుగా వుందిగదా తిష్టవేదామని చూస్తే తుండూ తుపాకీ ఎగిరి చక్కాబోయింది. తల తడుముకుని నాలుగురోడ్ల మొగలో షెడ్డీపైకి లాక్కుని, ఊడిపోతున్న తలగుడ్డ సర్దుకుని, ఎటు పోదామా అని మీనమేషాలు లెక్కపెట్టాడు కాస్సేపు. రోడ్డువారని కాళ్లలో ముట్టె దూర్చి కుక్కపిల్ల పడుకుంది. ఒక్కతన్ను తన్నాడు. కుయిక్కుమంది. కాలేజీ రోడ్డు కలకలలాడుతోంది. కూరగాయ కొట్ల మీద దొండు లూరు వంకాయలు మిసమిసలాడిపోతున్నాయి. కొరుక్కు తిందామా అనిపించింది. అలవాటు తప్పిన ఆకలి మళ్ళీ చురచురమంటోంది. కాఫీహోటళ్లు మాత్రం చవకగా నేతి ఘుమఘుమలు వీధుల్లోకి జారీ చేస్తున్నాయి ఖరీదడక్కుండా. మిఠాయి కొట్టాయన బొర్ర పెంచుకున్నట్టున్నాడు. బంగిడీలో మిఠాయి వుండలు గుండ్రంగా మెరుస్తున్నాయి. ఒకపళ్లెంలో మైసూరు పాక్ ముక్కలు ఒకదాని మీద ఒకటి, మధ్యమధ్య పావురాయి గూళ్లల్లే వాటంగా వొదిలి, గుడి గోపురంలా మహానందుగా పేర్చాడు. రోడ్డు మీద అందరూ ఏదో పనిమీద హడావుడిగా పెద్దపెద్ద కేకలేసుకొంటూ పోతున్నారు. తనకొక్కడికే పనీపాటా లేదు. ఒకచోట వేరుశనక్కాయలు నములుతో రాజీగాడు అపుపించాడు. రాజాలు ఇదివరకే 'డిస్చార్జ్'యి వెళ్లిపోయాడు ఆసుపత్రినించీ. సిమెంటు కార్ఖానాలో వాడిస్తానే ఎవడో దూరి చక్కా ఊరుకున్నాట్ట. ఒకటిరెండు రోజులు 'బస్సుస్టాండు' దగ్గర ట్రంకు పెట్టెలు దింపీ, 'డిపో' దగ్గర సరుకుల బస్తాలు మోసీ వెళ్లమార్చాడట. బొచ్చు ఎంత కాలిస్తే మటుకు బొగ్గవుతుందీ? ఇప్పుడు మళ్లీ ఖాళీ! మొహం డోక్కుపోయింది. ఆసుపత్రిలో హక్కుల్ని గురించి మహా తలతిరుగుడుగా ప్రసంగించేవాడు. ప్రతిదానికీ అద్వయితంగా 'లా పాయింట్లు' తీసేవాడు. లేనిపోని జట్టీలు కొని తెచ్చుకునేవాడు. పట్టి ఇగపట్ల గోత్రమని నలుగురూ నిందించేవాళ్లు. ఎంతమంది పడి వుండడంలేదూ? తను మహా పొడిచేసినట్లు 'రింగ్ లీడర్'లా 'పోజు' పెట్టి పోరు చేసుకునేవాడు. ఇప్పుడు పులుసు వచ్చింది! మూన్నాళ్ల పట్టపగలు! అన్న మదమణిగితే సరి అన్ని మదాలూ అణగారతాయి. "త్రాహి త్రాహి" అంటున్నా డిప్పుడు. "ఇద్దరి నసీబూ ఒక్కలానే వుందిలే" అన్నాడు మహంకాళి. వాడి దారిన వాడు చక్కాబోయాడు.

కూరలబజారులో తట్టవేదామా అనుకున్నాడు. దానికీ ఒక తట్ట కావాలి అని స్ఫురించింది. చిన్న కర్ర వంతెన పక్కని మేదర గుడిసెలో తట్ట ఎంతా అని బేరంచేశాడు. రూపాయి చెప్పారు. జేబూ తడిమి చూచుకున్నాడు. ముప్పయి నయాపైసలున్నాయి. ముంత కింద శనగపప్పింత తిని, మంచం మిఠాయి కాస్త నమిలి, కొళాయి నీళ్ళు పూటుగా పట్టించేసి పొయ్యంత్రం దాకా కాలుగాలిన పిల్లిలా అటూయిటూ బలాదూరు తిరిగాడు.

అనుకోకుండా అన్నదానసత్రం కేసి దారి తీశాడు. సత్రం తలుపులు మూసి వున్నాయి. గాడ్రేజ్ తాళం కప్ప రాతిగుండె పటుగా గట్టిగా కరుచుకొని వుంది గొళ్లానికి. అట్టు మూలగా అరుగు మీద ఎవడో పడుకున్నాడు. రాజిగాడు! వాడూ అక్కడికే తయారయ్యాడు? అరుగుచివ్వర తలగుడ్డ పరుచుకుని పడుకున్నాడు మహంకాళీ. ఆసుపత్రిలో భలే మజాగా

కాలక్షేపమయిందనుకున్నాడు. అక్కడి సౌఖ్యమూ సదుపాయమూ నెమరుకొచ్చి దిగులేసింది. పెళ్ళివాటి ముచ్చట లంఖణాలవాడు తల్చుకుంటే ఏమికాను అనిపించింది. ఇక ఆ వేళకి దుప్పి భోజనమే అనుకున్నాడు. ఒక్కరెండు రోజులు ఎవరేనా ఆదుకుంటే పని దొరక్కపోదు. కాని ఈ రెండురోజులూ ఇట్లా తిండిలేక దిగనాసిల్లిపోతే ఆ తరవాత పని దొరికినా ఏమి చెయ్యగలడు?.. ఆకలెక్కువై నీరస మొచ్చింది. నీరసమ్మీద నిద్ర ముంచుకొచ్చింది. ఆవలింతలొచ్చి అమట్ను చిటికెలు వేసుకొంటో అట్లాగే వొరిగాడు.

రెండు ఝాముల వేళ ఎవరో తట్టినట్టయి ఉలిక్కిపడి లేచాడు. రంగయ్య హేడ్డు— చెట్టంత మనిషి ఎట్ట ఎదట దేవుడల్లే అగుపించాడు. పిచ్చు గుంట మీద భాగీరథి ప్రవహించినట్టయి మొహమింత జేసుకున్నాడు మహంకాళి.

* * *

సబిన్స్పెక్టరు మోహనరావు 'సైకిల్ ఫ్రేము' కానుకొని వూలుస్వెట్టరు మీద తుప్పర్లు దులువుకొంటో పరకాయించి చూచాడు: ఈ పెద్ద హేడ్డు ఆదేపొకగాపోయి ఆ నిద్రలేచిన అసామీతో ఒక్కటూ కీన ఇష్టాగోష్టిలో పడ్డాడేమా అని మొహం చిట్లించుకున్నాడు. కాస్సేపటికి రంగయ్య హేడ్డు మహంకాళీ 'యస్సయి' దగ్గరకి వచ్చారు. "వీడేసార్ మహంకాళీ" అని 'యస్సయి'కి తెలియజెబుతున్నాడు రంగయ్య హేడ్డు. మహంకాళీని గురించి అంతకు క్రితం ఏదో ఇష్టాగోష్టిలో చాలావరకు చెప్పేవున్నాడు హేడ్డు. అమట్ను, "వాడా వీడు? సరిపోయింది. అతగాడితో ఏక మాటలు పెట్టుకుని కూచుంటే, 109 కింద ఏదో కేసు ఒకటయినా దొరికిందిగావును అని మురుస్తున్నాను నేనూ" అని మొహం ముడిచాడు 'యస్సయి'. "దానికేమండీ? కేసు పెట్టేద్దాం సార్" అని తల వూపేస్తున్నాడు రంగయ్య హేడ్డు. సబిన్స్పెక్టరుకి అర్థంకాలేదు. 109 కింద అనుమానించదగిన పరిస్థితులలో ఎవడేనా దొరుకుతాడా అని గస్తీ తిరుగుతుంటే తనకి ఆసుపత్రిలో అరవచాకిరీ చేసిన ఒక బక్క వాణ్ణి పట్టుకుని వాడిమీద కేసు బనాయిద్దామంటాడేమిటి హేడ్డు? న్యాయమూ అన్యాయమూ అక్కర్లే? అంతదారుణమా? రంగయ్య హేడ్డు చాలాదూరం నచ్చజెప్పాడు 'యస్సయి'కి.. "వాడే పెట్టమంటున్నాడండి తనమీద జామీను కేసు—ఏదో కనికరించండి పాపం" అని అతిసులభంగా నవ్వుతో సిఫార్సు చేస్తున్నాడు పై పెచ్చు. "అరె కనికరించక వాణ్ణి పట్టుకున్నావూ ఇప్పుడు? వాడు చేసిన నేరమేమున్నదనీ?" అదిరిపడ్డాడు 'యస్సయి'.

"కాదండి సార్—పొట్ట చేతో బట్టుకుని రికామీగా తిరుగుతున్నాడండి పాపం, ఆసుపత్రినించీ తోలేశార్టండి. గతిలేనమ్మకి గంజే పానకమని, ఏదో 109 కింద ఆరునెలలు వేస్తే హాయిగా సెంట్రలు జెయిలులో మీ పేరు జెప్పుకుని కాలక్షేపంచేస్తాడండి. అదండి వాడి ఘోష!"

'యస్సయి' నివ్వెరపోయాడు. ఇప్పు డవగాహనయింది.

"ఏమిటీ? జైలులో పెట్టమంటాడా?" అని మహంకాళీ వంక తిరిగి

"ఏమి బాముకుంటావురా అక్కడ?" అని నమ్మశక్యంగాక జాలిగా చూశాడు వాడివంక.

"అక్కడ అన్నం దొరుకుద్ది దొర" అని సారాంశం బైటపెట్టాడు మహంకాళీ.

"అన్నమా? స్వశర్థం! గుర్రాలు తినే తిండి పెడతారురా అక్కడ" అని బెదురుపెట్టాడు 'యస్సయి'.

"గుర్రంపాటి పెడితే మరి కావాల్సిందేటి దొరా? గుర్రాలు బలంగా లేవేట్టా? మితాయి ఎంత పంకలగా వున్నా తియ్యగానే వుంటది మారాజా— మెల్లిగా తింటే ముళ్ళయినా అరుగుతాయి గదండీ" అని కామవరపు జీడిలా పట్టుకున్నాడు మహంకాళీ.

ఇదో విషమ సమస్య వచ్చి పడిందే అని మథనగా వుంది 'యస్సయి'కి.

"అదికాదు.—రంగయ్యా— ఇతగాడికి కావాల్సింటే మరోవిధంగా అన్నం పెడదామంటాను వట్టి వేధకుడల్లే వున్నాడు—మన స్టేషన్లో ఉదయమూ సాయంత్రమూ ఊడవమను- డబ్బులిద్దాం సరిపోలే?'

"ఆ పనికి మన సూరిగాణ్ణి పెట్టుకున్నాం గదండీ. వీణ్ణి తెచ్చి నెత్తిన పెట్టుకుంటే వాడు గోల కెత్తడూ మధ్య?"

"కామందులు కనికరించకపోతే రెండురోజులు అలా అరుగు మీదనే పండుకుని ప్రాణం వదిలెయ్యగలను దొరా" ఇహా ఇట్లా కాదని బెదిరింపులికి దిగాడు మహాశాలి.

"ఓరి నీ దుంపతెగా. అంతపని చెయ్యవాక. అది ఆకలిచావు కింద వస్తుంది కూడాను. మా పీకల మీదకి తీసుకురాగలవు." జిల్లాకలెక్టర్ల దాకా గంగ వెర్రులెత్తిపోయేరు! ధాన్యలక్ష్మి ఓలలాడిపోయే దేశంలో నీరసించి నీరసించి కడాపటు అధమపక్షం నీ ధనుర్వాతమైనా వచ్చి చావాలిగాని అన్నంలేక కన్ను మూసేందుకు వీల్లా?

"పోనీ ఏమోయ్ రంగయ్యా, పాపం, సత్ర గుమాస్తాతో చెబుదామోయ్ ఈ పెద్దణ్ణి కాస్త కనిపెట్టమని... మనమాట తీసేస్తాడా?"

"గుమాస్తా అయినా రెండురోజులు! దాన్ని మించి చీటీ ఇవ్వడు, ఇవ్వగూడదు కదండీ."

"పాపం, ఏ నేరమూ చెయ్యకుండా వీణ్ణి ఖైదు చేయిద్దామా?

"పాపమాండి? హయ్యో రామ! పుణ్యం సార్ పుణ్యం! ఆరునెలల అన్నదానం!!"

ఈ హెడ్డు కాలికివేస్తే వేలికీ, వేలికి వేస్తే కాలికీ వేస్తున్నాడు. అంతా తలక్రిందు వ్యవహారంగా వున్నదే అనిపించి కొత్త సబ్‌ఇన్‌స్పెక్టరు అంతరాత్మ కాస్తపు గిలగిల కొట్టుకుంది.

"సరే ఉపకారం చేద్దామే అనుకో..రంగయ్యా, మరి.. ఇది జామీను కేసు కింద వస్తుందా అసీ?" వాపోయాడు యస్సయి.

'సరిపోయింది! ఈ ధర్మసందేహ మొకటి మిగిలిందిగావును!' రంగయ్యహెడ్డుకి తలప్రాణం తోకకి వస్తోంది.

"లాకేమి చేస్తుంది సార్.. చూడండి..ఈ గాడిద ఆ అరుగు మీద పండుకున్నాడండి.. ఆ గోడని, చిత్తగించారో లేదో, రెండు మేకులున్నాయండి. అవి మెల్లిగా ఊడదీసి జేబులో వేసుకుని ఏ తాళం కప్ప విడదీదామని వీడి ఎత్తండి. లేకపోతే..దాన్దుంపతెగా. ఇన్ని పంచలుండగా మేకులున్న గోడవారనే పడుకుందికి జాగా దొరికిందా వీడికి? చెప్పండి.. సందేహం లేదండి.. తమతో వీడి, చరిత్ర ఇదివరకే మనవి చేశానుగదండీ, మొదట్లో అడుక్కున్నాడు—ముష్టి పడలేదు, రాయిలా వున్నాడాయిరి.. రెన్నాళ్లు రోజు కూలీ చేశాడు. తరువాత కూలీ పంకలేదు. తదుపరి ఆసుపత్రిలో రోగం నటించి సత్రం భోజనం మఠం నిద్రా సాగించాడు. అక్కణ్ణించీ ఉద్వాసన చెప్పారు. ఇహా నిక్కడ పడుకుని ఆలోచిస్తున్నాడండి.. ఏమనీ?..."

"వాడి ఊహాలోకి దూరినట్టు చెబుతున్నావే మరీనూ?" 'యస్సయి' పకపక నవ్వాడు.

"అద్దంలో నీడల్లే అగుపిస్తుంటే కల్పించే దేముంది సార్?"

"మరి ఏమని ఆలోచిస్తున్నా డంటావు?" ఉబుసుపోకకని ప్రశ్నించాడు, యస్సయి కొంటెగా మొహంపెట్టి:

"చెప్పమంటారా? ఎక్కడ కన్నం వేదామా అనండి.. ఇక సెక్షన్ 109 నప్పకపోవడ మేమిటండి ఖర్మ?" అని రంగయ్యహెడ్డు కంఠస్వరం తగ్గించి 'యస్సయి' చెవిలో నోరుపెట్టి—

"ఆ మాటకొస్తే నిర్భాగ్య దామోదరుడు వీడొక్కడేమిటి సార్— అదిగో ఆ లైను లైను ఆ పేవుమెంటు మీద పండుకున్న అలగా జనమంతా ఇదే బాపతండి... వీళ్లందరికీ కడుపే కైలాసం, నమ్మండి.. పగలు అచ్చుబోసిన అంబోతులల్లే వీధులంట తిరిగి ముష్టెత్తా, రాత్రిళ్లు ఎక్కడో నడుంవాల్చినట్టు నటించా— వీళ్లంతా ఇవాళ కాకపోతే రేపనుక్కోండి—అంతా ఒక్కసారి బిళ్లపెట్టుగా కాకపోతే ఒకడి తరవాత ఒకడూ అనండి—కన్నాలకీ, దొంగతనాలకీ దిగకతీరదండి. వీళ్లు పడుకుని నిద్రపోతున్నారంటారా? అబ్బే—కలగంటున్నారండి— ఏమనీ?—ఎక్కడ కన్నం వేదామా— ఏ గొళ్లెం వొదులుగావుందా—ఏ తలుపు వల్లద్దామా—ఎక్కడ డబ్బు మూలుగుతోందా—ఏమి చేజిక్కించుకుందామా— అని ఒక్కటే రంధి! వీళ్లందరికీ 109 టక్కున అతికిపోతుందండి......ఇంకొ రెండు కేసులు వ్రట్టమ్మంటారా సార్.....ఎప్పుడూ అభ్యంతరం చెప్పడండి— అది రూఫే....చచ్చేవాడికి సముద్రం మోకాలిబంటి కదండీ....." పూదరగొట్టేస్తున్నాడు రంగయ్య హెడ్డు.

"మరి ఆ 'వన్ టవున్ యున్సాయి' చంద్రశేఖరం 109 కింద అన్యాయంగా కేసులు పెట్టేస్తున్నాడని ఆడిపోసుకున్నాం గదుటోయ్ విన్నంతా?"

"అబ్బె—అది వేరండి.....ఆయన 'జైలు' నించీ విడుదలయి వచ్చిన పాత కేడీని బ్రతకనివ్వడండి—అర్ధరాత్రి ఇళ్ళసంచలని తిరుగుతున్నాడని ఏదోవంకని 109 కింద రిపోర్టు తగిలించి కటకటాలవెనక్కి మళ్ళీ నెట్టేదాకా నిద్రపోతే నాండి మహారాజు. అబద్ధాల పంచాంగానికి అరవై ఘడియల త్యాజ్యమని కన్నపుకర్రూ, అగ్గిపెట్టె వాడి జేబులోకన్న ముందు రిపోర్టులో ఇరికించేస్తాడండి ఆయన పగద్బందీగా."

"అదేవిటోయ్! 109 కిందకి వచ్చేవాళ్ళని చాతనైతే వేరే పట్టుకోవాలిగాని, అడివిపంది చేను మేసిపోతే, వూరపంది చెవులు కొయ్యావా? పాపం వాళ్ళు 'జయిలు'నించీ విడుదలయివచ్చి ఏదో ఒక జీవనోపాధి చూసుకోవాల్నా? సందివ్వకుండా అట్లా వరాసగా జైళ్ళకి పట్టిస్తుంటే వాళ్ళ కింక తరుణోపాయ మేవుంటుంది?"

"వాళ్ళ శ్రద్ధం! ఒకసారి దొంగతనం చేసి జైలుకి వెళ్ళినతరవాత వాళ్ళని పనిలో కెవడు పిలుస్తాడుసార్?— రెన్నాళ్ళు చూచి చెయి ఝాడించడూ? పువహో వాడు ఘుగ్గులోకి దిగక క్రితమే మళ్ళీ కటకటాల వెనక్కి నెడితే సరి పాయె!,.. ఒక్కొక్కడు సార్—గుండెలు తీసిన బంటు నమ్మండి—తమ కింకా కొత్తగానండీ... వెనక అనంతపురి లో నేను 'యున్సాయి'గా కొన్నాళ్ళ 'యాక్టింగ్' వెలిగించాలెండి. అప్పుడు సత్తులనీ ఒక్క పచ్చి కేడీ వుండేవాడండి. వాడి చేవాటతనానికి తట్టుకోలేక, ఇట్లాకాదని, రేత్రిళ్ళు 'పోలిస్ స్టేషను'లోనే పండుకొమ్మన్నానండి. ఖానపడిగారూ, స్టేషనికి రాత్రి వస్తానే ఒక్క పిసరు దొంగతనమూ, చెంబో చాంతాడో, స్టేషన్నించీ తెల్లారగట్ట పెంపు తీసుకొని వెడుతూనే ఒక చిన్న హస్తలాఘవమూ—చేసి మరీ చూపించేవాడు నమ్మండి—దొంగతనం జరిగినట్టు 'పోలీసు స్టేషన్లో' రిపోర్టు అందీ అందగానేన్నండి...ఆరా తీసుకుంటే వాడు 'స్టేషన్' ఆవరణలో గుర్రుపెట్టి నిద్రపోతో నేనా అనుపించేవాడు—లేదా—వాడి ఇంటి అరుగు మీద పెద్దన్న తాపీగా వేపపుల్ల నోట్టో పెట్టుకుని ముఖమార్జన చేసుకొంటూ నేనా అగుపించేవాడు—సరిసరి—చంద్రంగారికీ మనకీ సాపత్యమాండి? ఆయన 109 కింద కేసు దాఖలుచేస్తే గోలగోల కదండీ ముద్దాయిలు! శాపనార్ధాలు పెడుతో కోర్టుకి హాజరయ్యేవాళ్ళండి పాతకేడీలు. మనం కేసుపెడితే అదోవరంకింద మహా ప్రసాదమని స్వీకరించాలిసిందేనాయిరి...సంకోచం దేనికి చెప్పండి? మహంకాళి—అన్నారూ. మంచివాడండి పాపం... అధమూ శుభమూ తెలియనివాడు—వీహా పేరు చెప్పకుంటాడు—మనకా, 109 కింద కేసులూ అమరుతాయి...పుణ్యమూ పురుషార్ధమూ కలిసొస్తుందండి"

"ఏరా... జైలంటే బందిఖానాకాదుట్రా? అక్కడేమి సుఖంరా?" యున్సాయి రెట్టించాడు మహంకాళీని. ఆయన గొంతులో అమాయికత్వం తొణికిసలాడింది.

వాడికిదంతా అర్థంకాక బేలగా చూస్తున్నాడు. జైలులో తిండి దొరుకుతుంది! అంతే వాడికి తెలుసు. హెడ్డుగారి తతివ్యామ వాదనంతా అగమ్యగోచరంగావుంది.

'యున్సాయి' నీళ్ళుగారుతున్నట్టు గ్రహించి రంగయ్యహెడ్డే మళ్ళీ అందుకున్నాడు.

"అట్లా అనకండిసార్— రాజాలా గడిచిపోతుందండీ సెంట్రల్ జైలులో — గుడ్డివాడికన్నా ఏకాక్షి నయంకదండీ......ఇంటో దరిద్రంకన్నా అడివిలో అయిశ్వర్యం మేలని, అక్కడవున్నారూ, వేళకింత తిండి పడేస్తారు. చెయ్యగలిగి నంతచేయించుకుంటారు; రేపెట్లా గడుస్తుందా అన్న బెంగ లేదు. ఖైదీలకి నంబర్లుంటాయి ఏమనుకున్నారోను—ఫలానా ఖయిదీ ఎక్కడున్నాడు—ఏమి చేస్తున్నాడు.....ఎట్లావున్నాడు అన్న అటా పాటా వుండే చోటు, మనిషన్నవాడు ఒక శాల్తీకింద లెక్కకొచ్చేచోటు అదేకదండీ! జైలన్న జైలాండీ అది? కాలునొప్పినా, కడుపునొప్పినా నిక్షేపంగా జయిలాసుపత్రి ఉండనేవుంది! అంతేనా వాళ్ళవల్ల కాకపోతే అటొక జవానూ ఇటొక జవానూ పహారాకాస్తే పెద్దాసుపత్రికి తీసికెళ్ళి ఇంజక్షను పొడిపించి మరీ

తీసుకొస్తారు. 'జైలువాన్'మీద. ఇక్కడేవుంది సార్! ఫస్తే దిక్కా మొక్కా? కుళ్లి కంపుకొట్టే దాకా ఏ మ్యునిసిపాలిటీ వెట్టివాడేనా దయతలిస్తే ఏమోగాని ఈడిచి పారేశేవాడు కనపడ్డు. అక్కడన్నారూ ఖైదీ ప్రాణం పోయిందీ 'జైలువార్డరు' లగాయతూ జైలు సూపరెంటు వరకూ సంజాయిషీ లొస్తాయండి మరి. ఎందుకు చచ్చాడు? ఏంచేశారు? అందాకా ఎందుకు రానిచ్చారు? లక్ష ప్రశ్నలు, యక్ష ప్రశ్నలు! ఇక్కడికిమళ్ళీ ఏరోజు కారోజు అనుక్షణమూ అలో లక్ష్మణా, అన్నమో రామచంద్రా అంటో ముష్టికో పనికో దేవిరిస్తు ఆకలి భుజాన వేసుకుని ఇళ్లిల్లాళ్లే తిరిగీ, వీధి వీధి గాలించ పక్కర్లేదుగదండీ? అసలు అట్టడుగు మనిషికి లాయికీ అయిన అసలయిన రామరాజ్యం అక్కడుంది కదండీ? చేతినిండా పనీ, కంటినిండా నిద్రా, కడుపు కింత పిండాకూడూ, వొంటినింత గుడ్డా, ఉండేందు కొక గూడూ, అడుగు పెట్టగానే అమర్చిపెట్టినట్టు అందివచ్చే భూలోకస్వర్గమాయెను. ఇక్కడ సరేసరి, అడిగారూ, ముష్టి వెయ్యలేదని గృహస్తుని తిట్టూ, కూలీ చాలడంలేదని యజమానిని దుయ్యబట్టూ, అట్లాగని నలుగుర్నీ పోగేసుకుని ఒక్కపెట్టున సమ్మెలు చెయ్యా, పోనీ తెమ్మని జీతాలు హెచ్చిస్తే ధరలు పెరిగి పోతున్నాయో అని గోలపెడుతో అట్టముక్కలు పట్టుకుని వీధులమ్మట వూరేగా, తె ల్లంగడిలో దొరకని వాటికి న ల్లంగడి కెగబాకా, మళ్లీ న ల్లంగళ్లు పెరిగిపోతున్నాయి మహాప్రభో అని పక్క పక్కనే అరిచి అల్లరి చెయ్యా—ఈ విషచక్రమంతా తిరక్కుండా విరిచిపారేయ్యదక్కర్లేకదండీ?— పెట్టే దామండి 109 కింద కేసు'' అన్నాడు రంగయ్య హేడ్డు తల ఎగరేస్తూ.

''ఓయి నీ యిల్లు బంగారంగాను— హైరాత్తించేస్తున్నావురోయ్. ఇంతకీ 109 నప్పుతుందంటావు?......గెడ్డం తడుముకున్నాడు 'యశస్వియ' మోహనరావు.

''బేషుగ్గానండి''

పాచిక పారిందని గ్రహించాడు మహంకాళీ. ఆమట్న హేడ్డుగారి చెవిలో ''మరింకేం, మా రాజిగాణ్ణి కూడా లాక్కురమ్మంటారా బాబయ్యా?'' అని వూదాడు సన్నగా.

''ఓరి నీ దుంపతెగా—వీ తలదగారే కన్నం లేదు తలకొక డోలా? పదపద—నీ ఠొట్ట నేతిలో పడిందిలే...వెధవన్నా'' అని స్టేషన్‌వేపుకి దారితీస్తూ'' ''పక్క వోట్లో మట్టిగట్టావుగదరా'' అని చేతులికి బేడీలు వేశాడు రంగయ్య హేడ్డు.

ఆ మూాల నిమ్మకి నీరెత్తినట్టు కుంభకర్ణ నిద్రపోతున్న రాజిగాడివంక జాలిగా చూస్తో బ్రతుకు జీవుడా అని అడుగులో అడుగేశాడు మహంకాళీ.

"మరి ఆ 'వన్ టువున్ యువ్వయి' చంద్రశేఖరం 109 కింద అన్యాయంగా కేసులు పెట్టిస్తున్నాడని ఆడిపోసుకున్నాం గదుటోయ్ నిన్నంతా?"

"అబ్బె—అది వేరండి.....ఆయన 'జైలు' నించీ విడుదలయి వచ్చిన పాత కేడీని బైట బ్రతకనివ్వడండి—అర్ధరాత్రి ఇళ్ళపంచలని తిరుగుతున్నాడని ఏదోవంకని 109 కింద రిపోర్టు తగిలించి కటకటాలవెనక్కి మళ్ళీ నెట్టేదాకా నిద్రపోలేవాండి మహారాజు. అబద్ధాల పంచాంగానికి అరవై ఘడియల త్యాజ్యమని కన్నుకుట్రగా, అగ్గిపెట్టె వాడి జేబులోకన్న ముందు రిపోర్టులో ఇరికించేస్తాడండి ఆయన పగడ్బందీగా."

"అదేమిటోయ్! 109 కిందకి వచ్చేవాళ్ళని చాలనైతే వేరే పట్టుకోవాలిగాని, అడివిపంది చేను మేసిపోతే, ఊరపంది చెవులు కోయ్యనా? పాపం వాళ్ళు 'జయిలు'నించీ విడుదలయివచ్చి ఏదో ఒక జీవనోపాధి చూసుకోవాల్నా? సందివ్వకుండా అట్లా వరాసగా జైళ్ళకి పట్టిస్తుంటే వాళ్ళ కింక తరుణోపాయ మేముంటుంది?"

"వాళ్ళ శ్రాద్ధం! ఒకసారి దొంగతనం చేసి జైలుకి వెళ్ళినతరవాత వాళ్ళని పనిలో కెవడు పిలుస్తాడుసార్?— రెన్నాళ్ళు చూచి చెయి ఝాడించడూ? పునహా వాడు ఘుగ్గులోకి దిగకత్రితమే మళ్ళీ కటకటాల వెనక్కి నెడితే సరి పాయె!... ఒక్కొక్కడు సార్—గుండెలు తీసిన బంటు నమ్మండి—తమ కింకా కొత్తగానండీ... వెనక అనంతవరిలో నేను 'యువ్వయి'గా కొన్నాళ్ళ 'ఆక్టింగ్' వెలిగించాలెండి. అప్పుడు పత్తులనీ ఒక పచ్చి కేడీ వుండేవాడండి. వాడి చేవాటితనానికి తట్టుకోలేక, ఇట్లాకాదని, రేత్రిళ్ళ 'పోలీస్ స్టేషను'లోనే పండుకొమ్మన్నానండి. ఖానడిగారరా, స్టేషనికి రాత్రి వస్తానే ఒక్క పిసరు దొంగతనమయా, చెంబో చాంతాడో, స్టేషన్నించి తెల్లారగట్ట సెలవు తీసుకొని వెడుతూనే ఒక చిన్న హస్తలాఘవమూ—చేసి మరీ చూపించేవాడు నమ్మండి—దొంగతనం జరిగినట్టు 'పోలీసు స్టేషన్లో' రిపోర్టు అందీ అందగానేవ్వండి...ఆరా తీసుకుంటే వాడు 'స్టేషన్' ఆవరణలో గుర్రుపెట్టి నిద్రపోతోనేవా అనుపించేవాడు—లేదూ—వాడి ఇంటి అరుగు మీద పడున్న తాపీగా వేపపుల్ల నోట్లో పెట్టుకుని ముఖమార్జన చేసుకొంటోనేవా అగుపించేవాడు—సరిసరి-చంద్రంగారికీ మనకీ సాపత్యమేమండి? ఆయన 109 కింద కేసు దాఖలుచేస్తే గోలగోల కదండీ ముద్దాయిలు! శాపనార్ధాలు పెడుతూ కోర్టుకి హాజరయ్యేవాళ్ళండి పాతకేడీలు. ఏ నం కేసుపెడితే అదో వరంకింద మహా ప్రసాదమని స్వీకరించాలిసిందేనాయెరి...సంకోచం దేనికి చెప్పండి? మహంకాళి—అన్నారయా. మంచివాడండి పాపం... అభమూ శుభమూ తెలియనివాడు—వీరా పేరు చెప్పుకుంటాడు—మనకా, 109 కింద కేసులూ అమరుతాయి...పుణ్యమూ పురుషార్ధమూ కలిసొస్తుందండి"

"ఏరా... జైలంటే బందిఖానాకాదుట్రా? అక్కడేమి సుఖంరా?" యువ్వయి రెట్టించాడు మహంకాళీని. ఆయన గొంతులో అమాయికత్వం తొణికిసలాడింది.

వాడికిదంతా అర్థంకాక బేలగా చూస్తున్నాడు. జైలులో తిండి దొరుకుతుంది! అంతే వాడికి తెలుసు. హెడ్డుగారి తలివ్యాఖ్య వాదనంతా అగమ్యగోచరంగావుంది.

'యువ్వయి' నీళ్ళుగారుతున్నట్టు గ్రహించి రంగయ్యహెడ్డే మళ్ళీ అందుకున్నాడు.

"అట్లా అనకండిసార్— రాజాలా గడిచిపోతుందండీ సెంట్రల్ జైలులో — గుడ్డివాడికన్నా ఏకాక్షి నయంకదండీ.....ఇంటో దరిద్రంకన్నా అడివిలో అయిశ్వర్యం మేలని, అక్కడన్నారయా, వేళకింత తిండి పడేస్తారు. చెయ్యగలిగి నంతచేయించుకుంటారు; రోజెట్లా గడుస్తుందా అన్న బెంగ లేదు. కైదీలకి నంబర్లుంటాయి ఏమనుకున్నారోను—ఫలానా ఖయిదీ ఎక్కడున్నాడు—ఏమి చేస్తున్నాడు.....ఎట్లావున్నాడు అన్న ఆఁనా పాఁనా వుండే చోటు, మనిషన్నవాడు ఒక శాల్తీకింద లెక్కకొచ్చేచోటు అదేకదండీ! జైలన్న జైలాండి అది? కాయినొప్పినా, కడుపునొప్పినా నిక్షేపంగా జయిలోనుపత్రి ఉండనేవుంది! అంతేనా వాళ్ళవల్ల కాకపోతే అటొక జవానూ ఇటొక జవానూ పహారాస్తో పెదా సుపత్రికి తీసికెళ్ళి ఇంజక్షను పొడిపించి మరీ

తీసుకొస్తారు. 'జైలువాన్'మీద. ఇక్కడేవుంది సార్! ఛస్తే దిక్కా మొక్కా? కుళ్లి కంపుకొట్టే దాకా ఏ మ్యునిసిపాలిటీ వెట్టివాడేవా దయతలిస్తే ఏమోగాని ఈడిచి పారేశేవాడు కనపడ్డు. అక్కడన్నారూ ఖైదీ ప్రాణం పోయిందీ 'జైలవార్డరు' లగాయితూ జైలు సూపరెంటు వరకూ సంజాయిషీ లొస్తాయండి మరి. ఎందుకు చచ్చాడు? ఏంచేశారు? అందాకా ఎందుకు రావిచ్చారు? లక్ష ప్రశ్నలు, యక్ష ప్రశ్నలు! ఇక్కడికివుంల్లే ఏరోజు కారోజు అనుక్షణమూ అలో లక్ష్మణా, అన్నమో రామచంద్రా అంటో ముష్టికో పనికో దేవిరిస్తో ఆకలి భుజాన వేసుకుని ఇల్లిల్లాన్ని తిరిగీ, వీధి వీధి గాలించ పక్కర్లేదుగదండీ? అసలు అట్టడుగు మనిషికి లాయిక్కీ అయిన అసలయిన రామరాజ్యం అక్కడుంది కదండీ? చేతినిండా పనీ, కంటినిండా నిద్రా, కడుపు కింత పిండాకూడూ, వొంటినింత గుడ్డా, ఉండేందు కొక గూడూ, అడుగు పెట్టగానే అమర్చిపెట్టినట్టు అందివచ్చే భూలోకస్వర్గమాయెను. ఇక్కడ సరేసరి, అడిగారూ, ముష్టి వెయ్యలేదని గృహస్తుని తిట్టా, కూలీ చాలడంలేదని యజమానిని దుయ్యబట్టా, అట్లాగని నలుగుర్నీ పోగేసుకుని ఒక్కపెట్టున సమ్మెలు చెయ్యా, పోనీ రెమ్మని జీతాలు హెచ్చిస్తే ధరలు పెరిగి పోతు న్నాయెొా అని గోలపెడుతో అట్టముక్కలు పట్టుకుని వీధులమ్మట వూరేగా, తెల్లంగడిలో దొరకని

వాటికి నల్లంగడి కెగబాకా, మళ్లీ నల్లంగళ్ల పెరిగిపోతున్నాయి మహాప్రభో అని పక్క పక్కనే అరిచి అల్లరి చెయ్యా—ఈ విషచక్రమంతా తిరక్కుండా నిలిచిపోయ్యేదక్కగ్నేకదండీ?— పెట్టె దామండి 109 కింద కేసు'' అన్నాడు రంగయ్య హేడ్డు తల ఎగరేస్తూ.

''ఓయి నీ యిల్లు బంగారంగాను— హారతి త్తించేస్తున్నావురోయ్. ఇంతకీ 109 నువ్వుతుం దంటావు?......గెడ్డం తడుముకున్నాడు 'యశస్వియి' మోహనరావు.

''బేషుగ్గానండి''

పాచిక పారిందని గ్రహించాడు మహంకాళీ. అమట్న హేడ్డుగారి చెవిలో ''మరిగంటే, మా రాజి గాణ్ణి కూడా లొక్కురమ్మంటారా బాబయ్యా?'' అని వూదాడు సన్నగా.

''ఓరి నీ దుంపతెగా—నీ తలదగారే కన్నం లేదు తలకొక డోలా? పదపద—నీ రొట్టె నేతిలో పడిందిలే...వెధవన్నా'' అని స్టేషన్ వేపుకి దారితీస్తూ'' ''నక్క వోట్లో మట్టిగొట్టావుగదరా'' అని చేతులికి బేడీలు వేశాడు రంగయ్య హేడ్డు.

ఆ మహాల నిమ్మకి నీరెత్తినట్టు కుంభకర్ణ నిద్రపోతున్న రాజిగాడివంక జాలిగా చూస్తో బ్రతుకు జీవుడా అని అడుగులో అడుగేశాడు మహంకాళి.

సాహిత్యం అపరిమేయమా?

ఆర్యా,

అక్టోబరు భారతిలో ప్రకటితమైన నా లేఖ నూలగా గాని చాలా ఆవేశంతోనూ ఉద్రేకంతోనూ నవంబరు భారతిలో ఒకమాట వ్రాశారు.

"సాహిత్యం అన్నది పరిమితమైన విషయం కాదు. అది అపరిమేయమైంది. అట్లా అయినప్పుడు ప్రతిదీ సాహిత్యానికి విషయమే అవుతున్నది. సాహిత్య మాసపత్రిక అన్న ఉపశీర్షిక అనవసరం అవుతున్నది" అని వ్రాశారు.

సాహిత్యానికి మీ చెప్పిన అర్థంవల్ల ప్రతి విషయమూ సాహిత్యమే అవుతున్నది అలా అయినప్పుడు "సాహిత్య మాసపత్రిక" అనే ఉపశీర్షికను తీసివేయవలసిన అవసరం ఏమిటి? ఆ శీర్షికను ఉంచినా, ఈ అర్థంతో సమర్థించుకోవచ్చును గదా?

సాహిత్యం అపరిమేయం అని వ్రాశారు. రసం కలిగి హితమైనది సాహిత్యమవుతుందిగాని ప్రతిదీ సాహిత్యమెలా కాగలదు? ఐతే రకరకాల టెక్నాలజీలు, అపరాలతకాలు, విస్తారకులు కుట్టడాలు అన్నీ సాహిత్యమే అనవచ్చునా? సాహితీ అంగాల్లో వీటి ప్రసక్తి రావచ్చును కాని వీటినిగురించి చెప్పేది సాహిత్య మనిపించుకొంటుందా? సాహితీ రత్న, సాహితీభూషణ, సాహితీ శిరోమణి, సాహితీవల్లభ, సాహితీ సమరాంగణ సార్వభౌమ మొదలైన ఈ బిరుదుల కర్థమేమిటి? ఏ రంగాల్లో కృషివల్ల వారికి బిరుదులు లభించినవి?

"రాజకీయాన్నుంచి, సైన్సు నుంచి, తాత్విక ప్రపంచంనుంచి — అనగా జీవిత సమస్తం నుంచి విడివడి సాహిత్యం అంటూ ఉండదు. ఇవీ అన్నీ కలిసినప్పుడే అది సాహిత్యమవుతుంది."

రచనకు సాహితీ అంగాల్లోని పద్యం, వ్యాసం కథ, నవల ఏదైనా— రాజకీయాలు, సైన్సు, శిల్ప శాస్త్రం కొంతవరకు ఉపకరణాలు కావచ్చు కాని వీటిని కూడ సాహిత్యం అని పేర్కొంటే, నేడు సాహిత్యానికి ఉన్న అర్థాన్ని తుడిచివేసి మరొక క్రొత్త అర్థం సృష్టించవల్సిఉంటుంది. మన పూర్వుల నుండీ మనం సాహిత్యాన్ని సారస్వతము అన్న అర్థంలోనే ప్రయోగిస్తున్నాం.

"కొందరి రచయితల పేరుపెట్టి వారిని తేలిక చేస్తున్న ధోరణిలో వ్రాసినా కూడా, పై కారణాన్ని పురస్కరించుకొనే ఆ లేఖను ప్రకటించాము."

నేను ఏ రచయితను గూర్చి చులకన చేశానో వారు స్పష్టంగా చెప్పలేదు. వేలూరి వారి రచనగురించి నా దృష్టి ఏమిటో వివరించానేగాని వారిని గూర్చి తేలిక చేయడం గాని నిందించడంగాని జరగలేదు.

భారతి ధర, పేజీలు పెంచమన్న నా సూచనకు తెల్పిన కృతజ్ఞతలకు ప్రత్యభివాదములు.

"భారతి పట్టి కథలలో నరిపెట్టుకొని వ్యాపారంలో పడిపోతున్నది. విజ్ఞానశాస్త్రం మొదలైన శాస్త్రీయ విషయాలను ఇవ్వడంలేదు—అని వ్రాసిన వారూ వున్నారు. అందుకేమనాలి!"

"మనలో విజిజ్ఞాస ఎంతగా చచ్చిపోయిందో, మనలో జ్ఞానతృష్ణ ఎంతగా రూపరిపోయిందో తెలుస్తూంది."

"మాకు ఇవే ఇవ్వండి, తక్కినవి వద్దు అని ఒక పత్రికకు చెప్పే అధికారం ఎవ్వరికీ లేదు. ఆ ఉన దనుకొనడం ఒక భ్రమ. అదేవిధంగా మీరు ఇవే చదవండి మేము ఇవే ఇస్తాము అనే పత్రికలు వుంటే అది వాటి కర్మ."

ప్రతిపాఠకుడూ తన అభిమాన పత్రికను తీర్చి దిద్దుకోవాలని—తన అభిరుచుల కనుగుణంగా—అనుకొంటాడు. అందుకే ఎడిటర్లకు లేఖలు వస్తాయి.

సాహిత్యం కావాలనే వారూ, విజ్ఞానశాస్త్రం కావాలనే వారూ అన్నివిధాలవారూ ఉంటారు వారిలో. వారి వారి అభిప్రాయాలను సంపాదకుడికి లేఖ ద్వారా వ్యక్తీకరించుకోవడం నేరమేమీ కాదు. ఒకే వ్యక్తికి అన్ని విషయాల మీదా అభిరుచి ఉండదు. అలా ఉండేవారు చాల కొద్దిమంది. అలా తన కభిరుచి లేని విషయాన్ని మినహాయించి తన కిష్టమైన విషయాల్నే వేయమనడం నేరమా? అలా అంటే వారికి విజిజ్ఞాస చచ్చిపోయినట్లా? మాకు ఇవే ఇవ్వండి మిగతావి మాకు వద్దు అని శాసించే అధికారం ఏ పాఠకుడికీ ఉండదు. నా లేఖలో పత్రికను సంస్కరించమని ప్రార్థించా, విజ్ఞాపనను గుర్తించమన్నాను. అధికారయుతంగా శాసించే అధికారం పాఠకుడికేలా వస్తుంది. మిగతా విషయాలు వద్దు అంటే నా కోర్కెలో గల బలాన్ని వ్యక్తం చేయడమేగాని తదితరం కాదు. ఐతే ఆ అధికారమేదో పత్రికాధిపతులకే ఉంటుంది, ఇప్పటి నా ప్రతివిమర్శనను ప్రకటించడానికిక్కడ. పాఠకుల విషయంలో అధికారప్రసక్తి రాదు.

"ఇప్పుట రసము, రసమయ జగత్తుల ప్రస్తావన పూర్తిగా మన అవ్యవస్థను కప్పిపుచ్చుకోడానికి చేసే ప్రయత్నం మాత్రమే. ఇది పట్టి Escapism."

రాజకీయాలూ, విజ్ఞానశాస్త్రమూ మొదలైనవి సాహిత్య ఉపపోషకాలే గనుక ఇవి సాహిత్యమేను అవి తప్పుకుపో చూస్తున్న Escapist ఎవరు?

"శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారి వంటి మహాపండితులు అటువంటి విషయాలను, తమకు తోచినంతలో మనకు బోధపడేట్లు విప్పి చెబుతూ వుంటే ఆనందించలేకపోవడం, ఆ ఆనందించలేని వారి దోషం గాని, అది శాస్త్రిగారి దోషంకాని, వానిని అందజేస్తున్న 'భారతి' దోషంకాని కాదు. ఆ ఆనందించలేకపోవడం మన మనస్సుల యొక్క లోతును తూకాన్ని మాత్రమే చెబుతుంది."

శివరామశాస్త్రిగారు మహాపండితులే అని అందరూ ఒప్పుకొంటారు. కాని ఈ వ్యాసాలను ఆనందించ లేకపోవడం వారి మనస్సుల లోతు తూకమే గాదు తెలుస్తోంది; ఆనందింప కల్గడం కూడ వారి మనస్సు, బుద్ధుల తూకాన్ని తెల్పుతూంది.

సెప్టెంబర్ భారతిలో పురుషోత్తముడు, వ్యాసంలో వేలూరి వారిలా వ్రాశారు: "మన మొక నాటకం చూస్తూ అందలి నాయికా నాయకుల సుఖదుఃఖాలను సంయోగ వియోగాలను వేదనానందాలను అనుభవించినట్లు సంసార నాటకంలోనూ అనుభవిస్తున్నాం కాని ఇవేవీ మనవి కావు. మనకివేవీ అంటవు."

"ఆ పురుషోత్తముడే కురుక్షేత్రంలో భీష్మద్రోణాదులను ఎప్పుడో చంపి ఉంచాడు. అతని ఇచ్ఛచే అతనిదే ఐన ఈ ప్రకృతి ద్వారా లేక శక్తి ద్వారా ఈ జగత్తులో ప్రతిపనీ నియంత్రితమైన నిర్ధారితమై జరిగిపోతూంది." చేయించేదీ, చేసేదీ అంతా వాడే. మనం నిమిత్తమాత్రులమే, శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు, అనే ఈ మిథ్యావాదపు పాచిపళ్ల పాటను ఎంతమంది ఎన్నిరకాలుగా పాడటంలేదు? యోగులూ, ఋషులూ, బ్రహ్మంగారి శిష్యులూ, మాదాకబళం వాళ్లూ, గూటిలో చిలక పాటలూ, కీలుబొమ్మ పాటలూ, జగమంతా మాయ పాటలూ ఎన్నితరాల నుంచో పాడుతూనే ఉన్నారు. ఇందులో శివరామశాస్త్రిగారు క్రొత్తగా చెప్పిందేమిటి?. అందుకే ఈ పాతభావాలు విజిజ్ఞాసను రేకెత్తించలేవనే వారి మనస్సుల లోతూ తెలుస్తూనే ఉంది.

"మరికొందరు ఎప్పుడో, అనాది కాలంలో ఒకానొక అంతరించిపోయిన సమాజం కోసం వ్రాసిన విషయాలను తీసుకొని, అవే చిరంతనములు, సనాతనములు, త్రికాలాబాధ్యములు అయిన సిద్ధాంతాలయినట్లు భావిస్తూ ఒక విధమైన Dogma ను పెంచుకొని, వానిని సాహిత్యంలో ప్రతిఫలింప జేయడానికి నానా అగచాట్లు పడుతున్నారు."

"ఈ లోపం రాజకీయ వ్యాసాలతో, సైన్సు విషయాలతో, వే. శి. శాస్త్రి వ్యాసాల వంటి వ్యాసాలతో పరిష్కారం అవుతుందా అంటారు?..అటువంటి ప్రశ్నకు సమాధానంగానే 'భారతి'లో ఆ వ్యాసాలు వేయడం జరుగుతున్నది."

వేదమేకం శరణం అంటూ, చాతుర్వర్ణ సంఘ వైశిష్ట్యాన్ని చాటిచెప్పే భగవద్గీతలూ మొదలైన వాటి నాధారంగా తీసుకొని వ్రాసే వ్యాసాలూ, మిథ్యావాదాన్ని ప్రతిబింబించే ఈ ధోరణి ఏమిటి? ఏ జీర్ణ సమాజం కోసం వ్రాయబడింది? దాన్నూతగా

గాని వ్రాసే రచనలు మననేటి వైక్లబ్యాన్ని పరిష్కరించగలవనుకొంటే, మనం ఇరవయ్యో శతాబ్దపు ద్వితీయార్థంలో ఉన్నామన్న విషయాన్ని మరచి యుండాలి.

"అటువంటి పత్రికలు ఈ తెలుగుదేశంలో వుంటే పేరుపెట్టి చెప్పవచ్చు. వట్టి మిథ్యాజ్ఞానంతో, Bluff తో పని జరగదు. మాట అంటే, దాని వెనుక పిండి కూడా వుండాలి."

అలాంటి పత్రికలు ఉంటే తక్కువ సంఖ్యలో ఉండవచ్చు. అంతేకాని అసలు లేవనే వారిదే మిథ్యాజ్ఞానమౌతుంది. ఆరాధన, సనాతనసారథి, రామకృష్ణప్రభ మొదలైనవి తాత్విక పత్రికలు కావా? మన వారపత్రికలు, దినపత్రికలు రాజకీయాలను సైన్సును విశేషంగానే అందిస్తున్నాయి. ఇందుకు ఆదివారం ఆంధ్రపత్రికే ఉదాహరణగా తీసుకోవచ్చు. మన దినపత్రికలన్నీ ఆదివారంనాడు ఎంతో కొంత సైన్సు వ్యాసాల్ని ప్రకటిస్తూనే ఉన్నాయి. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ప్రజామత మొదలైన పత్రికలు చేత సైన్సంతవరకూ చేస్తున్నాయి. రాజకీయాలు సరేసరి. దాదాపు అన్ని దినపత్రికలూ సకాలిక వ్యాసాలుగాని, అనువాదాలు గాని ప్రచురిస్తూనే ఉన్నాయి. మరి అభావం ఎక్కడ? మనకు చాలినంత లేకపోవడమా? అందుకిక ప్రత్యేక పత్రికలే పెట్టాలి.

"అయితే అయనకు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అనే భారతదేశంలోని ఒకానొక రాష్ట్రంలో "అల్లూరి వెంకటేశ్వరరావులు" తత్తుల్యులు వున్నారని తెలియదు. తెలిసి వుంటే ఆ మాటలను ఇంకోవిధంగా వ్రాసి వుండేవారు."

Encounter ను గూర్చి నేను తేలిక చేసి చెప్పినదేమైనా ఉంటే ఎత్తి చూపండి. భారతి ఎన్‌కౌంటర్ వాతలు పెట్టుకొంటున్నది అన్నాను. ఇందులో Encounter ను తక్కువ చేసింది లేదే. Ioseph Alsop తన view ని మార్చుకోవలసిన అవసరమూ లేదే! ఒకవేళ అలా మార్చుకుంటే మరి వాకు చాల గొప్ప. ఇంతేగాదు పాపం Alsop కు మిథ్యావాదాన్ని, కర్మసిద్ధాంతాన్ని పట్టుకువేళ్ళాడే "తిరోగమనవాదులు" తత్తుల్యులు ఉన్నారని కూడా తెలియదు గాబోలు. తెలిసినా తన మాటలను మార్చుకోడని నిర్భయంగా చెప్పగలను.

"మన ఆలోచనలు ముందుకు జరగడం లేదు. పుట్టిన చోటనే ఆగిపోతున్నాయి. పెరగడంలేదు. ఈ స్థితి నుంచి బయటపడగలమా? ఈ ప్రశ్న వచ్చే మేము ఇంతటి వేదనను చెందడం జరుగుతున్నది."

హృదయజీవికి మాత్రమే వేదన సంభవం. ఈ పరిస్థితిని సమీక్షించి ఇందులో వారి కసంతృప్తి కల్గించే విషయాల వల్ల వేదన చెందుతున్నారు. ఇందుకు వారికి శత సహస్రాభినందనలు. వేదన చెందనిదే ఏ జీవీ తన చుట్టూ వున్న చీకట్లను పారద్రోలలేడు. వేదన వల్లనే ఏ ఆవిర్భావమైనా. అందుకే వారి వేదన నిరర్థకం కాకూడదు. వేదన చెందినవారే లోకాని కింత వెలుగు నివ్వగలరు.

ఇంతకీ వారి వేదన మన ఆలోచనలు ముందుకు జరగడంలేదని. ఎప్పుడో అనాది కాలంలో ఒకానొక అంతరించిపోయిన సమాజం కోసం వ్రాసిన విషయాలను తీసుకొని, అవే చిరంతనములు, త్రికాలాబాధ్యములు అయిన సిద్ధాంతాలయినట్లు భావిస్తూ మిథ్యావాదపు పాచిపళ్ళ పాటలు పాడే మనకు, మన ఆలోచనలు పుట్టిన చోటే ఆగిపోక వికసించగలవా?

అల్లూరి వెంకటరావు

సమాధానం

సాహిత్యం అన్న విశేషణం తీసివేసి కేవలం మాసపత్రిక అంటే చాలు—అర్థం చేసుకుంటారని, విప్పి చెప్పనక్కరలేదని అనుకున్నాము. ఇలా అర్థం చేసుకోకపోవడం మూలాన శ్రీ వెంకటరావుగారి ఉత్తరం వేసి సమర్థించుకోవలసి వచ్చింది. వచ్చిన ఉత్తరాలలో శ్రీ వెంకటరావుగారి ఉత్తరం కొంచెం ఉదాత్తంగాను,

విస్పష్టంగాను వున్నందువల్ల దానిని ప్రకటించి మా 'మాట' చెప్పుకున్నాము. మా'మాట' వారి ఒక్కరికి మాత్రమే సమాధానం కాదు.

మేము ప్రతిదీ సాహిత్యం అని అనలేదు. సాహిత్యానికి ప్రతిదీ విషయం అవుతుందిఅన్నాము. ఈ విషయాన్ని మేము తగువిధంగా చెప్పి వుండలేకపోతే చెప్పి వుండలేకపోవచ్చు. కాని, మేము చెప్ప ప్రయత్నించింది ఏమిటో శ్రీ వెంకటరావుగారి వంటి ప్రతిభావంతునకు అర్థం అయివుంటుందని మాకు తెలుసు. విస్తళ్లు కుట్టడం, అపరాలు తూయడం మొదలైన వాటిని గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఒకప్పుడు పట్టి లెక్కల మీద, పట్టి రాజకీయాల మీద వ్రాసిన గ్రంథాలకు కూడా, సాహిత్యం పేర నోబుల్ బహుమతులు ఇచ్చిన సందర్భాలు వున్నాయి. Russel ను, Churchill ను ఇందుకు ఉదహరించవచ్చు.

"ఎన్‌కౌంటర్ వాతలు" పెట్టుకోవడం వంటి పదబంధాలు, "వే. శి. శాస్త్రిగారి ఛందస్సు"వంటి మాటలు, అపత్రికను, వే. శి. శాస్త్రి గారిని తేలిక చేయడం కాకపోతే చాలా సంతోషం. ఇంతకీ శ్రీ శాస్త్రి గారు చెబుతున్నది అరవిందుని దర్శనాన్ని గురించి; ఆ విషయం 'మాదాకబళం' పాటలో వున్నదని శ్రీ వెంకటరావుగారు అన్నారు. దురదృష్టవశాత్తు యీ విషయం అరవిందునకు తెలియదు. వే. శి. శాస్త్రి గారికి తెలియదు. మాకూ తెలియదు.

ఇక ఈ చర్చ ఇంతటితో సరిపోతుందనుకుంటున్నాము. భారతి పట్ల శ్రీ వెంకటరావుగారికి వున్న అభిమానానికి, మా వేదనను వారు సంభావించినందుకు ధన్యవాదాలు.

[నవంబరులో ప్రచురింపబడిన 'ఒక మాట'లో 'అల్లూరి వెంకటేశ్వరరావు' అని వున్నది. అది సరికాదు. 'అల్లూరి వెంకటరావు' అని వుండుట సరి.]

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna
The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/—	రు. 150/—
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/—	రు. 125/—
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/—	రు. 100/—
అర పేజి	...	రు. 65/—	రు. 55/—
పావు పేజి	...	రు. 40/—	రు. 35/—

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥ నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాకు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—0—0
6 మాసముల చందా	...	రు. 6—0—0
విడి ప్రతి	...	రు. 1—0—0

మేనేజరు, భారతి.

మద్రాసు—1.